www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 19-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 351

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 12.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పునర్వసు రా. 8.11 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.7.11-8.55, తె.5.00 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.48-9.36, రా.10.19 తదుపరి 11.05; అమృతఘడియలు: సా.5.35-7.19, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.24, సూర్యాస్తమయం: 6.23 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ముందు టారిఫ్ సబ్సిడీ చెల్లించాల్సిందే

లేదంటే ఉచిత విద్యుత్తు ఇచ్చేందుకు వీల్లేదు.. ఇందుకు విద్యుత్తు చట్టం ఒప్పుకోదు: ఈఆర్‌సీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఈఆర్‌సీ వివరణ



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చట్టంలోని సెక్షన్-62 ప్రకారం రాష్ట్రంలోని వివిధ వర్గాలకు ఉచిత లేదా రాయితీ విద్యుత్తు అందించాలంటే సంబంధిత పంపిణీ సంస్థలకు ప్రభుత్వం ముందుగానే టారిఫ్ సబ్సిడీని చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి(టీఎస్‌ఈఆర్‌సీ) వెల్లడించింది. ప్రభుత్వం ముందస్తు చెల్లింపులు చేయకపోతే రాయితీ లేదా ఉచిత విద్యుత్తు అందించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. చట్ట ప్రకారమే కమిషన్ విధులు నిర్వర్తిస్తుందని, ఇందులో ఎలాంటి పక్షపాతానికి

మిగతా 14వ పేజీలో...

పోటీకి తమిళిసై

తమిళనాడు నుంచి లోక్‌సభ బరిలోకి

సౌత్ చెన్నై లేదా తూత్తుకుడి నుంచి పోటీ

తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ పదవులకు రాజీనామా

రాష్ట్రపతికి రాజీనామా లేఖ.. ఆ తర్వాత చెన్నైకి

గవర్నర్ పదవి నుంచి వైదొలగుతున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యా. అన్నింటికీ మించి తెలంగాణ సోదర, సోదరీమణుల ఆప్యాయత నన్ను బాగా ఆకట్టుకుంది. ఈ రాష్ట్రానికి సేవ చేయడం చాలా ఆనందం కలిగించింది. పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మీరందరూ నన్ను అక్కలా ఆదరించారు. చిరస్మరణీయ జ్ఞాపకాలతో తెలంగాణను వీడుతున్నా. - తమిళిసై



హైదరాబాద్/చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. ఆ పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ గవర్నర్ పదవితోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవిని కూడా వదులుకున్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సోమవారం పంపించారు. అనంతరం చెన్నై బయలుదేరి వెళ్లారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రెండో గవర్నర్‌గా, తొలి మహిళా గవర్నర్‌గా తమిళిసై బాధ్యతలు నిర్వర్తించారు. 2019 సెప్టెంబరు 8న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2021 ఫిబ్రవరిలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై పోటీ చేయనున్నారు. ఈ విషయమై గతంలోనే ప్రచారం జరిగినా.. పలు మార్లు ఆమె తోసిపుచ్చారు. అయితే, తాజాగా లోక్‌సభ టికెట్‌ను బీజేపీ నాయకత్వం ఖరారు చేయడంతో

మిగతా 13వ పేజీలో...

జగిత్యాల విజయ సంకల్ప సభకు భారీగా హాజరైన జనం; (ఇన్‌సెట్) ప్రధాని మోదీ అభివాదం



బీఆర్‌ఎస్ స్కామ్‌లు ఢిల్లీ దాకా

మద్యం విధానం కుంభకోణమే ఇందుకు నిదర్శనం

తెలంగాణ వాదాన్ని వాడుకొని బీఆర్‌ఎస్ దోపిడీ

రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్

ఆ రెండు పార్టీలను ఎన్నికల్లో మట్టి కరిపిస్తాం

తెలంగాణను లూటీ చేసిన పార్టీలను వదలం

బీజేపీకి రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది

17 ఎంపీ స్థానాల్లో గెలిపించి మరింత శక్తినివ్వాలి

నారీ శక్తితో ఇండియా కూటమిని ఓడిస్తాం

జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ

జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ తెలంగాణను దోచుకుందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. బీఆర్‌ఎస్ అవినీతి తెలంగాణకే పరిమితం కాలేదని, ఢిల్లీకి సైతం పాకిందని అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో బీజేపీకి ఎన్ని ఎక్కువ సీట్లు వస్తే, తనకు అంత బలం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించి తనను శక్తిమంతుణ్ని చేయాలని కోరారు. "శక్తి వినాశకారుల నుంచి రక్షించడానికి నాకు మరింత శక్తి కావాలి. ఆ శక్తిని మీరు ఇవ్వాలి" అని మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగిత్యాలలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. దేశంలో, రాష్ట్రాల్లో ఉన్న కుటుంబ పార్టీలు అభివృద్ధి చేయలేదని, దేశంలో జరిగిన అన్ని స్కాంలు కుటుంబ పార్టీల ద్వారానే జరిగాయని ఆరోపించారు. భోఫోర్స్ స్కాం, నేషనల్ హెరాల్డ్ స్కాం కాంగ్రెస్ ద్వారా, 2జీ స్పెక్ట్రమ్ స్కాం డీఎంకే పార్టీ ద్వారా, బిహార్‌లో దాణా స్కాం ఆర్‌జేడీ ద్వారా జరిగాయని, తెలంగాణలో బీఆర్‌ఎస్ ద్వారా కాళేశ్వరం స్కాం జరిగిందని, ఇవన్నీ కుటుంబ పార్టీలేనని అన్నారు. ఈ కుటుంబ పార్టీల వల్ల

మిగతా 13వ పేజీలో...

కేజ్రీ, సిసోడియాతో కవిత కుమ్మక్కు

నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీ లిక్కర్ పాలసీ

ఆప్ నేతలకు 100 కోట్ల ముడుపులిచ్చారు

డీలర్ల నుంచి వచ్చిన డబ్బు పంచుకున్నారు

ఆమె పాత్రను ధ్రువీకరించిన తర్వాతే అరెస్టు

తనిఖీలకు కవిత బంధువుల ఆటంకం

ప్రకటన విడుదల చేసిన ఈడీ

సుప్రీంలో విచారణ ఉండగానే అరెస్టు

నన్ను అరెస్టు చేయడం అక్రమం

సుప్రీంలో కవిత పిటిషన్.. నేడు విచారణ



న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా వంటి ఆప్ అగ్ర నేతలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత కుమ్మక్కయ్యారని, ఢిల్లీ మద్యం విధానం(2021-22) రూపకల్పన, అమలు ద్వారా అక్రమంగా ప్రయోజనాలు పొందాలని చూశారని ఈడీ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆప్ నేతలకు రూ.వంద కోట్ల ముడుపులు చెల్లించడంలో కవిత కీలక పాత్ర పోషించారని వివరించింది. ముడుపుల రూపేణా చెల్లించిన సొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు, లాభాలు ఆర్జించేందుకు వీలుగా మొత్తం కుట్ర జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా మద్యం

మిగతా 13వ పేజీలో...

బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే



అరకొర సమాచారం ఇస్తే కుదరదు.. ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఫైర్

ఎల్లుండి సాయంత్రం ఐదింటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం

చట్టం చేతులు చాలా పొడుగని వ్యాఖ్య

యునిక్ నంబర్ల వెల్లడిపై తీర్పు వాయిదా వేయాలని అసోచాం, ఫిక్కీ, సీఐఐ విజ్ఞప్తి

వారి అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనం

ప్రధానమంత్రి హఫ్తా వసూలీ యోజన

ఎన్నికల బాండ్లపై కాంగ్రెస్ ధ్వజం

ఐటీ, ఈడీ దాడుల తర్వాత బాండ్లు కొన్న తెలుగు కంపెనీల పేర్లు చెప్పిన జైరామ్

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల వ్యవహారంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తీరును సుప్రీంకోర్టు సోమవారం తప్పుపట్టింది. బాండ్లకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించి తీరాల్సిందేనని.. ఎంపిక చేసిన అరకొర సమాచారం ఇస్తే కుదరదని తేల్చిచెప్పింది. ఈసారి ఇచ్చే వివరాల్లో.. బాండ్లను కొన్నవారికి, వాటిని అందుకున్న రాజకీయ పార్టీలకు మధ్య సంబంధాన్ని బయటపెట్టే యునిక్ నంబర్లు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వడంలో ఎస్‌బీఐ జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), సీపీఎం, సిటిజన్ రైట్స్ ట్రస్ట్(సీఆర్టీ)లు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ కలిపి.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారనే విషయాన్ని తెలియజేసే యునిక్ బాండ్ నంబర్లతో సహా అన్ని వివరాలనూ ఎస్‌బీఐ ఈసీకి

మిగతా 2వ పేజీలో...

ఖాజాగూడలో జాగా మాయ

రూ.55 కోట్ల విలువైన 2,742 చదరపు గజాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

జీవో 59 ఆధారంగా క్రమబద్ధీకరణ

ఖాళీ స్థలంలో 10 ఇళ్లు ఉన్నట్లు పత్రాలు

అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే రెగ్యులరైజేషన్

చక్రం తిప్పిన గత ప్రభుత్వంలోని న్యాయవాది

ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట క్రమబద్ధీకరణ

ఆ వెంటనే ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయం

అప్పటి ప్రభుత్వంలోని బీఆర్‌ఎస్ పెద్దల అండ, సహకారంచిన రెవెన్యూ అధికారులు

సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి 59 జీవో అక్రమాలు

రంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్మాణాలకు అనుమతించొద్దంటూ ఉత్తర్వులు

క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు



క్రమబద్ధీకరించిన స్థలం ఇదే (రేకులు ఉన్నది)

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అది రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని అత్యంత ఖరీదైన ఖాజాగూడ ప్రాంతం! గచ్చిబౌలి నుంచి నానక్‌రాంగూడకు వెళ్లే మార్గంలో సైబరాబాద్ కమిషనరేట్‌కు సంబంధించిన స్థలంతో పాటు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తదితర ప్రముఖ సంస్థలు ఉండడంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి! అయితే గజం రూ.2 లక్షలకుపైగానే ఉన్న ఆ ప్రాంతంలో సర్వే నంబరు 28లోని 2,742 చదరపు గజాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన '59వ నంబరు జీవో'ను ఆధారంగా చేసుకొని రూ.55 కోట్ల విలువైన సర్కారు భూమిని క్రమబద్ధీకరించుకున్నారు. ఈ మేరకు మొత్తంగా ఎనిమిది మంది ప్రైవేటు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి భూమిని తమ పేరిట మార్చుకున్నారు. పైగా ఈ స్థలాన్నంతా వెంటనే ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించారు. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ అంతా అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్

మిగతా 14వ పేజీలో...

దానంపై అనర్హత వేటేయాలి

స్పీకర్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వినతి

కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలకు తాము బాధ్యులం కాదని వ్యాఖ్య

దానం 'సభ్యత్వం' రద్దయినట్లే: వినోద్

12



పార్టీ మారడం ఖాయం!

నేను పార్ట్ టైం పొలిటీషియన్.. ఫుల్ టైం బిజినెస్‌మెన్‌ను



వ్యాపారాలకు ఇబ్బందుల్లేకుండా రాజకీయ నిర్ణయాలు

ఇక్కడి నేతలు అడ్డుపడుతున్నారని డీకే వద్ద చెప్పాను

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు స్పష్టం చేసిన మల్లారెడ్డి

కాంగ్రెస్‌లో కుదరకపోతే బీజేపీలో చేరేందుకూ రెడీ!

బీఆర్‌ఎస్‌లోనే ఉంటానన్న మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్‌రెడ్డి

12

బీఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కేసీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలో చేరిక

తెలంగాణవాదానికి బహుజన వాదం తోడు

కేసీఆర్ లెక్కనే నేనూ మాటిస్తే తప్పను: ప్రవీణ్

పార్టీని వీడే వాళ్లు చిల్లరతో సమానం

ప్రవీణ్‌ను బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి చేస్తా

దళిత బంధును పాజిటివ్‌గా తీసుకోలేదు

బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నేతలతో కేసీఆర్

ప్రియాంకతో రేవంత్ భేటీ

దీపాదాస్ మున్షీతో కలిసి సమావేశం

నేడు కాంగ్రెస్ సీఈసీ భేటీకి సీఎం హాజరు

అభ్యర్థుల మూడో జాబితాపై సీఈసీ కసరత్తు

తెలంగాణలోని సీట్లకు నేడే అభ్యర్థుల ఖరారు

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని కలుసుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్న రేవంత్.. నేరుగా యమునా బ్లాక్‌లోని తన నివాసానికి వెళ్లి విడిది చేశారు. సాయంత్రం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ప్రియాంక నివాసానికి వెళ్లి కలిశారు. అరగంటపాటు చర్చలు జరిపారు. ఇక మంగళవారం

మిగతా 12వ పేజీలో...

కడప బరిలో షర్మిల!

వివేకా హత్య కేసు నిందితుడు అవినాశ్‌పై పోటీ

రాహుల్ సూచనకు ఓకే చెప్పిన పీసీసీ సారథి?

బెంగాల్ డీజీపీపై వేటు

పోలీస్ బాస్‌ను తప్పించిన ఈసీ

వెనువెంటనే కొత్త డీజీపీ నియామకం

ఆరు రాష్ట్రాల హోం సెక్రటరీల మార్పు

వీటిల్లో మూడు బీజేపీ పాలిత రాష్ట్రాలు

వారందరికీ ఎన్నికల విధులు అప్పగించొద్దు

సీఎస్‌లకు ఆదేశాలు జారీ చేసిన ఈసీ

బృహన్‌ముంబై కార్పొరేషన్ బదిలీలపై సీరియస్ హెచ్చరికలు.. సీఎస్‌పై ఆగ్రహం!

ఏపీలోనూ పలువురు అధికారులపై చర్యలు?

2

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

ఈసీ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ చర్యలు

అసెంబ్లీ ఎన్నికల తర్వాత 8.54 లక్షల ఓట్లు తొలగించాం

రాష్ట్రంలో 3.3 కోట్ల మంది ఓటర్లు


ఉద్యోగుల పోస్టల్ ఓటింగ్ కోసం కొత్త సాఫ్ట్‌వేర్

తెలంగాణ సీఈవో వికాస్‌రాజ్

13

రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా ఇద్దరు జడ్జిలు

మధ్యప్రదేశ్, కలకత్తా నుంచి బదిలీ.. నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం



జస్టిస్ మౌషుమి

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల హైకోర్టుల నుంచి తెలంగాణ హైకోర్టుకు నూతనంగా ఇద్దరు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ సుజయ్ పాల్, కలకత్తా హైకోర్టుకు చెందిన జస్టిస్ మౌషుమి భట్టాచార్య బదిలీలకు

మిగతా 12వ పేజీలో...



జస్టిస్ సుజయ్

రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

» మరో ఆరేళ్ల పాటు ఆయనే దేశాధినేత..!

» నాటోతో ఘర్షణ.. 3వ ప్రపంచ యుద్ధమే: పుతిన్



మాస్కో, మార్చి 18: ప్రపంచంలో అతిపెద్ద దేశమైన రష్యాకు వ్లాదిమిర్ పుతిన్ (71) మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వచ్చే ఆరేళ్లపాటు ఆయన పదవిలో ఉండనున్నారు. శుక్రవారం మొదలైన రష్యా ఎన్నికల పోలింగ్ మూడు రోజుల పాటు జరిగింది. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సోమవారం ఫలితం వెల్లడిస్తూ.. పోలైన ఓట్లలో పుతిన్‌కు 87.29% వచ్చాయని తెలిపింది. 7.6కోట్ల మంది పుతిన్‌కు అనుకూలంగా ఓటేశారని వివరించింది. తాజా ఎన్నికలతో కలిపి ఐదుసార్లు అధ్యక్షుడిగా పోటీచేసిన ఆయనకు ఇవే అత్యధిక ఓట్లు కావడం గమనార్హం. పుతిన్ మరో ఆరేళ్లు.. అంటే 2030 వరకు రష్యా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 1924-53 మధ్య సోవియట్ యూనియన్‌ను 29 ఏళ్ల పాటు నిరాటంకంగా పాలించిన జోసెఫ్ స్టాలిన్ రికార్డును బద్దలుకొట్టనున్నారు. 1999లో ప్రధాని అయిన పుతిన్.. 2000-08 మధ్య రెండుసార్లు దేశాధినేతగా, 2008-12 కాలంలో మరోసారి ప్రధానిగా వ్యవహరించారు. అధ్యక్షుడి పదవీ కాలాన్ని ఆరేళ్లకు పెంచాక 2012, 2018లోనూ గెలిచారు. మరోవైపు తాజా ఘన విజయం అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు. అమెరికా సారథ్యంలోని నాటో కూటమితో గనుక తమకు ఘర్షణ తలెత్తితే అది 3వ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. తన బద్ధ విరోధి అయిన అలెక్సీ నావల్నీ మృతిపైనా పుతిన్ తొలిసారి స్పందించారు. జైలు నుంచి విడుదల చేయాలనుకుంటున్న సమయంలోనే ఆయన మృతిచెందారని తెలిపారు.

అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 8మంది మృతి

ఇస్లామాబాద్/కాబూల్, మార్చి 18: అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ సోమవారం వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పాకిస్థాన్ నగరాల్లో ఇటీవల జరిగిన ఉగ్రదాడులపై ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో తాజా దాడులు చోటుచేసుకున్నాయి. పాకిస్థాన్ సరిహద్దు వెంబడి ఉన్న అఫ్ఘనిస్థాన్ ప్రావిన్సులు పక్తికా, ఖోస్ట్‌లో వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడులను అఫ్ఘాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. కాగా ఉత్తర వజీరిస్థాన్‌లోని భద్రతా బలగాల పోస్ట్‌పై జరిగిన ఉగ్రదాడితో ఏడుగురు జవాన్లు మృతి చెందడంతో దానికి ప్రతీకారం తీర్చుకుంటామని పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ప్రతిన బూనిన మరుసటి రోజే వైమానిక దాడులు జరగడం చర్చనీయాంశమైంది.

మంత్రిగా పొన్ముడి ప్రమాణానికి గవర్నర్ నో

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు మళ్లీ శాసనసభ్యత్వం పొందిన తమిళనాడు మాజీ మంత్రి కె.పొన్ముడి చేత మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు నిరాకరించిన గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై అత్యవసర విచారణకు ధర్మాసనం అంగీకరించింది. ఆదాయానికి మించి అక్రమార్జనకు పాల్పడిన కేసులో పొన్ముడికి హైకోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆయన ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. దాంతో ఉన్నతవిద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా, హైకోర్టు విధించిన శిక్షను సవాలు చేస్తూ పొన్ముడి సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు విధించిన జైలు శిక్షను నిలుపుదల చేసింది. దాంతో ఆయన మళ్లీ శాసనసభ్యత్వం పొందారు. పొన్ముడిని మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించిన స్టాలిన్.. ఆ మేరకు ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించాలని గవర్నర్‌కు ఇటీవల లేఖ రాయగా.. గవర్నర్ అందుకు నిరాకరించారు.

మరో ఏడాది పాటు యూరియా దిగుమతులు

న్యూఢిల్లీ, మార్చి 18: దేశంలో యూరియా కొరత లేకుండా చేసేందుకు కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో ఏడాది పాటు యూరియాను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు 'ఇండియా పొటాష్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ప్రభుత్వ అకౌంట్ ద్వారా యూరియా దిగుమతులు జరగనున్నాయి. ఈ మేరకు డైరక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య కాలంలో భారత్ 1.81 బిలియన్ డాలర్ల విలువైన యూరియాను దిగుమతి చేసుకుంది. భారత్ ప్రధానంగా చైనా, ఒమన్, రష్యా దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకుంటోంది.

రెండేళ్ల పిల్లాడికి స్నానం లైంగిక వేధింపా?

» చైల్డ్ అబ్యూజ్ అంటూ మెయిల్‌ను బ్లాక్ చేసిన గూగుల్

» స్నానం చేయిస్తున్నది తన నానమ్మేనని బాధితుడి వివరణ

» స్పందించని గూగుల్..గుజరాత్ హైకోర్టులో పిటిషన్

అహ్మదాబాద్, మార్చి 18: తనకు రెండేళ్ల వయస్సున్నప్పుడు నాయనమ్మ స్నానం చేయిస్తున్న ఫొటోను ఓ వ్యక్తి గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేశాడు. ఫొటోలో బాలుడు నగ్నంగా ఉండటంతో దాన్ని "చిన్న పిల్లలపై వేధింపు"గా భావించిన గూగుల్ సంస్థ అతడి ఈ మెయిల్ ఖాతాను బ్లాక్ చేసింది. స్నానం చేయిస్తున్నది తన నాయనమ్మ అని, అందులో వేధింపులేవీ లేవని సదరు వ్యక్తి గూగుల్‌కు ఎన్నోసార్లు వివరణ ఇచ్చాడు. అయినా, సంస్థ అతని ఈ మెయిల్ ఖాతాను అన్‌బ్లాక్ చేయకపోవడంతో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. గుజరాత్‌కు చెందిన కంప్యూటర్ ఇంజనీర్ నీల్‌శుక్లా చిన్ననాటి జ్ఞాపకాలను పదిలపర్చుకోవడం కోసమని నాటి ఫొటోలను గతేడాది ఏప్రిల్‌లో గూగుల్ డ్రైవ్‌లోకి అప్‌లోడ్ చేశారు. అందులో తన నాయనమ్మ అతనికి స్నానం చేయిస్తున్న ఫొటో కూడా ఉంది. దీంతో గూగుల్ అతని అకౌంట్‌ను బ్లాక్ చేసింది. దీనిపై నీల్‌శుక్లా గూగుల్‌కు వివరణ ఇవ్వడంతో పాటు, గుజరాత్ పోలీసులను, భారత్‌లో నోడల్ ఏజెన్సీ అయిన సెంటర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఆశ్రయించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 12న గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏడాది కాలంగా ముఖ్యమైన మెయిల్స్ చూడకపోవడం వల్ల తన వ్యాపారానికి నష్టం వాటిల్లిందని అందులో తెలిపారు. దీనిపై సత్వరమే విచారణ జరపాలని కోరారు. దీంతో కోర్టు గూగుల్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు పంపించింది. ఈ నెల 26వ తేదీలోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాల్సిందేనని పేర్కొంది. ఈమేరకు ఏ వివరాన్నీ దాచకుండా, తమ వద్ద ఉన్న మొత్తం సమాచారాన్ని వెల్లడించినట్టుగా పేర్కొంటూ గురువారం (మార్చి 21) సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ చైర్మన్, ఎండీకి ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. 2018 మార్చి 1 నుంచి 2019 ఏప్రిల్ 11 దాకా జారీ అయిన బాండ్ల వివరాలను కూడా సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ధర్మాసనం తిరస్కరించింది. అలాగే.. ఎన్నికల బాండ్ల వివరాలు బయటపెట్టాలంటూ తాము ఇచ్చిన తీర్పుపై సుమోటోగా సమీక్ష జరపాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రచారం కోసం చేసే ఇలాంటి పనులను తాము అనుమతించబోమని జస్టిస్ చంద్రచూడ్ తేల్చిచెప్పారు. కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా.. ఆ లేఖ పూర్తిగా అవాంఛనీయమని ఆయన పేర్కొన్నారు. అయితే.. బాండ్ల వివరాలు కోరుతూ కోర్టును ఆశ్రయించినవారు మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ ఉద్దేశపూర్వకంగా కోర్టును ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని.. బాండ్లకు సంబంధించి అంకెలను వక్రీకరించి చూపుతున్నారని ఆయన కోర్టుకు తెలిపారు. వాటిని నియంత్రించాలని కోరారు. దీనికి సీజేఐ.. ఒక వ్యవస్థగా చట్టం చేతులు చాలా పొడవైనవేనని.. కానీ, న్యాయమూర్తులుగా తాము రాజ్యాంగం ప్రకారం ప్రకారం తీర్పులు ఇస్తామని, రూల్ ఆఫ్ లా ప్రకారమే నడుచుకుంటామని.. తాము ఇచ్చిన ఆదేశాల అమలు జరుగుతోందా లేదా అన్నదే తమకు ముఖ్యమని.. ఒకసారి తీర్పు ఇచ్చాక అది ప్రజల సొత్తు అని, దానిపై చర్చలు జరపవచ్చన్నారు. తాము కూడా సోషల్ మీడియాలో కామెంట్లకు అతీతులం కాదన్నారు.



అలా ఎలా అడుగుతారు?

ఎన్నికల బాండ్ల వివరాలను బయటపెట్టాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వాయిదా వేయాలని కోరుతూ అసోచాం, ఫిక్కీ, సీఐఐ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. వాటి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. బాండ్ల పథకం ప్రవేశపెట్టినప్పుడు దాతల గోప్యతను కాపాడతామని చెప్పారని, అలాంటిది ఇప్పుడు ఆ వివరాలు ఎలా బయటపెడతారని ప్రశ్నించారు. దీనికి ధర్మాసనం.. ఆ వివరాలను బయటపెట్టాలంటూ 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఆ విషయం అందరికీ తెలుసని, దాతలకు కూడా తెలుసని.. తెలిసే ఇచ్చారని పేర్కొంది. అందుకే తాము కూడా ఆ రోజు నుంచీ పార్టీలకు వచ్చిన విరాళాలకు సంబంధించి పూర్తివివరాలు ఇవ్వాలని ఆదేశించాం తప్ప.. అంతకు ముందు జారీ అయిన బాండ్ల వివరాలను అడగలేదని గుర్తుచేసింది.

అందుకే ఇవ్వలేదు..

ఎన్నికల బాండ్ల వివరాలను ఎందుకు బయటపెట్టలేదనే ప్రశ్నకు.. ఒక్కో పార్టీ ఒక్కోరకంగా వివరణ ఇచ్చాయి. కొన్ని పార్టీలు ఆయా బాండ్లు తమకు కొరియర్‌లో ఊరూ పేరూ లేకుండా వచ్చాయని, వాటిని సొమ్ము చేసుకున్నాం తప్ప వాటిని పంపిందెవరో తమకు తెలియదని చెప్పగా.. మరికొన్ని పార్టీలు చట్టంలో ఉన్న నిబంధనలను అడ్డుపెట్టుకుని ఆ వివరాలను సమర్పించలేదు. ప్రజాప్రాతినిధ్యచట్టం నిబంధనల ప్రకారం తాము డోనర్ల వివరాలు వెల్లడించట్లేదని బీజేపీ పేర్కొంది.

పీఎం వసూలీ యోజన..

ఎన్నికల బాండ్ల పథకాన్ని కాంగ్రెస్ పార్టీ.. 'ప్రధాన మంత్రి హఫ్తా వసూలీ యోజన'గా అభివర్ణించింది. అంటే ప్రధానమంత్రి మామూళ్ల వసూలు పథకం అని అర్థం. సీబీఐ, ఈడీ, ఐటీ దర్యాప్తును ఎదుర్కొంటున్న 21 సంస్థలు.. బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో విరాళాలు సమర్పించాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిని మనీలాండరింగ్ కేసులో 2022 నవంబరు 10న ఈడీ అరెస్టు చేస్తే.. నవంబరు 15న ఆ సంస్థ రూ.5 కోట్ల విలువ చేసే బాండ్లు కొనుగోలు చేసిందని వెల్లడించారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థపై 2023 డిసెంబరు 20న ఐటీ దాడులు జరిగితే.. 2024 జనవరి 11న ఆ సంస్థ రూ.40 కోట్ల విలువైన బాండ్లు కొన్నట్టు తెలిపారు. 2023 నవంబరులో రెడ్డీస్‌ల్యాబ్స్‌కు చెందిన ఉద్యోగిపై ఐటీ దాడులు జరిగాయని.. ఆ తర్వాత ఆ కంపెనీ రూ.62 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసిందని వెల్లడించారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ, మార్చి 18: ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ) కేసులో సోమవారం విచారణకు రావాలంటూ ఈడీ ఇచ్చిన సమన్లను సీఎం కేజ్రీవాల్ పట్టించుకోలేదు. విచారణ నిమిత్తం ఆ సంస్థ కార్యాలయానికి వెళ్లలేదు. ఇప్పటికే మద్యం కుంభకోణంలో ఈడీ ఇచ్చిన ఎనిమిది సమన్లను విస్మరించిన కేజ్రీవాల్..జల్ బోర్డు కేసులో వచ్చిన మొదటి సమన్లను కూడా బేఖాతరు చేశారు. జల్ బోర్డు వ్యవహారాల్లో మనీ లాండరింగ్ జరిగిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ సాయంతో లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించింది. బీజేపీ రాజకీయ అజెండాను అమలు చేయడాన్ని ఈడీ ఎప్పుడు నిలిపివేస్తుందో అర్థం కావడం లేదని ఆప్ ఢిల్లీ యూనిట్ కన్వీనర్ గోపాల్ రాయ్ అన్నారు.

కాంగ్రెస్ రెబల్స్ అనర్హతపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, మార్చి 18: హిమాచల్ ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన అనర్హత ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్ ధిక్కరించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు ఆరుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అనర్హతను తొలగించాలంటూ సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని స్పీకర్‌ను కోరుతూ ఆయన కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది. అలాగే పిటిషన్‌పై తమ నిర్ణయాన్ని వెల్లడించే వరకు ఆరుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు, ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుమతించకూడదని స్పష్టం చేసింది. అయితే ఆ 6 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా ప్రకటించిన నేపథ్యంలో దానిపై స్టే విధించే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని కోర్టు పేర్కొంది. అలాగే రెబల్ ఎమ్మెల్యేలు కౌంటర్ దాఖలు చేసేందుకు వారం గడువునిస్తూ కేసును మే 6వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు, ఆ ఆరు స్థానాలకు మే 7వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	38.0	23.4
ఆదిలాబాద్	37.0	23.2
ఖమ్మం	35.0	26.0
సంగారెడ్డి	35.0	26.0

మొబైల్ నంబర్ పోర్టబిలిటీకి కొత్త నిబంధన

న్యూఢిల్లీ, మార్చి 18: మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ).. మన టెలికం ఆపరేటర్ అందిస్తున్న సేవలు నచ్చకపోతే వేరే ఆపరేటర్‌కు మారే వీలు కల్పించే విధానం ఇది. అయితే.. కొందరు సైబర్ క్రిమినల్స్ సిమ్ స్వాపింగ్ మోసాలతో దీన్ని దుర్వినియోగం చేస్తున్నారు. దాన్ని అరికట్టేందుకుగాను ట్రాయ్.. ఎంఎన్‌పీ నిబంధనలకు ఓ సవరణ చేసింది. అదేంటంటే.. సిమ్ స్వాప్ చేసిన వారం రోజులలోపు మీరు మీ మొబైల్ నంబర్‌ను వేరే ఆపరేటర్‌కు మార్చుకోలేరు. సిమ్ స్వాప్ అంటే.. ఉదాహరణకు మీ వద్ద పాతకాలం మొబైల్ ఉందనుకోండి. అందులో మామూలు పెద్ద సిమ్ కార్డు పడుతుంది. ఆ ఫోన్ పాడైపోవడంతో కొత్త ఫోన్ కొన్నారు. దాంట్లో మైక్రో సిమ్ కార్డు మాత్రమే పడుతుంది. అప్పుడు మీరు మీ ఆపరేటర్‌ను అడిగితే..మైక్రో సిమ్ ఇస్తారు. దీన్నే సిమ్ స్వాప్ అంటారు. అయితే, సైబర్ నేరగాళ్లు మన ఫోన్‌లో సమాచారాన్నంతా దొంగిలించి.. దాని ఆధారంగా మన వివరాలతో మన నంబర్‌నే వాళ్లు సిమ్ స్వాప్ ద్వారా పొందితే? అప్పుడు మనకు రావాల్సిన ఓటీపీలన్నీ వారికే వెళ్లిపోతాయి. మన బ్యాంకు ఖాతాలు ఖాళీ అయిపోతాయి. ఈ ముప్పును తప్పించడానికే ట్రాయ్ కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఇది జూలై 1 నుంచి అమల్లోకి రానుంది.

అబద్ధాలే కాంగ్రెస్ అజెండా

పచ్చి అబద్ధాలతోనే కర్ణాటకలో అధికారంలోకి: మోదీ



బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సమర్థ భారత నిర్మాణమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. కాంగ్రెస్‌కు అభివృద్ధి లక్ష్యం లేకపోగా అబద్ధాలే అజెండాగా మారాయని విమర్శించారు. కర్ణాటకలోని శివమొగ్గ, తమిళనాడులోని కోయంబత్తూరుల్లో సోమవారం భారీ రోడ్‌షోలను ప్రధాని నిర్వహించారు. శివమొగ్గలో నిర్వహించిన బహిరంగసభలో మోదీ మాట్లాడుతూ కర్ణాటకలో నలుగురు ముఖ్యమంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. "ఒకరు ప్రస్తుత సీఎం, మరొకరు భావి సీఎం, ఇంకొకరు సూపర్ సీఎం, మరొకరు షాడో సీఎం, వీరితోపాటు ఢిల్లీలో కలెక్షన్ సీఎం కూడా ఉన్నారు" అంటూ పరోక్షంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. పచ్చి అబద్ధాల ప్రచారంతోనే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సి ఉండగా, ఉచిత గ్యారెంటీ పథకాలకు ధారపోస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, కాంగ్రెస్ చేసిన అప్పులు రానున్న రోజుల్లో ప్రజలు తీర్చాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాల్లో ఎన్డీయేను గెలిపించి, 400 సీట్ల లక్ష్యంలో కీలక పాత్ర పోషించాలని కన్నడ ప్రజలను మోదీ కోరారు.

బిహార్‌లో బీజేపీ 17.. జేడీయూ 16 స్థానాల్లో పోటీ

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఎన్డీయే కూటమి పార్టీల మధ్య లోక్‌సభ సీట్ల పంపకాలు సోమవారం ఖరారయ్యాయి. బీజేపీ 17 స్థానాల్లో, నితిశ్ కుమార్ పార్టీ జేడీయూ 16 చోట్ల పోటీ చేయనున్నాయి. ఇక ఎన్డీయేలో భాగస్వాములైన చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ 5 స్థానాల్లో పోటీ చేయనుండగా, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థాన్ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహా పార్టీ అయిన ఆర్‌ఎల్‌ఎం చెరో స్థానంలో రంగంలోకి దిగనున్నాయి. బిహార్ సీఎం నితీశ్ కుమార్.. కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలతో కూడిన మహాగట్బంధన్‌కు వీడ్కోలు పలికి జనవరిలో బీజేపీతో జత కట్టి ప్రభుత్వాన్ని ఏర్పరచిన సంగతి తెలిసిందే. బిహార్‌లో 40 లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మాటల యుద్ధంలో 'శక్తి'

రాహుల్ ప్రసంగంపై రాజకీయ దుమారం

» 'అధికారం' అన్న భావంలో పద ప్రయోగం

» దుర్గాదేవిని ఉద్దేశించినవేనని బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. 'శక్తి' అన్న విషయమై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. 'అధికారం' అన్న అర్థం వచ్చే రీతిలో 'శక్తి' అన్న పదాన్ని రాహుల్ ఉపయోగించగా, ఇది దుర్గాదేవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్య అంటూ బీజేపీ విమర్శలు సంధించింది. సాక్షాత్తూ ప్రధాని మోదీయే దీనిపై స్పందించడంతో విమర్శలు, ప్రతివిమర్శలు ప్రారంభమయ్యాయి. బీజేపీ విమర్శలకు ప్రతిస్పందించిన కాంగ్రెస్.. ప్రస్తుత ఎన్నికలు అసుర శక్తి అయిన బీజేపీ, దైవిక శక్తిని అయిన ఇండియా కూటమి మధ్య జరిగే పోరాటమని పేర్కొంది. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఆదివారం ముంబైలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఈడీ, సీబీఐ, ఐటీ, ఈవీఎంలు లేకుండా మోదీ ఎన్నికల వెళ్లలేరని, వాటిని దుర్వినియోగం చేస్తున్న ఆ శక్తి(అధికారానికి)కి వ్యతిరేకంగా పోరాడతామని అన్నారు. "మోదీపై చేస్తున్న పోరాటం ఆయనపై వ్యక్తిగతంగా చేస్తున్నది కాదు. ఎందుకంటే ఆయన ఓ 'శక్తి' (అధికారం)కి ముసుగు మాత్రమే' అని విమర్శించారు. అయితే 'శక్తి' అన్న పదం దుర్గాదేవికి సంబంధించినది కావడంతో బీజేపీ ఆ కోణంలో విమర్శలు ప్రారంభించింది. సోమవారం జగిత్యాలలో మోదీ మాట్లాడుతూ.. "వారు 'శక్తి'పై పోరాటం చేస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టారు. నాకైతే ప్రతి తల్లి, చెల్లి శక్తి స్వరూపులే. నేను శక్తిని ఆరాధిస్తాను. నేను భారత మాత పూజారిని" అని అన్నారు. శక్తిని నాశనం చేయాలనుకునేవారికి, శక్తి ఆరాధకులకు మధ్య పోరాటం జరుగుతోందని, శక్తి స్వరూపిణులైన మహిళలందరూ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



వక్రీకరించడం మోదీకి అలవాటే

ప్రధాని వ్యాఖ్యలపై రాహుల్ ట్వీట్ చేస్తూ తన మాటలను వక్రీకరిచడానికి మోదీ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటారని చెప్పారు. తాను శక్తి గురించి చేసిన వ్యాఖ్యలు మోదీకి ఉన్న అధికారం గురించేనని స్పష్టం చేశారు. మోదీ అధికారానికి దేశ మీడియా రాత్రింబవళ్లు సెల్యూట్ చేస్తూ సత్యాన్ని అణచివేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ పెడర్థాలు తీసి, ప్రజల దృష్టిని మళ్లించడంలో మోదీ మాస్టర్ అని విమర్శించారు. "రాహుల్ గాంధీ 'అసుర శక్తి'పై దాడి ప్రారంభించగానే కంగారు పడ్డ ప్రధాని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మహిళా రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ వేధించినప్పుడు ప్రధాని ఏ 'శక్తి'ని పూజించారు? కథువా, ఉన్నావ్, హత్రాస్ రేపిస్టులకు మద్దతుగా బీజేపీ శ్రేణులు ఊరేగింపులు జరిపినప్పుడు శక్తిని పూజించాలని మోదీకి గుర్తుకు రాలేదా" అని పవన్ ఖేరా ప్రశ్నించారు.

హైవేపై విమానాలు!

కొరిశపాడు-రేణంగివరం రహదారిపై ల్యాండింగ్

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రయ్ రయ్ మంటూ వాయుసేన విమానాల విన్యాసాలు... 4.1 కిలోమీటర్ల పొడవుగల రన్‌వేపై విమానాలు ఒకదాని వెంట ఒకటి ల్యాండింగ్... అత్యంత అరుదుగా కనిపించే ఈ దృశ్యానికి ఏపీలో బాపట్ల జిల్లాలోని కొరిశపాడు-రేణంగివరం మధ్య హైవేపై నిర్మించిన ఎమర్జెన్సీ రన్‌వే (ఎయిర్ స్ట్రిప్) వేదికైంది. నూతనంగా నిర్మించిన ఈ అత్యవసర రన్‌వేను ఎయిర్‌ఫోర్స్, హైవే అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ అధికారులు దీనిపై విమానాల ల్యాండింగ్‌కు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించారు. విమానాలు రోడ్డుపై దిగుతున్నాయని తెలిసి.. వాటిని తిలకించడానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో 528 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతీయ రహదారి-16పై ఉదయం తొమ్మిది గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సడలించి వాహనాలను అనుమతించారు.



లక్ష్మీనృసింహుడి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. లక్ష్మీనృసింహుడి కల్యాణం!

» వైభవంగా యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు.. పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల

యాదగిరిగుట్ట, మార్చి 18: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక బ్రహ్మోత్సవ, తిరుకల్యాణోత్సవ వైదిక పర్వాలు సోమవారం రాత్రి వైభవోపేతంగా సాగాయి. లోకకల్యాణం, విశ్వశాంతి కోసం లక్ష్మీదేవితో లక్ష్మీనృసింహుడి తిరుకల్యాణోత్సవ తంతును వేదమంత్ర పఠనాలు గోవింద నామస్మరణల మధ్య నిర్వహించారు. ప్రధానాలయ ఉత్తరదిశలో రకరకాల పుష్పాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఎదురెదురుగా అధిష్ఠింపచేసిన ఆచార్యులు పాంచారాత్రగమ శాస్త్రరీతిలో విశ్వక్సేనుడికి పూజలు జరిపి కల్యాణతంతును ప్రారంభించారు. సాక్షాత్తు బ్రహ్మ నిర్ణయించిన సుముహూర్తం తులా లగ్నంలో మాంగళ్యం తంతు నానేనా.. లోకరక్షణ హేతునా అనే అర్చకస్వాముల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి అమ్మవారి మెడలో మాంగళ్యధారణ గావించారు. ఈ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను దేవస్థాన ఈవో భాస్కర్‌రావు దంపతులు అందజేశారు. ఈ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బెంగాల్ డీజీపీపై ఈసీ వేటు

» ఆరు రాష్ట్రాల హోం సెక్రటరీలపైనా..

» వీటిలో 3 బీజేపీ పాలిత రాష్ట్రాలు



న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ.. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) పలువురు బ్యూరోక్రాట్లపై బదిలీ వేటు వేసింది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల తరఫున ఎన్నికలను ప్రభావితం చేసేందుకు అవకాశాలున్న బ్యూరోక్రాట్లపై ఈ చర్యలు తీసుకుంది. అధికార పార్టీలకు విధేయులుగా ఉండేవారు.. ఒకటి కంటే ఎక్కువ శాఖలకు బాధ్యత వహిస్తున్న వారిని గుర్తించి, వారి జాబితాను పంపుతూ.. వెంటనే బదిలీ చేయాలంటూ ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఇలా బదిలీ అయిన అధికారులకు ఎన్నికల విధులతో సంబంధం లేని పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచించింది. ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్ డీజీపీ రాజీవ్‌కుమార్ ఉన్నారు. ఆయన పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీకి కుడిభుజంగా పని చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 2016 అసెంబ్లీ ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పశ్చిమబెంగాల్ డీజీపీని బదిలీ చేయడం గమనార్హం..! రాజీవ్‌కుమార్‌పై ఈసీ బదిలీ వేటు వేయడంతో.. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌ల పేర్లను ఈసీకి పంపారు. వారిలోంచి వివేక్ సాహాను ఈసీ ఎంపిక చేయగా.. వెనువెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే.. 2021లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివేక్ సాహాపైనా ఈసీ వేటు వేయడం గమనార్హం..! ఆరు రాష్ట్రాల- గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల హోంశాఖ కార్యదర్శులను కూడా బదిలీ చేయాలని ఆయా రాష్ట్రాల సీఎస్‌లను ఆదేశించింది. వీటిల్లో గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ బీజేపీ పాలిత ప్రాంతాలు కావడం గమనార్హం..! వీరంతా హోంశాఖ కార్యదర్శులుగా ఉంటూనే.. ఇతర విభాగాల బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నట్లు గుర్తించినట్లు ఈసీఐ పేర్కొంది. ఇలాంటి కారణాలతోనే మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ జీఏడీ కార్యదర్శులను కూడా బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆయా స్థానాల్లో కొత్తగా నియమించాలనుకుంటున్న అధికారుల జాబితా(మూడేసి మంది పేర్లు) తమకు పంపాలని, తాము నియామకానికి అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. కాగా.. పశ్చిమబెంగాల్ డీజీపీని ఈసీ బదిలీ చేయడంపై టీఎంసీ సీరియస్‌గా స్పందించింది. ఈసీని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం బీజేపీ నైజమని టీఎంసీ నేత కునాల్ ఘోష్ ఆరోపించారు.

ఏపీపైనా ఫోకస్..!

సొంత జిల్లాల్లో.. ఒకే స్థానంలో మూడేళ్లకుపైగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఇప్పటికే ఈసీఐ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే..! ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలువురు ఉన్నతాధికారులపై కొరడా ఝుళిపించేందుకు ఈసీ సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇంతకు ముందే.. ప్రతిపక్షాలు జగన్ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న పలువురు ఉన్నతాధికారుల జాబితాను ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన విషయం తెలిసిందే.

మహారాష్ట్ర సీఎస్‌పై సీరియస్!

బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ)లో కమిషనర్ ఇక్బాల్‌సింగ్ సహా.. ఓ అదనపు కమిషనర్లు, ఇంకో డిప్యూటీ కమిషనర్‌ను తొలగించాలని ఈసీఐ ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. అయితే.. బీఎంసీ విషయంలో మూడేళ్ల నిబంధన నుంచి మినహాయింపునివ్వాలని, కొవిడ్ సమయంలో ఇక్బాల్‌సింగ్ విశేష సేవలందించారని పేర్కొంటూ ఈసీఐకి సీఎస్ లేఖ రాశారు. దీనిపై ఈసీఐ సీరియస్ అయినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం 6 గంటల్లోగా బదిలీలు జరపాలంటూ మరోమారు ఆదేశించింది. ఈసీ ఆదేశాలు వెలువడిన వెంటనే ఇక్బాల్‌సింగ్‌ను తొలగించిన మహారాష్ట్ర సర్కారు.. ముగ్గురు సీనియర్ల పేర్లను ఎన్నికల కమిషన్‌కు పంపింది.

కన్నీటి 'పరీక్ష'!

పది పరీక్షల వేళ తల్లి, తండ్రుల మరణాలు.. పలువురు బాల బాలికలకు పుట్టెడు దుఃఖం

- బాధను దిగమింగి పరీక్ష రాసిన విద్యార్థులు
- అనంతరం కన్నవాళ్లకు అంతిమ సంస్కారాలు
- రాష్ట్రంలో ఆరు చోట్ల విషాద ఘటనలు


బాధను దిగమింగుకుని పరీక్షకు హాజరైన విద్యార్థులు మహేశ్, అఖిల్, స్రవంతి, శ్రావణ్, మౌనిక

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): తల్లి, తండ్రిని కోల్పోయిన బాధలో పుట్టెడు దుఃఖం ఒకవైపు.. విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన పదో తరగతి పరీక్షలు మరోవైపు. ఇటువంటి ఉద్విగ్న వాతావరణంలో.. ఆ బాధను పంటి బిగువున భరిస్తూ.. ఏడాది పాటు కష్ట పడి చదివిన పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు పలువురు విద్యార్థులు. పరీక్ష రాసి వచ్చిన అనంతరం కన్నవాళ్ల అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వివిధ జిల్లాల్లో జరిగిన ఈ ఘటనలు స్థానికులను కంట తడి పెట్టించాయి. ఖమ్మం జిల్లా కల్లూరు మేజర్ పంచాయతీ పరిధిలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన మారబోయిన అఖిల్ తండ్రి ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. అదే రోజు అఖిల్ పుట్టిన రోజు కూడా కావడం స్థానికులను కలచివేసింది. అఖిల్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అతడి బంధువులు ధైర్యం చెప్పారు. దీంతో సోమవారం ఉదయం అతడు పరీక్ష రాశాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తండ్రి గోపాలకృష్ణ అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నాడు. సూర్యాపేట జిల్లాలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్(41) ఆదివారం తాటిచెట్టుపై నుంచి పడి చనిపోయాడు. ఆ బాధను దిగమింగి అతడి కుమార్తె మౌనిక సోమవారం పదో తరగతి పరీక్ష రాసింది. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్‌కు చెందిన దండు శ్రీను(50) ఆదివారం రాత్రి గుండెపోటుతో చనిపోయాడు. ఇంటి పెద్ద హఠాన్మరణంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే, శ్రీను రెండో కూతురు స్రవంతి సోమవారం పదో తరగతి పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. బంధువులు ధైర్యం చెప్పడంతో ఆమె పరీక్ష రాసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పుట్టి రవి(45) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. తీవ్ర ఆవేదనలోనూ అతడి పెద్ద కుమారుడు శ్రావణ్ సోమవారం పదో తరగతి పరీక్ష రాశాడు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రానికి చెందిన హనుమంతు సోమవారం ఉదయం మరణించాడు. దీంతో పదో తరగతి పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న అతడి కుమారుడు అజయ్ శోకసంద్రంలో మునిగిపోయాడు. దుఃఖంలోనే పది పరీక్షకు హాజరయ్యాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తండ్రి అంత్యక్రియలు నిర్వహించాడు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మునిసిపాలిటీ పరిధిలోని ప్రగతి నగర్‌కు చెందిన నోముల రమాదేవి(38) కొంతకాలంగా గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో సోమవారం ఆమె పరిస్థితి విషమించింది. ఆ బాధను దిగమింగుకుని ఆమె చిన్న కుమారుడు మహేశ్‌కు సోమవారం పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష రాసి వచ్చిన మహేశ్.. తన తల్లి ఇక లేదనే వార్త విని గుండె పగిలేలా ఏడ్చాడు.


గాయపడిన విద్యార్థిని మనోజ్ఞకు సపర్యలు చేస్తున్న పాఠశాల సిబ్బంది

కోతుల భయంతో భవనం పై నుంచి దూకిన విద్యార్థిని

కోతులు దాడి చేసేందుకు యత్నించడంతో ఓ బాలిక పదో తరగతి పరీక్ష కేంద్రం పై నుంచి దూకింది. గాయాలపాలైన ఆమె ఆ బాధతోనే పరీక్ష రాసింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ఘటన జరిగింది. గౌతమి గ్రామర్ స్కూల్‌కు చెందిన మనోజ్ఞ పరీక్ష రాసేందుకు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు వెళ్లింది. పాఠశాల భవనం పై అంతస్థులో తనకు కేటాయించిన గదిలోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతున్న ఆమెపై మూడు కోతులు ఒక్కసారిగా దాడి చేసేందుకు యత్నించాయి. దీంతో వాటి నుంచి తప్పించుకునేందుకు ఆమె భవనంపై నుంచి దూకింది. గాయాలకు చికిత్స అనంతరం నొప్పులతో బాధపడుతూనే విద్యార్థిని పరీక్ష రాసింది.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- మొదటి పరీక్షకు 99.7 శాతం మంది విద్యార్థుల హాజరు
- 4 మాల్ ప్రాక్టీస్ కేసులు , ముగ్గురు ఇన్విజిలేటర్ల తొలగింపు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు ఫస్ట్ లాంగ్వేజీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్షకు 4,94,877 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,93,417 (99.70 శాతం) మంది రాశారని వారు తెలిపారు. 1460 మంది గైర్హాజరయినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 4 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని, పరీక్షా విధులను సక్రమంగా నిర్వహించని ముగ్గురు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించామని వెల్లడించారు. వీరిలో ఖమ్మం నుంచి ఒకరు, ఆసిఫాబాద్ నుంచి ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం సెకండ్ లాంగ్వేజీ పరీక్ష జరగనుంది.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడగా, పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని దౌలతాబాద్ గ్రామానికి చెందిన రాజులొల్ల వెంకన్న(50) పంటల సాగుకు లక్షల్లో అప్పులు చేశాడు. ఓ వైపు పంటలు సరిగ్గా పండకపోవడం.. మరోవైపు కుటుంబ సమస్యలు పెరిగిపోవడంతో అప్పులు తీరే దారి కనబడక తీవ్ర మనస్థాపంతో సోమవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు చంద్రుగూడెంకు చెందిన మాలోతు మాన్‌సింగ్ (55) సోమవారం తాళ్లతండాలో పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై బావిలో పడ్డాడు. పక్కపొలంలో పని చేస్తున్న అతని సోదరుడు వెంటనే మాన్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పలుగుతండాకు చెందిన రైతు బీల్యానాయక్ (55) సోమవారం సాయంత్రం పొలంలో మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు.

ఆన్‌లైన్‌లో కొమురవెల్లి ఆర్జిత సేవలు

కొమురవెల్లి: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆర్జిత సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆర్జిత సేవల టికెట్ల కోసం భక్తులు గంటల తరబడి లైనులో నిలబడాల్సిన అవస్థ తప్పింది. ఆలయంలో రోజూ నిర్వహించే మొక్కుబడులు, ఆర్జిత సేవలు 25 రకాలుగా ఉన్నాయి. అందులో 12 సేవలను టీ-యాప్‌లో పొందుపరిచారు.

ప్రాణం తీసిన తప్పుడు సమాచారం

- అన్న చనిపోయాడని చెప్పడంతో తమ్ముడి ఆవేదన
- గంటల వ్యవధిలోనే గుండెపోటుతో మృతి
- ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఘటన

బోథ్, మార్చి 18: చావు గురించి తప్పుడు సమాచారం ఓ నిండు ప్రాణాన్ని తీసింది. అనారోగ్యంతో బాధపడుతున్న అన్న బతికే ఉన్నా, ఆయన చనిపోయాడంటూ బంధువులు ఫోన్ చేసి చెప్పడంతో ఆ తమ్ముడు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు! గంటల వ్యవధిలోనే గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. బోథ్‌కు చెందిన నరసింహ దాస్, బాపు అన్నదమ్ములు. బాపు నిర్మల్ జిల్లాలోని మలక్‌జామ్ గ్రామంలో ఉంటున్నాడు. అయితే ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బాపు మృతిచెందాడని నరసింహ దాస్‌కు బంధువులు ఫోన్ ద్వారా ఆదివారం రాత్రి సమాచారం అందింది. అన్న ఇక లేడని రోదించిన నరసింహదాస్ (54) ఆదివారం రాత్రి 2గంటల సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఈ ఘటన గ్రామంలో విషాదం నింపింది.

మల్లారెడ్డి వర్సిటీలో విద్యార్థుల ఆందోళన

60 మందిని ఫీజుల కోసం డిటైన్ చేశారని ఆరోపణ.. మల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం.. మైనంపల్లి మద్దతు

మేడ్చల్ టౌన్, షాపూర్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి వర్సిటీ యాజమాన్యం అదనపు ఫీజుల కోసం ఉద్దేశపూర్వకంగా 60 మందిని డిటైన్ చేసిందంటూ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ మూడో సంవత్సరం విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. మల్లారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, తమ నిరసనను వ్యక్తం చేశారు. డీన్ కుర్చీ, ఫర్నిచర్‌ను తీసుకొచ్చి, కళాశాల ఆవరణలో తగులబెట్టారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వర్సిటీకి చేరుకుని, ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అండగా నిలిచారు. అగ్రికల్చర్ సైన్స్ కాలేజీ మూడో సంవత్సరం చదువుతున్న 60 మంది ఒకట్రెండు సబ్జెక్టుల్లో ఫెయిలవ్వగా.. వర్సిటీ యాజమాన్యం వారిని డిటైన్(పైతరగతికి వెళ్లనీయకుండా, థర్డ్ ఇయర్‌లోనే కూర్చోబెట్టడం) చేసినట్లు విద్యార్థులు ఆరోపించారు. బ్యాక్‌లాగ్స్‌ను క్లియర్ చేయడానికి ఏడాది ఫీజును చెల్లించాలని హుకుం జారీ చేశారంటూ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. మల్లారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా.. రంగంలోకి దిగిన పోలీసులు.. విద్యార్థులను చెదరగొట్టే క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అక్కడికి చేరుకుని, విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే.. మల్లారెడ్డి వర్సిటీని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. "ఒక సంవత్సరం అదనపు ఫీజు కోసమే భారీ సంఖ్యలో విద్యార్థులను డిటైన్ చేశారు. మల్లారెడ్డి పై ప్రభుత్వం తగు చర్యలు తీసుకునేదాకా వదిలే ప్రసక్తే లేదు. విద్యార్థులకు అండగా ఉంటా" అని వ్యాఖ్యానించారు. ఈ ఆందోళనపై మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి తీవ్రంగా స్పందించారు. "విశ్వవిద్యాలయంలో రాజకీయ నాయకులకు పనేంటి? బయటి వారు వారిని రెచ్చగొటి, ఆందోళన చేస్తున్నారు. విద్యార్థులను డిటైన్ చేయడం ఉద్దేశపూర్వకం కాదు. నిబంధనల మేరకే నడుచుకుంటున్నాం" అని వివరించారు. అనంతరం సూరారం మల్లారెడ్డి హెల్త్‌సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భద్రారెడ్డితో కలిసి ఆమె మరికొన్ని వివరాలను వెల్లడించారు. "అగ్రికల్చర్ వర్సిటీలో 22 మంది ఒకట్రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. వారికి ఐదు సార్లు అవకాశమిచ్చాం. అయినా ఫెయిలవ్వడంతో పైతరగతులకు ప్రమోట్ చేయలేదు" అని తెలిపారు.



మల్లారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఫోన్ల ట్యాపింగ్‌కు ఏ సాంకేతికతను వాడారు?

- రెండోరోజూ ప్రణీత్‌రావుపై ప్రశ్నల వర్షం
- ట్యాపింగ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ పూర్తి!

హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు పోలీసు కస్టడీ రెండో రోజు(సోమవారం) పంజాగుట్ట పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. "స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్(ఎస్ఐబీ)లో ఏ సాంకేతికత ద్వారా ఫోన్లను ట్యాప్ చేశారు? ఆ సాఫ్ట్‌వేర్ పేరేంటి? ఆ టూల్స్‌ను ఎక్కడ కొనుగోలు చేశారు? అధికారికంగానే ఆ టూల్స్‌ని కొనుగోలు చేశారా? లేక అనధికారికమా? అసలు రెండు గదులను ట్యాపింగ్‌కు కేటాయించడానికి కారణమేంటి? ఇంత జరుగుతున్నా.. ట్యాపింగ్ తతంగం అస్సలు బయటకు పొక్కకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?" అంటూ ప్రశ్నలను సంధించి, వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి నేతృత్వంలో.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రణీత్‌రావును విచారించారు. మీడియా, ఇతరులు లోనికి ప్రవేశించకుండా బంజారాహిల్స్ రాణాగేట్ వద్దే పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనక గత ప్రభుత్వ పెద్దలే కీలక సూత్రధారులుగా భావిస్తున్న పోలీసులు.. ఆ కోణంలో కూడా ప్రశ్నలు వేశారు. దాంతో పాటు.. విజిలెన్స్ ఎస్పీ, అప్పటి ఎస్ఐబీ చీఫ్, ప్రణీత్‌రావుకు వార్‌రూంలలో సహకరించిన ఇన్‌స్పెక్టర్ల పాత్రపై ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా.. దర్యాప్తు అధికారులు ఆదివారమే ప్రణీత్‌రావుతో ఎస్ఐబీలో సీన్-రీకన్‌స్ట్రక్షన్ చేయించినట్లు సమాచారం. అక్కడ ఫోన్‌ట్యాపింగ్ ఎలా చేశారు? జిల్లాల్లోని వార్‌రూమ్‌లకు డేటాను ఎలా బదిలీ చేశారు? అనే విషయాలను డెమో చేయించినట్లు తెలిసింది. ఆ తర్వాత.. డమ్మీ ఎలక్ట్రానిక్ పరికరాలతో.. ఆధారాల ధ్వంసానికి సంబంధించిన చర్యను రీ-కన్‌స్ట్రక్ట్ చేశారు. ఈ తతంగాన్నంతా వీడియో రికార్డింగ్ చేసినట్లు సమాచారం.

కేసీఆర్‌ను తిట్టానన్న కేసు కొట్టేయండి

- హైకోర్టులో ఎంపీ ధర్మపురి అర్వింద్ పిటిషన్

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టానని పేర్కొంటూ నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2022 జూలై 14న హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి కేసీఆర్‌ను బూతులు తిట్టారని, వివిధ వర్గాల మధ్య శాంతికి భంగం కలిగేలా వ్యవహరించడంతోపాటు ప్రజలను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని పేర్కొంటూ టీఆర్ఎస్ లీగల్ సెల్ కో-కన్వీనర్ వీ రవికుమార్ ఫిర్యాదు మేరకు అబిడ్స్ రోడ్ పోలీస్‌స్టేషన్‌లో అర్వింద్‌పై కేసు నమోదైంది. ప్రతిపక్ష ఎంపీగా అప్పటి ప్రభుత్వ విధానాలను విమర్శించానని, అందుకు తనపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టారని, అందువల్ల దానిని కొట్టివేయాలని అర్వింద్ కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం త్వరలో విచారణ చేపట్టనుంది.

లోక్‌సభ ఎన్నికలతో టీఎస్ఈఏపీసెట్ షెడ్యూల్ మారుతుందా?

రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ఈఏపీసెట్ షెడ్యూల్‌లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం మే 9 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తం గా ఈఏపీసెట్ పరీక్షలు జరగనున్నాయి. అయితే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉండటంతో దీనికి ఒకరోజు ముందు వరకు పరీక్షలు నిర్వహిస్తే ఇబ్బందులేమైనా తలెత్తుతాయా అనే కోణంలో ఈఏపీసెట్ నిర్వాహకులు ఆలోచన చేస్తున్నారు. ఒకవేళ 12న ఉండే పరీక్షను 8వ తేదీకి మార్చాలనుకుంటే అదే రోజు స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్ సీ) పరీక్ష ఉండడంతో ఈఏపీసెట్‌కు పరీక్షా కేంద్రాల లభ్యతపై టీసీఎస్ సిబ్బంది నుంచి సమాచారం తీసుకుంటున్నారు. కాగా, టీఎస్ఈఏపీసెట్-2024కు దాదాపు లక్షన్నర దరఖాస్తులు వచ్చినట్లు సెట్ కన్వీనర్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 6 వరకు టీఎస్ ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

22న తుంగభద్ర బోర్డు సమావేశం

తుంగభద్ర బోర్డు 221వ సమావేశం ఈనెల 22వ తేదీన విశాఖపట్నంలో జరగనుంది. దీనికి కర్ణాటక, ఏపీ, తెలంగాణ అధికారులు హాజరుకానున్నారు. ఎజెండా ను ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు బోర్డు పంపించింది.

చిన్నారిపై అసభ్యకర చేష్టలు.. ట్యూషన్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు!

అడ్డగుట్ట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల చిన్నారిని లైంగికంగా వేధించిన ఓ ట్యూషన్ టీచర్‌కు తగిన శాస్తి జరిగింది. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నాంపల్లి పోక్సో కేసుల సెషన్స్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. మల్కాజిగిరి నేరెడ్‌మెట్ సప్తగిరి కాలనీకి రాయకాటి అభిలాష్ (25) సికింద్రాబాద్ రైల్ నిలయం వెనుక కాలనీలో ఉండే ఆరేళ్ల చిన్నారికి ట్యూషన్ చెబుతుండేవాడు.. ఈ నేపథ్యంలోనే చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఆమె ప్రైవేటు పార్ట్స్‌ను తాకుతూ పైశాచిక ఆనందం పొందేవాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే కొడతానని బెదిరించేవాడు. అయితే చిన్నారి ఒకరోజు తల్లిదండ్రులతో జరిగిదంతా చెప్పింది. దీంతో వారు అభిలాష్‌పై తుకారాంగేట్ పోలీసులకు 2018 నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు నేరం ఒప్పుకోవడంతో పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. తాజాగా కేసు విచారణకు రాగా పూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించిన నాంపల్లి పోక్సో కేసుల సెషన్స్ కోర్టు మహిళా జడ్జి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు.

జేఎన్‌టీయూ కాలేజీ సెమిస్టర్ ఫలితాల్లో గందరగోళం

- తప్పులతడకగా థర్డ్ ఇయర్ మొదటి సెమిస్టర్ మార్కుల మెమోలు

హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ కాలేజీ గత శనివారం విడుదల చేసిన థర్డ్‌ఇయర్ మొదటి సెమిస్టర్ ఫలితాలు కొందరు విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జాతీయ విద్యా విధానం ప్రకారం బీటెక్‌లో మేజర్ డిగ్రీతోపాటు ఒక మైనర్ డిగ్రీని విద్యార్థులు అభ్యసించేందుకు జేఎన్‌టీయూ అవకాశం కల్పించింది. గతేడాది నుంచి ఈ విధానం అమల్లో ఉంది. ప్రస్తుతం థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు తమ మేజర్ డిగ్రీ సబ్జెక్టులతో మైనర్ డిగ్రీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు రాయగా.. ఆయా సబ్జెక్టులకు వచ్చిన మార్కులు/గ్రేడ్‌లు సక్రమంగానే వచ్చినప్పటికీ వాటి మొత్తం కలిపితే వచ్చే ఎస్‌జీపీఏలో తప్పులు దొర్లాయి. కొందరికి తక్కువగా గ్రేడ్ పాయింట్లు రాగా, మరికొందరికి సున్నా మార్కులు వచ్చినట్లు తెలిసింది. ఫలితాల ప్రాసెసింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా మార్కుల మెమోల్లో తప్పిదాలు జరిగినట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఇంకోవైపు విద్యార్థుల ఆన్సర్‌షీట్లను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసిన ప్రొఫెసర్లు వారికి కొన్ని సబ్జెక్టుల్లో సున్నా మార్కులు కూడా వేసినట్లు తెలిసింది. ప్రశ్నపత్రంలోని మొదటి ప్రశ్నకు కేటాయించిన ఖాళీలో వేరొక ప్రశ్నకు రాయాల్సిన జవాబును రాయడం, జవాబు పత్రాలను యథాతథంగా స్కాన్‌చేసి ఆన్‌లైన్ ఎవాల్యుయేషన్ కోసం అప్‌లోడ్ చేయడం వంటి పొరపాట్లు జరిగాయి. ఆయా సబ్జెక్టుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన ప్రొఫెసర్లు సదరు విద్యార్థులకు సున్నా మార్కులు వేశారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో టెక్నికల్ సిబ్బంది కొరత, కాలేజీ పరీక్షల విభాగాన్ని పర్యవేక్షించే అధికారులకు ఫలితాల ప్రాసెసింగ్‌పై అవగాహన లేకపోవడంతో సకాలంలో ఫలితాలు రావడంలేదని తెలుస్తోంది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా..కాలేజీలో టెక్నికల్ సిబ్బంది కొరతపై యూనివర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం నుంచి కొందరు సిబ్బందిని సర్దుబాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ వీసీ, రిజిస్ట్రార్ స్థాయి ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో.. ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మసకబారుతున్న ప్రతిష్ఠ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దలకు ఏమి అనిపిస్తున్నదో తెలియదు కానీ, ఆ బ్యాంకుతో దశాబ్దాల అనుబంధం ఉన్న సామాన్యులకు మాత్రం ఎంతో అవమానంగా ఉంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ జాబితాల్లోనూ చోటు సాధించిన ఈ బ్యాంకు ఎన్నికల బాండ్ల విషయంలో ఇలా వరుసపెట్టి సర్వోన్నత న్యాయస్థానంతో చివాట్లు తినడం సరికాదు. నిజాయితీ, పారదర్శకతలకు పెద్దపీట వేయాల్సిన ఈ సంస్థ, తనకు తానుగానే తప్పటడుగులు వేస్తున్నదో, పాలకుల ఒత్తిడికి వంగిపోతున్నదో తెలియదు కానీ, సుప్రీంకోర్టుతో అది వ్యవహరిస్తున్న తీరువల్ల ఏళ్ళతరబడి కూడబెట్టుకున్న విశ్వసనీయత చెదిరిపోయే ప్రమాదం ఉంది.

ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారన్న కీలక సమాచారాన్ని తెలియచెప్పే యూనిక్ బాండ్ కోడ్స్ సహా తన వద్ద ఉన్న సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి అందచేయాల్సిందేనంటూ బ్యాంకును సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు గౌరవప్రదమైన భాషనే ఉపయోగించినప్పటికీ, బ్యాంకు కొంత సమాచారాన్ని దాస్తున్నదనీ, తాను ఎంపిక చేసినదానిని మాత్రమే అందిస్తున్నదని, కీలకమైన లింకులను దాచిపెడుతున్నదని పలు వ్యాఖ్యల ద్వారా చెప్పకనే చెప్పారు. ఎన్నికల సంఘానికి అంతా ఇచ్చేశానని, వీసమెత్తు సమాచారాన్ని కూడా దాచలేదని మార్చి 21వ తేదీ సాయంత్రం ఐదుగంటలలోపు బ్యాంకు ఛైర్మన్ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసుకోవాల్సి వస్తున్నది. కోర్టు ఏది అడిగితే అది అందించడానికి బ్యాంకు సంసిద్ధంగా ఉందని దాని తరఫు న్యాయవాది హరీష్ సాల్వే అంటున్నారు కానీ, ఫిబ్రవరి 15 ఆదేశాలను అమలు చేయాలన్న ఉద్దేశం బ్యాంకుకు ఏ మాత్రం ఇష్టంలేదని ఆదిలోనే తేలిపోయింది. గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి వివరాలు ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని కోర్టు ఆదేశిస్తే, ఈ తీర్పు వెలువడిన మూడువారాలకు మళ్ళీ కోర్టుముందుకు వచ్చి, జూన్ 30వరకూ గడువు పెంచాలని ఎస్‌బీఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా బాండ్ల రహస్యాన్ని బట్టబయలు చేయాలని, సమస్త వివరాలను ప్రజలముందు ఉంచాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎన్నికలు ముగిసేవరకూ ఆ రహస్యాన్ని దాచాలని బ్యాంకు చూసింది. దీనిపై ఆగ్రహించిన సుప్రీంకోర్టు గడువు ఏ మాత్రం పొడిగించకుండా బ్యాంకును దారికి తేవడంతో, విధిలేక అది ఎన్నికల సంఘానికి సమాచారాన్ని అందించాల్సి వచ్చినప్పటికీ, కీలకమైన లింకులు లేకుండా చేసి, సర్వోన్నత న్యాయస్థానం తీర్పువెనుక స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నమైతే జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు, ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం దేనికదిగా ఉంటూ ఏ పార్టీకి ఏ దాత ఎంత ఇచ్చాడన్న వివరాలను జతచేయగలిగే అవకాశం లేకుండా జాగ్రత్తపడుతున్నాయి. కంపెనీలకు, పార్టీలకు మధ్య బాండ్లతో ఏర్పడిన బంధం కానీ, క్విడ్ ప్రోకో కానీ ప్రజలకు తెలియకుండా పోతోంది. సుప్రీంకోర్టు ఈ ఎన్నికల బాండ్ల విధానాన్ని రద్దుచేయడానికి ప్రధాన కారణం ప్రతీదశలోనూ ఉన్న గోప్యతే. రాజకీయ పార్టీలకు గుప్తనిధులను సమకూర్చిపెట్టే ఈ విధానానికి కర్తగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టు ఏమిచెప్పినా, ఎంత మొత్తుకున్నా ఆ బాంధవ్యం బట్టబయలు కాకూడదని అనుకుంటోంది. వివిధ పారిశ్రామికవేత్తల సంఘాలు సంస్థలు కూడా ఏవో కేసులు వేస్తూ, ప్రత్యేక అభ్యర్థనలు చేస్తూ కోర్టును ఇబ్బంది పెడుతున్నాయి. చివరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా బరిలోకి దిగారు.

ఎన్నికల బాండ్లమీద కోర్టుకు ఎక్కి విజయం సాధించినవారు, ఆ వివరాలను వక్రీకరిస్తున్నారని, బాండ్ల లెక్కలను తారుమారు చేస్తున్నారని సోమవారం తుషార్ మెహతా కోర్టుకు ఫిర్యాదుచేశారు. కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ఒక ఎజెండా ప్రకారం ప్రభుత్వాన్ని ఇబ్బందికి గురిచేస్తున్నారనీ, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన వాదన. ఎన్నికల బాండ్ల విధానాన్ని న్యాయస్థానం కొట్టివేయడం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారపక్షానికి ఇబ్బంది కలిగించే విషయమే. అయితే, ఆ తీర్పుకంటే, దానిని అమలుచేసే క్రమంలో ఈ దేశ అతిపెద్ద బ్యాంకు వ్యవహరిస్తున్న తీరే ప్రభుత్వాన్ని మరింత అప్రదిష్టపాల్జేస్తున్నది. ఇప్పటికైనా ఆ బ్యాంకును స్వతంత్రంగా పనిచేసుకోనిస్తే పాలకులు తమ పరువు గురించి భయపడాల్సిన పని ఉండదు.

బీఆర్ఎస్, వైసీపీల ఆటకట్టు


భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే బీజేపీ, ఇతర పార్టీల నేతలను అరెస్టు చేయిస్తుందని బూటకపు ప్రచారం చేస్తున్నవారు, అరిచి గగ్గోలు పెడుతున్నవారు అసలు తాము తప్పులు చేశామో లేదో ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏదో ప్రజల ప్రయోజనాల కోసం, దేశం కోసం తాము అరెస్టు అవుతున్నామంటూ పిడికిళ్లు బిగించి భద్రతాధికారుల వెంట వెళ్లేవారు, ధర్నాలు చేయించే వారికి తాము ఎన్ని వేల కోట్ల ప్రజాధనం స్వాయత్తం చేసుకున్నదీ కూడా తెలిసే ఉంటుంది. నిజానికి తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితను అరెస్టు చేయకపోవడానికి బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ కారణమని, ఆ రెండు పార్టీలూ ఒకటేనని కాంగ్రెస్ నేతలు బూటకపు ప్రచారం చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందారు. ఇప్పుడు కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసి తీసుకువెళితే కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని, రెండు పార్టీలు కలిసి ఆమెను అరెస్టు చేసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తే, అసలు ఈ అరెస్టు అంతా డ్రామా అని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

నిజానికి ఢిల్లీ మద్యం కేసులో కవిత ఎప్పుడో అరెస్టయి ఉండాల్సిందని ఈడీ రెండు రోజుల క్రితం ఢిల్లీలో ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన కస్టడీ రిపోర్టును, అంతకు ముందు ఈడీ, సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్లను చదివిన వారికి అర్థమవుతుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అక్రమంగా భారీ ఎత్తున లాభాలు ఆర్జించేందుకు వీలుగా ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో ఎలా చేతులు కలిపారో, ఢిల్లీలోని ఒబెరాయ్, హైదరాబాద్‌లోని కోహినూర్ హోటళ్లలోనే కాకుండా తన నివాసంలో దళారులతో, వ్యాపారులతో ఎలా చర్చలు జరిపారో, ఎవరెవరితో ఏఏ వాట్సాప్ చాట్‌లో ఏమేమి మాట్లాడారో కేంద్ర దర్యాప్తు సంస్థలు పూసగుచ్చినట్లు వివరించాయి. ఆమెతో పాటు సౌత్ గ్రూప్‌లో ఉన్న భాగస్వాములు, బినామీలు అప్రూవర్లుగా మారి పలు సాక్ష్యాలు ఇచ్చారు. ఎంత మొత్తం హవాలా మార్గంలో మళ్లించారో తెలిపారు. ఆమె వ్యక్తిగత సిబ్బంది కూడా ఎవరెవరికి తాము డబ్బు సంచులు మోశామో తెలిపారు. సాక్ష్యాలు రూపుమాపేందుకు కవిత ఎన్ని ఫోన్లలో డేటాను తొలగించి ఎలా ఫార్మాట్ చేయించారో తెలిపారు. వీటన్నిటి ఆధారంగా ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టాలని ఈడీ ఎన్నోసార్లు ప్రయత్నించింది. కాని సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకున్నారు. అంతేకాక దాదాపు ఏడాది నుంచీ కవిత అరెస్టును తప్పించుకుంటూ ఏజెన్సీలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ నాటకాలు ఆడుతూ కాలం వృధా చేశారు. కోర్టులకు తప్పుడు సమాచారంతో ఫిర్యాదులు చేస్తూ వాయిదాల ఆధారంగా పబ్బం గడిపారు. కాని ఎంత తప్పించుకున్నా ఏజెన్సీలు తమ పని తాము చేయకమానవు కదా.. ఎట్టకేలకు హైదరాబాద్ వెళ్లి అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకువచ్చారు. ఇక తాము ఎలాంటి తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆమెదే.



కేజ్రీవాల్‌తో కేసీఆర్‌కు ఉన్న సంబంధాల వల్లే కదా, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ దాకా వెళ్ల లిక్కర్ వ్యాపారం చేసే సాహసం చేశారు. తెలంగాణ పేరుతో దోచుకునేందుకు తెర లేపినందువల్లే ఇవాళ తెలంగాణలో భారత రాష్ట్ర సమితి అత్యంత సంక్షోభంలో ఉన్నది. ఆంధ్రలో జగన్ అరాచక పాలనను అంతం చేసేందుకు చేతులు కలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తర్వాత వైసీపీ మనుగడ సైతం ప్రశ్నార్థకమయ్యే అవకాశమున్నది.

కవిత మాదిరే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ విచారణను తప్పించుకుంటూ కాలం గడుపుతున్నారు. అక్రమార్జనకు వీలు కల్పించే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించే విషయంలో కవిత, తదితరులతో కేజ్రీవాల్ చర్చించారని సాక్ష్యాలు ఉన్నప్పటికీ ఆయన ఈడీ ప్రశ్నలు ఎదుర్కోవడానికి సిద్ధంగా లేరు. ఈ కుంభకోణానికి సంబంధించి ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ జైలులో ఉన్నారు. మొత్తం కుంభకోణానికి రూపకల్పన చేసిన కేజ్రీవాల్, దక్షిణాది వర్గానికి ప్రాతినిధ్యం వహించి రూ. 100 కోట్ల మేరకు ముడుపులు చెల్లించిన కవితల సాక్ష్యాలు సేకరిస్తే ఈడీ, సీబీఐ పని పూర్తవుతుంది. ఇప్పుడు కవిత అరెస్టు అయినందువల్ల కేజ్రీవాల్ అరెస్టుకు కూడా రోజులు దగ్గరపడుతున్నాయని ఈ కుంభకోణాన్ని అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఎంతకాలమని ఎవరైనా చట్టంతో దోబూచులాడుకుంటారు? అసలు తెలంగాణకు, ఢిల్లీకి సంబంధం ఏమిటి? కేజ్రీవాల్‌తో కేసీఆర్‌కు ఉన్న సంబంధాల వల్లే కదా, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ దాకా వెళ్లి లిక్కర్ వ్యాపారం చేసే సాహసం చేశారు. తెలంగాణ పేరుతో దోచుకునేందుకు తెర లేపినందువల్లే ఇవాళ భారత రాష్ట్ర సమితి అత్యంత సంక్షోభంలో ఉన్నది. ఆ పార్టీ త్వరలో అంతరించిపోయే పార్టీల్లో కలిసే సమయం ఆసన్నమైంది.

ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరి పేటలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొన్న భారీ బహిరంగ సభకు వచ్చిన బ్రహ్మాండమైన ప్రతిస్పందనను చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జగన్మోహన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లినట్లు కనపడుతోంది. 2012లో అక్రమాస్తులు, మనీలాండరింగ్ కేసులో ఆయనను అరెస్టు చేసి, సీబీఐ 11, ఈడీ 7 కేసులు నమోదు చేసినప్పటికీ 12 సంవత్సరాలుగా విచారణను తప్పించుకుంటూ వస్తున్నారు. వందలాది డిశ్చార్జి పిటీషన్లను దాఖలు చేసి న్యాయప్రక్రియను ఆలస్యం చేస్తున్నారు. జగన్ స్వంత బాబాయి, మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్యకి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన పార్టీ ఎంపీ అవినాశ్ రెడ్డి కూడా తనను సీబీఐ ప్రశ్నించకుండా అయిదు సంవత్సరాలుగా తప్పించుకుంటున్నారు. నిజంగా జగన్ కానీ, అవినాశ్ రెడ్డి కానీ నేరస్థులు కాకపోతే న్యాయ ప్రక్రియకు ఎందుకు సహకరించకూడదు? ఏవో కారణాలు చూపి అసలు విచారణనే ముందుకు కొనసాగించకుండా ఎందుకు అడ్డుపడుతున్నారు? ఇప్పుడే కాదు, ఈ దేశంలో అనేక మంది నేరచరితులైన రాజకీయ నేతలు తమపై విచారణను తప్పించుకుంటూ ఏళ్లకు ఏళ్లు కాలక్షేపం చేశారు. కాని చట్టం వారిపై ఎట్టకేలకు ఉచ్చుబిగించింది. జగన్, అవినాశ్ రెడ్డిలు కూడా వారిపై నేరారోపణలు రుజువై కటకటాలు లెక్కపెట్టే దూరం ఎంతో లేదు. అయినా ఈ ఎన్నికల్లో జగన్ అరాచక పాలనను అంతం చేసేందుకు చేతులు కలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ విజయం తర్వాత వైసీపీ కూడా బీఆర్ఎస్ మాదిరే అంతరించిపోయే పార్టీగా మారక తప్పదు. జగన్, షర్మిలల మధ్య మంచి అవగాహన ఉన్నదని, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలను వారిద్దరూ కలిసి నడుపుతున్నారని, ఎన్డీఏ ఓట్లను చీల్చేందుకే జగన్ షర్మిలను కాంగ్రెస్ పార్టీలో చేర్చారని ప్రధాని మోదీ ఆదివారం చేసిన ఆరోపణల్లో నూటికి నూరుపాళ్లు సత్యం ఉన్నది. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు మళ్లించేందుకే జగన్ కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. నిజానికి జగన్, షర్మిల మధ్య అవినీతి డబ్బు పంచుకోవడం విషయంలో వచ్చిన తగాదాలే కాని మరే వివాదాలు లేవు. బహుశా జగన్ ఆ తగాదాలను అంతర్గతంగా పరిష్కరించుకుని తన వ్యతిరేక ఓటును చీల్చేందుకు షర్మిలను కాంగ్రెస్ శిబిరంలో చేర్చి ఉంటారు. గతంలో కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న సోనియాగాంధీకి కూడా తన అవినీతి సొమ్మును పంచిపెట్టనందుకే ఆమె, జగన్‌పై కేసులు పెట్టించి ఉంటారు కాని వారి మధ్య పెద్ద విభేదాలు ఏమీ లేవు. ఈ అవినీతి శక్తులనన్నిటినీ తుదముట్టించి 400కు పైగా సీట్లను సాధించేందుకే తాను ఎన్డీఏను బలోపేతం చేస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ప్రజల గుండెల్లో మార్మోగుతున్నది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

రాజకీయ ప్రక్షాళన గురించి మోదీ మాట్లాడొచ్చా?

పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు సభలో చేసే ప్రసంగాలు, వేసే ఓటింగ్ మంచి చెడ్డలను విచారించే హక్కు (ఆ సమయంలో వారి అవినీతి, లంచగొండితనంపై క్రిమినల్ ప్రాసెక్యూషన్ చేపట్టే అధికారం) కోర్టులకు లేకుండా చేస్తూ వచ్చిన 1998 నాటి అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రద్దు చేస్తూ ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పును ప్రధాని నరేంద్ర మోదీ వేనోళ్ల పొగిడారు. తీర్పు చాలా గొప్పదంటూ దానిని ప్రధాని స్వాగతించారు. రాజకీయాలను ప్రక్షాళన చేస్తుందని, వాటిపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని తీర్పు వెలువడిన వెంటనే 'X' (మాజీ ట్విట్టర్)లో వ్యాఖ్యానించారు.

కోర్టులకు ఈడుస్తారనే భయంతో నిర్భయంగా మాట్లాడడానికి, ఓటు వేయడానికి పార్లమెంటు, శాసన సభల సభ్యులు వెనుకాడుతారని, అందువల్ల ప్రజాస్వామ్యానికి జరగవలసిన మంచి జరగదనే దృష్టితో రాజ్యాంగ కర్తలు వారికి కోర్టుల జోక్యం నుంచి రక్షణ కల్పించారు. అందుకు రాజ్యాంగంలో 105(2), 194 అధికరణలను చేర్చారు. మహోన్నత పార్లమెంటరీ ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ రక్షణ దుర్గం 1991లో పి.వి. నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని కాపాడడానికి ఝార్ఖండ్ ముక్తి మోర్చా సభ్యులకు లంచం ఇచ్చి ఓటు వేయించిన తప్పుడు పని వల్ల ఇప్పుడు కూలిపోయింది. ఈ రక్షణ కారణంగానే జేఎంఎం సభ్యులపై సీబీఐ కేసు నిలవలేదు. పార్లమెంటు సభ్యులు సభలో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు రాజ్యాంగ రక్షణ ఉన్నందున జేఎంఎంపై సీబీఐ కేసు చెల్లదని 1998లో అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 తేడాతో తీర్పు ఇచ్చింది. ఇప్పుడు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దానిని కొట్టివేసింది. పార్లమెంటులో గాని శాసనసభల్లో గాని సభ్యులు ప్రసంగానికి, ఓటు వేయడానికి లంచం తీసుకొంటే ఇక నుంచి వారికి ఎటువంటి రక్షణ ఉండబోదని తాజా తీర్పు స్పష్టం చేసింది. ప్రధాని మోదీ ఈ తీర్పును ప్రత్యేక ప్రశంసలతో ముంచెత్తడం హృద్యంగా ఉంది. స్వచ్ఛ రాజకీయాల పట్ల ఆయన పార్టీకి గల మక్కువను అది చాటింది. కానీ–

దేశ రాజకీయాల్లో బీజేపీ వ్యాపింపజేస్తున్న దుర్గంధాన్ని, నియమోల్లంఘన ధోరణిని గమనించే వారికి ఏమని పిస్తుంది? రవ్వంత అవినీతికి కూడా చోటు లేకుండా రాజకీయాలను కడిగిపారేయాలని, అవి కింది నుంచి పైవరకు ప్రక్షాళనకు గురి కావాలని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కోరుకొంటూ ఉంటే దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ అధికారం కోసం బీజేపీ అడ్డ దారులు తొక్కడమేమిటి అనే ప్రశ్న వేధించడం సహజం. 2017 మార్చ్‌లో గోవా, మణిపూర్‌లలో జరిగిన వాటిని పరిశీలిస్తే రాజ్యాంగ విహిత ప్రజాస్వామ్యానికి బీజేపీ ఎంత విరుద్ధమైన పార్టీయో అర్థమవుతుంది. అప్పుడు ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలన్నింటి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకొని ఏకైక అతిపెద్ద పార్టీగా ఎన్నిక కాగా రాజ్‌భవన్‌లను ఉపయోగించుకొని దాని నోటి ముందరి అధికారాన్ని బీజేపీ తన్నుకుపోయింది. ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయతగినంత స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, మిగతా పార్టీలన్నిటి కంటే ఎక్కువ సీట్లు గెలుచుకొన్న ఏకైక అతి పెద్ద పార్టీని గవర్నరు ఆహ్వానించాలని ఎస్.ఆర్.బొమ్మై కేసులో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. 2017లో గోవా, మణిపూర్‌లో ఈ రాజ్యాంగ విధిని బీజేపీ కాల రాసింది. కాంగ్రెస్ కంటే చాలా తక్కువ స్థానాలు గెలుచుకొని కూడా తానే అధికారాన్ని కైవసం చేసుకొన్నది. ఈ రెండు రాష్ట్రాల్లో బలం లేకుండా అధికారాన్ని చెరబట్టిన బీజేపీ అందులో నిలదొక్కుకోడానికి అవసరమైన బలాన్ని చేరుకోడానికి ఎన్ని అడ్డదారులు, అవినీతి మార్గాలు తొక్కి ఉంటుందో చెప్పనక్కరలేదు. నేరుగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, లాభసాటి పదవులను ఎర వేయడం వంటివి చేసి ఎన్నికల్లో ప్రజల మొగ్గను బుగ్గిపాలు చేసిన వైనం ప్రజాస్వామ్య క్రీడా నియమోల్లంఘనకు పరాకాష్ఠ. ఇంత ప్రత్యక్షంగా బహిరంగంగా ప్రజా తీర్పును మంటగలిపిన పార్టీ అధినేతగా ప్రధాని మోదీ రాజకీయాల ప్రక్షాళన గురించి ఎలా నీతులు చెప్పగలుగుతారు?



పార్లమెంటు, శాసనసభల సభ్యులు సభల్లో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఇస్తున్న ఏర్పాటును సుప్రీంకోర్టు రద్దు చేసినందుకు మహదానంద పడిపోయిన ప్రధాని మోదీ పార్టీ, ప్రభుత్వమూ కర్ణుడిని చంపినట్టు ప్రజాస్వామ్యాన్ని అన్ని వైపుల నుంచీ కుళ్లబొడుస్తున్న తీరు, ప్రతిపక్షాన్నీ ప్రశ్ననూ వధిస్తున్న పద్ధతి భారతీయులమైనందుకు మనందరం సిగ్గుతో తలదించుకొనేలా ఉన్నది.

2019లో మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పదవిపై విభేదాలతో బీజేపీతో పొత్తుకు శివసేన గుడ్‌బై చెప్పి ఎన్‌సీపీ – కాంగ్రెస్‌లతో మెజారిటీ కూటమిని ఏర్పాటు చేసినప్పుడు ఎన్‌సీపీ నుంచి అజిత్ పవార్‌ను దువ్వి బీజేపీ ఆడిన నాటకం తెలిసిందే. అప్పటికి ఎన్‌సీపీ శాసనసభా పక్ష నాయకుడుగా ఉన్న అజిత్ పవార్ నుంచి మొత్తం 54 మంది పార్టీ శాసన సభ్యుల మద్దతును ఇస్తున్నట్టు లేఖ రాయించుకొని, బీజేపీ తరఫున దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఓ ఉదయం రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించారు. దీని వెనుక తన చేయి ఉన్నట్టు ప్రచారం జరగడంతో శరద్ పవార్ రంగప్రవేశం చేసి చక్రం తిప్పేసరికి ఆ రోజు సాయంత్రానికల్లా కథ అడ్డం తిరిగింది. ఎన్‌సీపీ శాసన సభ్యులు దాదాపు అందరూ శరద్ పవార్‌కు విధేయతను ప్రకటించడంతో బీజేపీ పన్నాగం నీరుగారిపోయి శివసేన – ఎన్‌సీపీ – కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడి కూటమి ప్రభుత్వ ప్రయోగం సఫలమయింది. రెండున్నర సంవత్సరాలపాటు ప్రజాభిమానం చవి చూస్తూ సాగిన ఈ ప్రభుత్వాన్ని ఏక్‌నాథ్ షిండేని ప్రయోగించి కేంద్రంలోని పెద్దలు కూల్చివేశారు. శివసేనను చీల్చి, ఫిరాయింపులను రక్తి కట్టించి ఈ ఘట్టాన్ని ఘనంగా జరిపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టడానికి చేజిక్కిన ఏ చిన్న అవకాశాన్నీ మోదీ నీతిమంత పాలనలో బీజేపీ వదిలిపెట్టడం లేదు. చివరకు ఈడీని, సీబీఐనీ, ఆదాయపు పన్ను శాఖను సైతం బాహాటంగా దుర్వినియోగం చేస్తున్నది. బెంగాల్ నుంచి తమిళనాడు వరకు రాజ్‌భవన్‌ల దుర్వినియోగం జుగుప్సాకరంగా సాగిపోతున్నది. రాజ్యసభలో బలాన్ని దొడ్డిదారిలో పెంచుకోడానికి ఇటీవలి ఆ ఎన్నికల్లో పాల్పడిన అక్రమాలు తెలిసినవే. హిమాచల్‌ప్రదేశ్ నుంచి గల ఒకే ఒక ఖాళీ స్థానానికి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి సునాయసంగా గెలిచి వుండాల్సింది. బీజేపీ మీద కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు ఉన్నాయి. తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడం వల్ల సింఘ్వి ఓడిపోయారు. బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ గెలుపొందారు. ఇక్కడ విచిత్రమైన ఎన్నికల కమిషన్ నియమం ఒకటి కూడా కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేసింది. అభ్యర్థులిద్దరికీ చెరి 34 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయాల్సి వచ్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం డ్రాలో పైకి తీసిన చీటీలో పేరు గల వ్యక్తి ఓడిపోవాలి. ఆ విధంగా సింఘ్వి ఓటమి పాలయ్యారు. ఇది మామూలు లాటరీ పద్ధతికి విరుద్ధమైనది. మామూలు పద్ధతిలో, తీసిన చీటీలోని వ్యక్తి గెలుపొందుతారు. ఈ సందర్భంగా సింఘ్వి వెలిబుచ్చిన ఆవేదన మన భ్రష్ట క్రాస్ ఓటింగ్‌ను జరిపించేవారి చెంప చెళ్లు మనిపించింది. 'క్రాస్ ఓటింగ్ చేసిన ఆ తొమ్మిది మందికి కూడా (ఎమ్మెల్యేలు) కృతజ్ఞతలు తెలపదలిచాను. మానవ స్వభావం గురించి వారు నాకు చాలా నేర్పారు. ఓటింగ్ ముందు రోజు రాత్రి వారు నాతో కలిసి తాగారు, తిన్నారు. మరుసటి రోజే వ్యతిరేకంగా ఓటు వేశారు' అని సింఘ్వి అన్నారు. బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది అనడానికి హిమాచల్ ప్రదేశ్‌లో అది నడిపించిన దుష్ట రాజకీయమే ఉదాహరణ. ఈ విషయంలో ఎటువంటి ప్రజాస్వామిక మర్యాదలు నియమాలైనా దాని దృష్టిలో దిగదుడుపే. సక్రమ ఎన్నికల నిర్వహణ అంటే దానికి అక్కసు. వాటిని మొక్కుబడి స్థాయికి దిగజారుస్తున్నది.

ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికలను పర్యవేక్షించే ఎన్నికల కమిషన్ సభ్యులను ఎంపిక చేయడానికి భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, ప్రతిపక్షనేతతో కూడిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చేసిన సూచనను దాని మొహం మీద కొట్టి పార్లమెంటు చట్టం ద్వారా ఏకపక్ష ఎంపిక కమిటీని నియమించిన పాలకులకు అవినీతి రహిత రాజకీయాల పట్ల గల మక్కువ ఎంతటిదో వివరించనక్కరలేదు. పార్లమెంటు, శాసనసభల సభ్యులు సభల్లో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఇస్తున్న ఏర్పాటును సుప్రీంకోర్టు రద్దు చేసినందుకు మహదానంద పడిపోయిన ప్రధాని మోదీ పార్టీ, ప్రభుత్వమూ కర్ణుడిని చంపినట్టు ప్రజాస్వామ్యాన్ని అన్ని వైపుల నుంచీ కుళ్లబొడుస్తున్న తీరు, ప్రతిపక్షాన్నీ ప్రశ్ననూ వధిస్తున్న పద్ధతి భారతీయులమైనందుకు మనందరం సిగ్గుతో తలదించుకొనేలా ఉన్నది. చివరికి జాతీయ మీడియా నోరు కూడా నొక్కేసి ప్రజలకు మోదీ తప్ప ఇతః పరంబెరుగ అనే దిక్కు లేని స్థితిని కల్పిస్తున్న విధానం భయంకరమైనది.

● జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

ఎన్‌పీడీసీఎల్‌లో 'సెస్' విలీనం: వరమా శాపమా?

యాభై నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభమై రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తలమానికంగా నడుస్తున్న 'సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్' (సెస్)ను నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్)లో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ 11 అంశాలతో కూడిన ఒక లేఖ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. సంస్థ బాధ్యతాయుతమైన సభ్యునిగా, వినియోగదారునిగా దీని ముందు వెనక గల కార్యకారణ సంబంధాలను ఒకసారి పరిశీలించదలిచాను.

1969లో దేశంలోని వివిధ రాష్ట్రాలలో సహకార రంగంలో ఐదు గ్రామీణ విద్యుదీకరణ సంస్థలను నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించింది. అందుకు తగిన ఆర్థిక సహాయం ఆయా సంఘాలకు అందించాలన్న ఉద్దేశంతో అదే ఏడాది గ్రామీణ విద్యుత్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ఏర్పాటు చేసింది. అత్యంత వెనుకబడిన గ్రామీణ ప్రాంత వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సేవలను అందించాలనే ఉద్దేశంతో సహకార విద్యుత్ సరఫరా సంఘాలను ప్రారంభించింది. అందులో ఒకటి ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత వెనుకబడ్డ ప్రాంతమైన సిరిసిల్లలోని 'సిరిసిల్ల విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్'. దీనికి 1969 నవంబర్ 1 నాడు సహకార చట్టం కింద రిజిస్ట్రేషన్ జరిగింది. 1970 నవంబర్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. నాడు సిరిసిల్ల ప్రాంతం నుంచి నేత కార్మికులు, రైతులు వివిధ ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకొని వలసలు పోతుంటే ఆనాటి సిరిసిల్ల శాసన సభ్యులు చెన్నమనేని రాజేశ్వరరావు రాజకీయ చతురతతో, వ్యూహంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సిరిసిల్ల ప్రాంతానికి ఈ సంస్థను తేవడంలో ప్రముఖ పాత్ర పోషించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్న ఇక్కడి సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తే ఈ ప్రాంతానికే కాక, రూ.213 కోట్ల సొంత ఆస్తులు కలిగిన ఈ సంస్థకు కూడా ఎంతో నష్టం కలుగుతుంది.

ఈ సంస్థ 54 ఏళ్ళుగా విజయవంతంగా రాష్ట్రస్థాయిలో అన్ని ఆటుపోట్లను తట్టుకొని నిలదొక్కుకుంది. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన సేవలు అందిస్తున్నది. సంస్థలో నేడు అన్ని తరగతుల విద్యుత్ కనెక్షన్లు కలిపి 2.75 లక్షల సర్వీసులు ఉన్నవి. ఇందులో సుమారు 72,000 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నవి. సంస్థ అందించే విద్యుత్‌లో డెబ్బై శాతం దాకా ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత విద్యుత్తుకే వినియోగించబడుతున్నదన్నది ఇక్కడ కీలకమైన విషయం. కాగా రాష్ట్రంలోని మిగతా విద్యుత్ కంపెనీలు తమ వినియోగదారులకు ఏ రేటుకు చేస్తున్నవో అదే టారిఫ్ రేటుకు ఈ సంస్థ కూడా 14 మండలాల గ్రామాల వినియోగదారులకు విద్యుత్ అందిస్తున్నది. ఇందులో క్షేత్రస్థాయి ఉద్యోగుల పాత్ర గణనీయమైనది. అంతేగాక సభ్యులచే ఎన్నుకోబడిన పాలక వర్గాలు కూడా పరిపాలన దక్షతతో వ్యవహరించాయి. ఇక్కడి వినియోగదారులు దాదాపు 90శాతం మంది నెలనెలా విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థ పురోభివృద్ధికి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

ఇకపోతే ఇటీవల కాలంలో సంస్థ నిర్వహణలో అపశ్రుతి ఏర్పడానికి ప్రధాన కారణం గత ప్రభుత్వం తరఫున చెల్లించాల్సిన విద్యుత్తు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం. ఎందుకంటే సంస్థకు ప్రభుత్వం నుంచి వివిధ విభాగాల ద్వారా రావలసిన బకాయలు మొత్తం రూ.603 కోట్లు. ఇందులో ప్రభుత్వ ఆదేశాల మేరకు పవర్‌లూమ్ పరిశ్రమకు 50 శాతం విద్యుత్తు రాయితీ, స్థానిక శాసన సభ్యులు లేఖల ద్వారా కోరిన మేరకు ఆ విద్యుత్ నిర్మాణ పనుల సంస్థ సొంత నిధుల నుంచి వెచ్చించిన మొత్తం, గ్రామ పంచాయితీల వీధి దీపాలు, వాటర్ వర్క్స్ విద్యుత్తు వినియోగ బకాయిలు కూడా ఇమిడి ఉన్నాయి.

అంతేకాక రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వుల మేరకు సంస్థ వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించినందుకు గాను ప్రభుత్వం సెస్ సంస్థ తరఫున విద్యుత్ క్రాస్ సబ్సిడీని ఏటేటా ఎన్‌పీడీసీఎల్‌కు అందించాలి. కానీ 2018 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించగా మిగిలిన మొత్తం ఇంకా రూ.202కోట్లు ఉన్నది. కమీషన్ ఎత్తి చూపిన ఎన్‌పీడీసీఎల్‌కు సంస్థ చెల్లించాల్సిన బిల్లు మొత్తం రూ.558 కోట్లు ఉన్నది. కానీ సంస్థకు వివిధ పద్దుల కింద ప్రభుత్వం నుంచి రావలసిన బకాయలు రూ.603 కోట్లుగా, ఇందులో రూ.203 కోట్ల ఉచిత వ్యవసాయ విద్యుత్ వేరేగా ఉన్నది. అంటే మొత్తం సంస్థకు ప్రత్యక్షంగా పరోక్షంగా రూ.806కోట్లు రావలసి ఉన్నది. ఎన్‌పీడీసీఎల్‌కు సంస్థ చెల్లించవలసిన మొత్తం రూ.558 కోట్లు మాత్రమే. అంటే ప్రభుత్వం నుంచి రావలసిన మొత్తాలను సర్దుబాటు చేస్తే సెస్ మిగులు నిధులతో ఉంటుంది.

మరో ముఖ్యమైన విషయం ఈ సందర్భంగా తీసుకురావడం అప్రస్తుతం కానేరదు. 2017–18కు గాను విద్యుత్ సరఫరా యూనిట్ రేటు ఒక రూపాయి ఉండగా 2018–19 సంవత్సరం నుంచి ఒకేసారి రూ.4.52 పైసలుగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సంస్థ పెంచడం వల్ల సంస్థపై మూలిగే నక్కపై తాటిపండు పడినట్టు అయింది.

అంతేగాక సంస్థలతో ఉన్నతాధికారులు ఈఆర్సీ లేఖలకు తగిన సమాధానం సకాలంలో ఇవ్వలేకపోవడం కూడా ఒక కారణంగా తోస్తున్నది. ఉదాహరణకు ఈఆర్సీ నియమించిన ఆడిట్ విభాగం రెవెన్యూ లీకేజీగా రూ.94కోట్లలో 2014 నుంచి 2023 వరకు హెచ్.టి. వినియోగదారుల కింద విద్యుత్ బిల్లింగ్ చేయలేదని చూపెట్టింది. దీనికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సరైన జవాబు ఇవ్వలేకపోయారు. అసలు విద్యుత్ నియంత్రణ మండలి సంస్థకు హెచ్.టి. వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయుటకు 2022 సంవత్సరం నుంచి అనుమతి ఇచ్చింది. అయితే ఇలా ఉంటే 2014 నుండి ఎల్టీలో విద్యుత్ బిల్లింగ్ చేయడం రెవెన్యూ లీకేజీగా ఆడిటర్లు ప్రధాన పద్దుగా చూపెట్టడం గమనార్హం.


రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్న ఇక్కడి సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని ఎన్‌పీడీసీఎల్‌ విలీనం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తే ఈ ప్రాంతానికే కాక, రూ.213 కోట్ల సొంత అసెట్స్ కలిగిన సంస్థకు కూడా ఎంతో నష్టం కలుగుతుంది. ప్రస్తుత మారిన రాష్ట్ర ప్రభుత్వం సహకార విద్యుత్ సరఫరా సంఘం సిరిసిల్ల పైన కరుణ చూపించాల్సిన అవసరం ఉన్నది.

■ జూకంటి జగన్నాథం

ముస్లింలు నయా అస్పృశ్యులేనా?

'భారత రాజ్యాంగం విప్లకరమైనదే కానీ'... అంటూ ఫిబ్రవరి 6న ఆంధ్రజ్యోతిలో డానీ రాసిన వ్యాసంలో కొన్ని విషయాలు అసంబద్ధంగా, అసందర్భోచితంగా ఉన్నాయి. భారత రాజ్యాంగాన్ని నేనే తగలబెడతానని అంబేడ్కర్ అన్న మాటలను ఇటీవల కాలంలో జాతీయవాదాన్ని వ్యతిరేకించే మేధావులు చాలా చోట్ల ప్రయోగిస్తున్నారు. ఈ ప్రయోగం వెనుక వారి ఉద్దేశ్యాలు ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదు. ఇక, భారత రాజ్యాంగాన్ని మార్క్సిస్టు, లెనినిస్ట్ సిద్ధాంతాలతో ప్రేరణ పొందినవారు అంగీకరించరు అంటూనే ఈ రాజ్యాంగం విప్లవకరమైనదని, మెచ్చుకోదగినదని చెప్పడం అసంబద్ధంగా లేదా?

ఈ రాజ్యాంగం పనికిరానిది అంటూనే, పశ్చిమ బెంగాల్‌లో 32 సంవత్సరాలు, త్రిపురలో 27 సంవత్సరాలు, కేరళలో అర్ధ శతాబ్దిపైన వామపక్షవాదులు అధికారాన్ని అనుభవించారు. భారత రాజ్యాంగ హక్కులను కాలరాచి, ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వామపక్షాల్లోని ఒక వర్గం కొమ్ము కాసింది. వాస్తవంగా ఈ దేశంలోని వామపక్ష వాదుల్లో తాము నమ్మిన సిద్ధాంతం విషయంలో ఏకాభిప్రాయం లేదు. అందుకే వివిధ గ్రూపులు ఏర్పడ్డాయి. ఈ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారం విషయాల్లో ఒక స్పష్టమైన అభిప్రాయం ఇప్పటికీ లేదు. ఈ దేశ ఉత్థాన పతనాలకు కారణమైన హిందువుల సంస్కృతి పట్ల వారికి గుడ్డి వ్యతిరేకత ఉంది.



ఇక వ్యాసంలో అతి ముఖ్యమైన అంశం స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ముస్లింలను నయా అస్పృశ్యులుగా మార్చారని చెప్పడం. ఈ దేశంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం ఓట్ల కోసం సాగిలపడడం, వారి మతపరమైన, అభివృద్ధి వ్యతిరేక ఆలోచనలకు మద్దతు ఇవ్వడం పరిపాటి అయింది. వారిని గట్టి మతవాదులుగా దృఢీకరించారు. అందుకే షాబానో కేసు తీర్పును అంగీకరించమని కరాఖండిగా చెప్పేశారు. వాస్తవంగా ప్రపంచంలో ఏ దేశంలో మైనారిటీలు అనుభవించలేని హక్కులను ఈ దేశంలో ముస్లింలు అనుభవిస్తున్నారు. ఆ సామాజిక వర్గం నుంచి నలుగురు రాష్ట్రపతులు, నలుగురు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఎన్నిక చేయబడ్డారు. సుప్రీంకోర్టుకు మొట్టమొదటి మహిళా న్యాయమూర్తి కూడా ఆ సామాజిక వర్గానికి చెందిన ఫాతిమా బీవి. అటు పార్లమెంటులో, వివిధ రాష్ట్రాలలోని శాసనసభల్లో వారి ప్రాతినిధ్యం మతాలకు అతీతంగా ఉంది. ఈ దేశం మతం ఆధారంగా 1947లో మూడు ముక్కలయిందన్న వాస్తవాన్ని స్మృతి పథంలో ఉంచుకుంటే– మతం ఆధారంగా దేశాన్ని పంచుకోవాలని ప్రతిపాదన చేసింది ముస్లింలు. అందుకు మద్దతు ఇచ్చింది ముస్లింలు. ఈ విషయంలో హిందువుల ప్రమేయం ఏమీ లేదు. ముస్లింలు మెజారిటీగా ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలైన హిందువుల మనుగడ ఎలా ఉందో నిష్పాక్షిక విశ్లేషణ చేయగలిగే సామర్థ్యం ఉంటే వాస్తవాలు బయటపడతాయి.

ఇక కాశ్మీరు లోయలో మూడు లక్షల మంది హిందువులను తరిమివేసిందీ, హిందువులను ఊచకోత కోసిందీ, అందుకు మద్దతు ఇచ్చిందీ ఎవరు? అస్పృశ్యులే అయితే వారికి ఇలాంటి పనులు సాధ్యమేనా? 15 నిమిషాలు పోలీసులను పక్కన పెడితే అంటూ ఈ దేశంలోని 100 కోట్ల మంది హిందువులను ఉద్దేశించి భీకర ప్రతిజ్ఞ చేసింది ఈ అస్పృశ్యులలోని వ్యక్తే కదా! ముస్లింలు మెజారిటీగా ఉండే దేశాలలో మైనారిటీలు ఇలాంటి మాటలు మాట్లాడి బతుకుతారా? ఈ దేశంలో వాస్తవాలు విరుద్ధంగా ఉన్నాయి.

రాజ్యాంగ నిర్మాతల ఆలోచన పరిధిలో లేని 'లౌకిక' అనే పదం ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగంలో చేర్చారు. ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే వాళ్లకు ఇది ఒక అస్త్రంగా మారింది. వాస్తవం మాట్లాడితే ఈ దేశంలో ముస్లింలు, హిందువులు నిత్య జీవన వ్యవహారంలో సామరస్యంతోనే ఉంటున్నారు. రాజ్యాధికారం, కీర్తి కండూతితో లౌకికవాద ముసుగు వేసుకున్న రాజకీయ నాయకుల ఆలోచనలు హిందుత్వ రాజకీయాలకు ప్రేరణగా మారాయి. ఈ వాస్తవాన్ని ప్రజలకు వివరించగలిగే హితైషుల సంఖ్య ఈ దేశంలో పెరగాలి. ఇక షాహీన్‌బాగ్ ఉద్యమం, రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమ సమయాలలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో అధికారంలో ఉండివుంటే– పరిస్థితులు భిన్నంగా ఉండేవి. హిజాబ్‌ను ఇరాన్‌లో వ్యతిరేకించిన మహిళలకు ఏ గతి పట్టిందో మనదేశంలో ఉద్యమకారులకు అలాంటి గతే పట్టేది. ఈ ఉద్యమాల వెనుక ఉండే విదేశీశక్తులు, దేశ అంతర్గత శత్రువుల కుట్రలను అధికార బీజేపీ పసిగట్టినందువల్లనే ఉద్యమ స్వరూపం మారిపోయింది. అక్రమ చొరబాటుదారులను ఈ దేశ పౌరులుగా మార్చాలన్న కుహనా లౌకికవాదుల ప్రేరణ షాహీన్‌బాగ్ ఉద్యమం వెనుక ఉన్నది అనేది వాస్తవం.

– ఉల్లి బాలరంగయ్య

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఫులిపిరి ఆకు పసరుతో మటుమాయం

- మొదటి రోజు జిల్లాలో 99.8శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో





'పది' పరీక్షలు షురూ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో మొదటి రోజు తెలుగు పరీక్షకు 99.8శాతం మంది విద్యార్థులు హాజరవగా.. 12,014 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 14 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఆరుగురు ప్రైవేటు విద్యార్థులకు నలుగురు హాజరయ్యారు. హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైన్ పాఠశాలలోని కేంద్రా లను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మూడు కేంద్రాలు, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, ప్రభుత్వ పరీక్షల అదనపు కమిషనర్ డి. చలపతిరావు ఏడు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అలాగే జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాయి. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేశామని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై తెలిపారు.

నిబంధలను విరుద్ధంగా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు?

పదోతరగతి పరీక్ష కేంద్రాల్లోకి నిబంధనలకు విరు ద్ధంగా కొందరు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లను తీసుకెళ్లి నట్టు తెలుస్తోంది. వాస్తవానికి పరీక్ష విధులు నిర్వర్తిం చే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లను ఇళ్లవద్దే పెట్టి రావాల్సి ఉండగా.. సోమవారం చాలా మంది సెల్‌ఫోన్లను వెం ట తెచ్చుకున్నారని, కొందరు ఏకంగా పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లినట్లు సమాచారం. కొందరైతే తమ ఫోన్లను ప్రధానోపాధ్యాయుల గదుల్లో దాచిపెట్టి.. పరీక్ష మధ్యలో రిలీవర్ రాగానే ఖాళీ గదుల్లోకి వెళ్లి మరీ ఫోన్లు మాట్లాడినట్టు తెలిసింది.



ఎల్ఆర్ఎస్‌పై అయోమయం!

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య	
జీడబ్ల్యూఎంసీ :	21,623
జనగామ :	6,300
మహ-బాద్ :	7,546
తొర్రూరు :	3,200
డోర్నకల్ :	3,600
మరిపెడ :	4,234
పరకాల :	5,200
నర్సంపేట	5,462
వర్ధన్నపేట :	1,200
భూపాలపల్లి :	7,234

- ఈనెలాఖరులోపు పరిష్కారం సాధ్యమేనా?
- ఓ వైపు సిబ్బంది కొరత.. మరో వైపు ఎన్నికల హడావిడి
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 65వేలకుపైగా దరఖాస్తులు
- ఇప్పటికే రెండేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపు

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థలాల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం తెరపైకి లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)లో వచ్చిన దరఖాస్తులన్నిటిని ఈనెల 31 లోపు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమైనా.. మున్సిపల్ అధికారులు మాత్రం అయోమయంలో పడ్డారు. ఓ వైపు శాఖల్లో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా.. ఈ లోపే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రబద్ధీకరణ ప్రక్రియ పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధం వారి నుంచి వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియలో నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది, మునిసిపల్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు లైన్‌మెన్లు ఎంతో కీలకం. అయితే వరంగల్ మహానగర పాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట మున్సిపాలిటీల్లో మాత్రమే కొంత మేరకు ఈ సిబ్బంది ఉన్నా.. వీరికి ఇతర మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటే అయిదారు నెలలు పడుతుందని అంచనా కాగా.. ప్రస్తుతం తగిన సంఖ్యలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చిన నేపథ్యంలో చాలామంది అధికారులు, సిబ్బంది ఆ విధుల్లో బిజీగా మారడంతో ఈనెలాఖరు లోపు క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలపై మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్ అమలులో ఎట్టకేలకు కదలిక వచ్చినా పలు కారణా లతో ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితులు కనిపిం చడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలో 65వేలకుపైగా దరఖాస్తులు పరిష్కారానికి ఎదురుచూస్తున్నాయి.

పథకం అమల్లో కదలిక..

2020లో అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల భూ క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండడంతో ఇక్కడి స్థలాల ధరలు భారీగా పెరిగాయి. పట్టణ శివార్లలో జోరుగా వెంచర్లు వెలియడంతో కొనుగోలుదారులు వాటిలో ప్లాట్లు తీసుకున్నారు. చాలా వెంచర్లకు అనుమతి లేపోవడంతో పురపాలక సంఘాల అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకురాగా తాజాగా ఈ పథకం అమలులో కదలిక వచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల్లో మొత్తం 65,599 దరఖాస్తులు రాగా.. అప్పట్లోనే వీటి ద్వారా మునిసిపాలిటీలకు రూ.65.59కోట్ల ఆదాయం వచ్చింది. ఇక దరఖాస్తు సమయంలో ఒక్కో ప్లాట్‌కు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చెల్లించారు. వివిద కారణాలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. గత నెల 22న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దాంతో పురపాలికలకు ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడగా.. గత నెల 26న ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసింది. దేవాదాయ, వక్ఫ్ బోర్డు, ప్రభుత్వ, కోర్టు పరిధిలో ఉన్న భూములను మినహాయించి ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది

పరిశీలనతో మరింత ఆదాయం..

వరంగల్ నగర పాలక సంస్థతో పాటు జనగామ, మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మున్సిపాలిటీల్లో నేరుగా ఈ దరఖాస్తులను పరిశీలించవచ్చు. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే పురపాలికకు ప్రాంతాన్ని బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో స్థలానికి ఉన్న డిమాండ్‌ను బట్టి ఈ విలువ ఇంకా పెరిగి మునిసిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరుతుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. చాలా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణతో రూ. వందల కోట్లలో ఆదాయం సమకూరనుంది. పట్టణాల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనల మేరకు 10 శాతం స్థలాన్ని ప్రజోపయోగం కోసం పురపాలికలకు అప్పగించాలి. ఇది చాలా చోట్ల అమలు కాలేదు. దీనికి తోడు నిర్దేశించి వెడల్పు న రోడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో వెంచర్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

మార్గదర్శకాలు లేక...

సెల్‌ఫోన్ యాప్, పురపాలక శాఖ వెబ్ సైట్ (ఎల్ఆర్ఎస్-2020) ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఎలా పరిశీలించాలి ? ఎన్ని విడతల్లో ప్రక్రియ చేపట్టాలనే అంశంపై యంత్రాంగంలో స్పష్టత లేక ఇంతకాలం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అడపాదడపా ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగా లేక పోవడంతో మునిసిపాలిటీల్లో ఇంత కాలం ముందుకు సాగలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కసరత్తు ముమ్మరం చేశారు.



ఎవరికో అభయ'హస్తం'?

- కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ టెన్షన్
- 50మందికి పైగా ఆశావహుల ఎదురుచూపు
- నేడు, రేపు ఢిల్లీలో ఏఐసీసీ, సీఈసీ సమావేశాలు
- పొత్తులో సీటు తమదేనన్న ఆశల్లో కమ్యూనిస్టులు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో పార్టీలన్నీ ప్రజాక్షేత్రంలోకి దిగుతున్నాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదను పెడుతున్నాయి. కానీ వరంగల్ పార్లమెంట్ స్థానంలో మాత్రం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవటంతో ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా కాంగ్రెస్ టికెట్‌పై 50మందికి పైగా ఆశలు పెట్టుకుని ఢిల్లీ, హైదరాబాద్‌లలోని ముఖ్యనాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో జరిగే ఏఐసీసీ, సీఈసీ సమావేశాల్లో మిత్రపక్షాలతో పొత్తులు, మిగతా స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తారన్న వార్తల నేపథ్యంలో వరంగల్‌లో ఎవరికి పార్టీ నుంచి అభయ 'హస్తం' దక్కుతుందోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

వరంగల్ టికెట్‌పై పలువురి నజర్

వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. గత నెలలో ఆశావాహుల నుంచి అధిష్ఠానం దరఖాస్తులను స్వీకరించగా 42మంది తమకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆ తరువాత మరో పది మంది ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే ఏఐసీసీ బలమైన అభ్యర్థిని బరిలో దించాలని ప్రయత్నిస్తోంది. దీంతో ఇప్పటికే మూడు పర్యాయాలు వివిధ సర్వే ఏజెన్సీలతో సర్వేలు కూడా చేయించింది. అలాగే చాలామంది ఆశావహులు హైదరాబాద్, ఢిల్లీలో మకాం వేసి పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్యతో పాటు స్టేషన్‌ఘనపూర్ నియోజవర్గ

మిగతా 8వ పేజీలో..

సోమవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33.0° C | కనిష్ఠం : 22.0° C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం సా : 6.32 గం..
సహర్ : బుధవారం ఉ : 4.59 గం..

28న 'బార్' ఎన్నికలు



వరంగల్ లీగల్, మార్చి 18 : హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికలు మార్చి 28న నిర్వహించనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యాంసుందర్ రెడ్డి, గంగిడి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం సంయుక్తంగా ప్రకటన జారీ చేశారు. 2024-25 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న అర్హులైన ఓటర్ల జాబితా విడుదల, 20న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల పరిచయ కార్యక్రమం, 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కోర్టు ప్రాంగణంలోని పది కోర్టుల భవనంలోని సెల్లార్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి: కలెక్టర్ ప్రావీణ్య
- హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లతో సమన్వయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌కుమార్, ఎన్నికల నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కోరారు. అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సమీకరించిన బీఎల్ఓ వివరాలు, ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాలు, క్లిష్టమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, విఎస్‌టీ, వీవీటీ, అకౌంట్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం, ఎంసీఎంసీ, స్ట్రాంగ్, కౌంటింగ్ సెంటర్ల సిబ్బందికి శిక్షణ, నాలుగు జిల్లాల ధరల పట్టికలో రేట్లు, నోడల్ అధికారుల నియామకం, పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ, ఓటింగ్ శాతం పెంపుపై కూలంకషంగా చర్చించారు. స్పెషల్ పోలింగ్ కేంద్రాలు, ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్‌లు, ఓటర్ అవేర్‌నెస్ ఫోరం ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఎన్నికల విధుల నిర్వహణ, సామగ్రి పంపిణీ, సెక్టార్ రూట్‌మ్యాప్‌లు తదితర అంశాలపై సమీక్షించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 1899 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 419 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజవుగా పోలింగ్ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రోజువారి నివేదికలను ఎలాంటి తప్పులు దొర్లకుండా సకాలంలో పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

సమష్టిగా పని చేయాలి: సీపీ

సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గత అసెంబ్లీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. వచ్చే 90రోజులు అధికారులందరూ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటారని నిబద్ధతతో వ్యవహరిస్తూ, చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సమన్వయంతో పని చేయడంతో విజయవంతంగా పూర్తి చేశామని అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఏఆర్ఓలు, ఏసీపీలు సమన్వయంతో నివేదికలు అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు.

భూపాలపల్లి, జనగామ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌కై అధికారులకు విధులు కేటాయించామని, సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాల్సి ఉందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డీఎస్.వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, దత్తు, రాధికగుప్తా, వైవి.గణేష్, ఉప ఎన్నికల అధికారులు పీయూష్ కుమార్, సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు, డీసీపీలు ఎంఏ.బారి, రవీందర్, సీతారాం, ఏసీపీలు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగి

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



శాయంపేట, మార్చి 18: ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శాయంపేట మండలంలో జరిగింది. ఎస్ఐ ప్రమోద్ కుమార్ కథనం ప్రకారం.. రాజుపల్లి గ్రామానికి చెందిన ఆవుల దిలీప్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ టెలిగ్రామ్ యాప్‌కు సంబంధించిన ఫేక్ ట్రేడింగ్‌లో రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో విషయం తన తండ్రికి తెలుస్తుందనే భయంతో ఈనెల 3న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




మడికొండలో కేంద్ర పోలీసు బలగాల కవాతు



మడికొండలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య

మడికొండ, మార్చి 18: త్వరలో లోక్‌సభకు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి సోమవారం మడికొండలో స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మెట్టుగుట్ట ప్రధాన ద్వారం వద్ద నుంచి గ్రామం ధర్మసాగర్ రోడ్డు చివర వరకు, అలాగే గ్రామంలోని ప్రధాన వీధులలో పోలీసు బలగాలు కవాతు చేశారు. ఈసందర్భంగా స్థానిక సీఐ ప్రతాప్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించనట్లయితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై రమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు జంపయ్య, మోహన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకట్, రామ్మూర్తి, అశోక్, రాజ్‌కుమార్, రాజు, సతీష్, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.



నమ్మించి వంచించాడు...

పోలీసులకు యువతి ఫిర్యాదు - కేసు నమోదు

హనుమకొండ టౌన్, మార్చి 18 : వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకొని పెళ్లి విషయం ప్రస్తావించగానే నాకు సంబంధం లేదంటూ యువకుడు తప్పించుకొని తిరుగుతున్నాడని ఓ యువతి సోమ వారం రాత్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన యువకుడు వివాహం చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి శారీకరంగా అనుభవించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపేర వుతు న్నాని 5 లక్షలను డిజిటల్ పేమెంట్ ద్వారా తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి తల్లి పెద్దమనుషుల ద్వారా వివాహం గురించి యువకుడి అడగగా పెళ్లికి ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయిం చా రు. పోలీసుల సమక్షంలో పెళ్లికి అంగీకరించి ఈ నెల 16న యువతీతో నిశ్చితార్థం చేసుకున్నాడు. మరుసటి రోజు నుంచి పెళ్లి ఇష్టం లేదు, పెళ్లి చేసుకోనని బెదిరిస్తుండడంతో యువతి ఫిర్యాదు మేరకు యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ.. ఆభరణాలు పట్టివేత



పట్టుబడిన ఆభరణాలను చూపిస్తున్నఎస్సై

ఐనవోలు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఐనవోలు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పున్నేలు క్రాస్‌రోడ్డు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయరహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. జనగాం జిల్లా జఫర్‌గడ్‌కు చెందిన గోల్డ్ స్మిత్ కందగట్ల శివప్రసాద్ రూ. 11.13 లక్షల విలువచేసే బంగారం, వెండి అభరణాలను తన కారులో తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. పత్రాలు లేని కారణంగా ఆభరణాలను స్వాధీనపరుచుకొని విచారణ కోసం ఇన్‌కాం టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్ క్రైం, మార్చి18 : వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ కాలనీలో మూడు బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.15 వేల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం లేబర్ కాలనీలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పి.రమేశ్, సంపత్, విద్యాసాగర్ ఇళ్లపై దాడి చేశారు. వారి నుంచి లిక్కర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధృవీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి




రవీందర్(ఫైల్)

ఆత్మకూరు, మార్చి 18: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన రవీందర్ (50) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగా సోమవారం కూడా పనికి వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం ఇంటిలోని కరెంట్ బోర్డువద్ద ఉన్న వైర్లు రవీందర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, వివాహాలు అయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.









సాంకేతిక లోపంతో నిలిచిన ఇంటర్‌సిటీ

గార్ల, మార్చి 18 : సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లవల్సిన ఇంటర్ సిటీఎక్స్‌ప్రెస్‌రైలు సాంకేతిక లోపంతో గార్లలో 20 నిమిషాలు, డోర్నకల్‌లో 30 నిమిషాల పాటు అధికారులు నిలిపివేశారు. రైలు గార్ల సమీపంలోని పాకాలవంతెన వద్ద రైల్వే మరమ్మతుల పనులను నిర్వహిస్తున్న సిబ్బంది బండి వచ్చే సమయంలో ఉద్యోగులు ట్రాక్‌కు అమర్చిన జాకీవదిలి పక్కకు తప్పుకున్నారు. దీంతో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు పెద్దప్రమాదం తప్పింది. ఇంజన్ ముందు భాగం పూర్తిగా దెబ్బ తినడంతో బండిని సుమారు గంట పాటు నిలిపి వేశారు అనంతరం మరమ్మతులు చేపట్టి ముందుకు సాగించారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి స్థానిక యూనిట్ నెంబర్ 8 సంబంధించిన గ్యాంగ్ మోకర్‌దామ్ తమ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవరించారని ప్రాథమిక దర్యాప్తులో తేల్చి సదరు ఉద్యోగిని మహారాష్ట్ర బీదర్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

దంతాలపల్లి (మహబూబాబాద్ జిల్లా), మార్చి 18 : మండలంలోని రామానుజపురానికి చెందిన బయ్య ఉప్పలయ్య (55) తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. బయ్య ఉప్పలయ్యకు భార్యతో పాటు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 15న ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఈ క్రమంలో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా, సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసముద్రం, మార్చి 18 : కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని రైల్వేశాఖ అమలు చేసిన 'ఇజ్జత్' పాస్‌ల కోసం నిరుపేద వర్గాలు ఎదురుచూస్తున్నాయి. రాయితీ పాస్‌లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ అల్పాదాయవర్గాలకు చెందిన దినసరి కూలీ పనులు చేసుకునేవారు, చిరువ్యాపారులు కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, డోర్నకల్, భద్రాచలం ప్రాంతాలకు రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్నారు. అల్పాదాయ వర్గాలను దృష్టిలో ఉంచుకొని, వారికి ఉపయోగపడేలా.. రూ.25లకే నెలరోజుల రైల్వే రాయితీ పాస్‌లను 'ఇజ్జత్' పేరుతో 2009లో అప్పటి కేంద్రప్రభుత్వం రైల్వేశాఖలో ఈ పథకాన్ని ప్రారంభించింది. నెలకు రూ.1500 అంతకంటే తక్కువ ఆదాయం ఉన్నవారు రూ.25లు చెల్లిస్తే, వంద కిలోమీటర్ల మేర నెల రోజులపాటు రైళ్లలో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించారు. ఈ పాస్‌లను పొందేందుకు ఆదాయ ధ్రువీకరణ బాధ్యతలను పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలకు ఇచ్చారు. ప్రజాప్రతినిధి ఇచ్చే ఆదాయ ధ్రువీకరణ లేఖను తీసుకువచ్చి రైల్వేస్టేషన్‌లో రూ.25లు చెల్లించి నెలరోజుల ప్రయాణం కల్పించే రాయితీ ఇజ్జత్ పాస్‌ను తీసుకునే అవకాశం ఉంటుంది. మూడు నెలలకొకసారి ఆదాయ ధృవీకరణ లేఖను తీసుకువచ్చి ఇజ్జత్ పాస్‌లను రెన్యువల్ చేసుకునే వారు.

అయితే ప్రజాప్రతినిధుల నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇష్టారీతిన తీసుకురావడంతో అధిక ఆదాయం ఉన్నవారు సైతం ఇజ్జత్ పాస్‌లను పొందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ రైలు సీజన్ టికెట్ల సంఖ్య తగ్గుతూ ఇజ్జత్ పాస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో రైల్వేశాఖ ఆ పాస్‌ల నిబంధనలను సవరించింది. 2013 అక్టోబర్ నెలలో ప్రజాప్రతినిధుల లేఖతో పాటు తహసీల్దార్ జారీచేసే ఆదాయ ధ్రువీకరణ పత్రం సైతం తప్పనిసరిగా జతచేయాలనే నిబంధన విధించింది. ఈ నిబంధనల ప్రకారం నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకురావాల్సి ఉంటుంది. ఆదాయ ప్రమాణాలు పెరిగిన పరిస్థితుల్లో రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణ ఇచ్చే నిబంధనలు రెవెన్యూశాఖలో లేవు. దీంతో ఇజ్జత్ పాస్‌ల జారీ క్రమంగా నిలిచిపోయింది. ఆ తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయి, బీజేపీ ప్రభుత్వం రావడంతో ఈ పథకాన్ని ప్రారంభించే విషయంలో గత పదేళ్లలో ఎలాంటి ప్రకటన చేయలేదు.

నిబంధనలు సవరిస్తేనే అమలు సాధ్యం..

'ఇజ్జత్' పాస్ జారీలో ఉన్న నిబంధనలు మారుతున్న ఆర్థిక పరిస్థితులకనుగుణంగా సవరిస్తే అమలు సాధ్యమని తెలుస్తోంది. ఈ పాస్‌ల జారీకి రోజుకు రూ.50ల ఆదాయం ఉండే వారే అర్హులు. 15 ఏళ్లనాటి ఆదాయ ప్రమాణాలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఈ నిబంధనలు మార్చాల్సిన అవసరం ఉంది. కూరగాయలు విక్రయించే వారు, కూలీ పనులకు వెళ్లే వారికి కనీసం రోజుకు రూ.200 నుంచి రూ.500 వరకు ఆదా యం వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితిని నెలకు రూ.1500లను సవరించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని అల్పాదాయవర్గాలు కోరుతున్నాయి. ఇలా చేయడంవల్ల రూ.72 వేల నుంచి రూ.1.80 లక్షల ఆదాయం వరకు తహసీల్దార్ ద్వారా ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ఈ ధృవీకరణపత్రాల ఆధారంగా మళ్లీ ఇజ్జత్ పాస్‌లను రూ.25లకే జారీ చేస్తే తమకు రైలు ప్రయాణ ఖర్చులు మిగులుతాయని అప్‌డౌన్‌చేసే దినసరి కూలీలు, చిరువ్యాపారులు చెబుతున్నారు.

నిరీక్షణ

'ఇజ్జత్' పాస్‌ల పునరుద్ధరణ కోసం ఎదురుచూపులు

- రాయితీ రైల్వేపాస్‌లు లేక ఇబ్బందులు
- రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న పేదలు దినసరి కూలీలు, చిరువ్యాపారులు
- నిబంధనలు సవరించి, తిరిగి అమలు చేయాలని డిమాండ్



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న దినసరి కూలీలు, అల్పాదాయ వర్గాలు (ఫైల్)

సుమారు 500 మంది..

మహబూబాబాద్ జిల్లాలోని ఇంటికన్నె, కేసముద్రం, తాళ్లపూసపల్లి, మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల నుంచి నిత్యం సుమారు 500 మంది అప్‌అండ్‌డౌన్ చేసే కార్మికులు, అల్పాదాయ వర్గాలకు చెందిన వారున్నారు. వీరిలో కేసముద్రం నుంచి ఉదయం కాకతీయ, సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్లకు వందమంది వరకు భవన నిర్మాణ కార్మికులు, అల్పాదాయవర్గాలుండగా, వివిధ రకాల చిరువ్యాపారులు 100 నుంచి 150 మంది వరకు వెళుతున్నారు. మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్ల నుంచి ఖమ్మంకు 200లకుపైగా వరకు కూలీలు, చిరువ్యాపారులు ఉదయం పుష్‌పుల్ రైలుకు వెళుతున్నారు. వీరంతా ఇజ్జత్ పాస్‌లు పొందేందుకు అర్హులైన అల్పాదాయవర్గాలకు చెందినవారు కావడం గమనార్హం.

రాయితీ పాస్‌లను ఇవ్వాలి

ఆంగోత్ బాల, కాంగ్రెస్ నాయకుడు, కేసముద్రం స్టేషన్



దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలకు ఎంతో ఉపయోగపడే రాయితీ పాస్‌లను ఇవ్వాలి. నిత్యం అధిక చార్జీలతో అప్‌అండ్‌డౌన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇజ్జత్ పాస్‌లు ఎంతో ఉపయోగపడ్డాయి. మళ్లీ రాయితీ పాస్‌లను అందించాలి.

అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న పేదలు

అడప రాజు, దర్జీ, కేసముద్రం స్టేషన్



ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. ఆదాయం పెరిగినప్పటికీ ఖర్చులు కూడా అధికమయ్యాయి. ఇప్పటి పరిస్థితులకనుగుణంగా ఇజ్జత్ పాస్‌ల నిబంధనలను మార్పు చేసి మళ్లీ పేదలకు రూ.25ల రాయితీ పాస్‌లను అందివ్వాలి.

శాస్త్రవేత్తల పరిశోధనలు తోడ్పాటును అందించాలి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు రైతుల సంక్షేమానికి తోడ్పాటు అందించే విధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం ములుగురోడ్‌లోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడారు. పంటల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని కోరారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక ఒరవడులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రైతుల సంక్షేమానికి పరిశోధన, విస్తరణ రంగాల్లో శాస్త్రవేత్తలు చేసే ప్రతీ కార్య క్రమానికి తన తోడ్పా టు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం పరిశోధన స్థానం ఏడీ డాక్టర్ రావుల ఉమా రెడ్డి 2022-23 సంవ త్సరంలో వరంగల్ ప్రాం తీయ పరిశోధన స్థానం లో జరిగిన పరిశోధన ఫలితాలను వివ రించారు. రాబోయే సీజన్లలో విడుదల చేయ బోయే సరికొత్త వంగడాల గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశో ధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామ్‌రెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, రాణాప్రతాప్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. మాలతి, టి. సుజాత, వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యసాయాధికారులు ఉషాదయాల్, రవీందర్‌సింగ్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. బలరామ్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, వివిధ జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి

లేదంటే యథావిధిగా సమ్మె

వరంగల్ మెడికల్, మార్చి 18 : మూడు నెలల వేతనాల కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీస్‌పై యూనియన్ ప్రతినిధులతో ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ సోమవారం చర్చలు జరిపారు. 20వ తేదీ వరకు జీతాలు చెల్లించాలని డైరెక్టర్ హామీ ఇచ్చారని జీతాలు చెల్లిస్తే సంతోషం.. లేకపోతే యథావిధిగా సమ్మె కొనసాగుతుందని ఏఐటీ యూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా, ఎన్‌హెచ్ఎం ఆల్ క్యాడర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న దాదాపు 17వేల మంది ఉద్యోగులకు మూడు నెలలుగా చెల్లించకుండా పెం డింగ్ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఈ నెల 22 నుం చి నిరవధిక సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ వేతనాలు చె ల్లించే విషయంలో కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఈ పోరాటానికి ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, రెండవ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాం జనేయులు, రెండవ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, కోశాధికారి పద్మ, జ్యోతి, రాజేశ్వరెడ్డి, బాపుయాదవ్‌తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా

స్టోన్ క్రషర్స్ యజమానుల సమ్మెబాట

- ఉపాధి కోల్పోతున్న వందల మంది కూలీలు
- సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ
- ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేయాలని యజమానుల డిమాండ్



క్రషర్‌లో నిలిచిన పనులు



నిలిచిన వాహనాలు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 18 : మైనింగ్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా తెలంగాణ స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టోన్ క్రషర్స్ యజమానులు ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. 25 సంవత్సరాలుగా క్రషర్స్ లీజుకు తీసుకుని నడుపుకుంటున్న మాపై అక్రమంగా పెనాల్టీలు వేస్తున్నారని యజమానులు అంటున్నారు. మేము ప్రతీ సంవత్సరం రాయల్టీ ఫీజు హెక్టార్‌కు రూ.లక్ష ప్రభుత్వానికి కడుతున్నామని, 80 శాతం కంకరను ప్రభుత్వ పనులకే సరఫరా చేస్తున్నామని, 80 శాతానికి కాంట్రాక్టర్ బిల్లు నుంచి సీనరేజి ఛార్జెస్ కట్ చేసి మైనింగ్ శాఖకు జమ చేస్తున్నామని యజయానులు వాపోతున్నారు.

సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ

రాయల్టీ(సీనరేజి) ఫీజు అనేది కాంట్రాక్టర్ దగ్గర గానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర గానీ ఎవరో ఒకరి దగ్గర మాత్రమే ప్రభుత్వం వసూలు చేయాలి. కానీ ప్రభుత్వ పనులకు సంబంధించిన సీనరేజి ఛార్జెస్ మైనింగ్ శాఖకు క్రషర్ యజమానులు చెల్లించాలి దాంతో మాకు సంబంధం లేదు అని అంటున్నారని యజమానులు సమ్మెకు దిగారు. అలాగే 30 సంవత్సరాల నుంచి ఉన్న లీజులను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా సర్వే చేసి ఇప్పుడున్న రేటు ప్రకారం ఇష్టారాజ్యంగా పెనాల్టీ వేసినట్లయితే గతంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఏం చేసిందనేది క్రషర్ యజమానుల వాదన. ఇప్పుడు ఆన్‌లైన్ సర్వే చేసి కోట్ల రూపాయలు పెనాల్టీ వేస్తున్నారని, ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేస్తే ప్రభుత్వం ఎలా చెప్తే అలా నడుచుకుంటామని అంటున్నారు.

ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి..

పేరాల మధుసూదన్ రావు, కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి. రాయల్టీ ఫీజు కాంట్రాక్టర్ దగ్గర కానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర ఎవరో ఒకరి దగ్గర మాత్రమే తీసుకోవాలి. డిజిటల్ సర్వే చేసి రూ.కోట్లలో పెనాల్టీ విధించడం సరికాదు. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తాం.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా క్రషర్స్ నడుపుకోవాలి

సాంబశివరావు, మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టోన్ క్రషర్స్ యజమానులు క్రషర్స్‌ను నడుపుకోవాలి. ప్రభుత్వ, మైనింగ్ శాఖ నిబంధనల మేరకు నడుచుకోవాలి. క్రషర్స్ యజమానుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.

వెండి ఆభరణాలకూ హాల్ మార్క్ వేయాలి

బీఐఎస్ డీడీజీకు వినియోగదారుల మండలి విజ్ఞప్తి

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు చెన్నైలోని సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యుఎస్‌పీ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్, ఉపాధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పిడతల రమేష్‌రెడ్డి, చైన్నై నగర అధ్యక్షుడు ఎక్.ప్రకాశ్‌లు చైన్నైలో యాదవ్‌తో సమావేశం అయ్యారు. వెండి ఆభరణాలలో 50 శాతం వరకు కల్తీ జరుగుతోందని, వెండిని ఎక్కువ శాతం కొనుగోలు చేసేది పేద, మధ్య తరగతి ప్రజలేనని వారు తెలిపారు. సాంప్రదాయంగా వెండిని ఎక్కువగా ధరించేది గిరిజనులేనని, దీంతో వెండిలో కల్తీ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేదవారు, గిరిజనులేనన్నారు. అందు వల్ల వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 41, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 హాల్ మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయనీ వీటి సంఖ్యను పెంచాలని కూడా వారు కోరారు. వినితి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు ఐఎస్ఐ డీడీఏ యాదవ్ సానకూలంగా స్పందించారు. తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాల్లో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



వినతి పత్రం సమర్పిస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

రేపటి నుంచి కెమిస్ట్రీ మూల్యాంకనం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : ఇంటర్మీడియేట్ జవాబు పత్రాల మూల్యాంకనంలో భాగంగా ఈ నెల 20 నుంచి రసాయన శాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని క్యాంపు అధికారి ఎ. గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీతో పాటు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మూల్యాంకన విధుల్లో పాల్గొనాల్సిన అధ్యాపకులు 20న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ స్పాట్ క్యాంప్‌లో రిపోర్టు చేయాలని ఆయన కోరారు.

నేడు రైతులకు వీసీలో సలహాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : రైతు వేదికలో ఏర్పాటు చేసే వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు రైతు నేస్తం కార్యక్రమంలో నేరుగా రైతులు వీక్షించాలని ఆమె కోరారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయంలోని పలువురు శాస్త్రవేత్తలు రైతుల కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పంటల సాగు, సస్యరక్షణ అంశాలపై సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు.

ప్రభుత్వ అనుమతి ఉంటేనే కరపత్రాలు ముద్రించాలి

అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి18 : ఎన్నికలకుల సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు ప్రభుత్వ అనుమతి ఉంటేనే ముద్రించాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సోమవారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాల ముద్రణలో ముద్రించిన పత్రాల వివరాల సంఖ్యతో పాటు ముద్రించిన వారి పేరు, ఫోన్ నెంబర్ కరపత్రాలు, పోస్టర్లపై ఉండాలన్నారు. ఏ జిల్లాలో ముద్రించారో ఆ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ ఏపీఎస్వీ ప్రసాద్, ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు, పబ్లిషర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18: సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి ఇంటెలిజెన్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, గంజాయి, నార్కోటిక్స్ రవాణా జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఏడు అంశాల ప్రాతిపదికన క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో గుర్తించి సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి నగదు, మద్యం పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ సత్యనారాయణ, నార్కోటిక్స్ ఎస్సీ సైదులు, ఐటీశాఖ నోడల్ అధికారి మహేందర్‌బాబు, ఎక్సైజ్ కమిషనర్ నాగేందర్‌రావు, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీబీసీడీవో పుష్పలత పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో మాదిగ ఉప కులాలకు అన్యాయం

కాళోజీజంక్షన్, మార్చి 18: కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్- టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా అన్నారు. సోమవారం హనుమకొండ రాయల్ గార్డెన్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా ఓసీలకు 17, బీసీలకు 13, ముస్లింలకు 3, ఎస్టీలకు 3, ఎస్సీలకు 1 కేటాయించాలని ఆయన వివరించారు. రాష్ట్రంలో అధికంగా జనాభా ఉన్న ఎస్సీలకు, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు స్వామి, సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రాకేష్, జిల్లా యువసేన అధ్యక్షుడు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'నియమావళి' అమలులో..

» గ్రేటర్ అధికారుల స్పెషల్ డ్రైవ్ » ఫ్లెక్సీల తొలగింపు, వాల్‌పేయింట్ల చెరిపివేత



నగరంలో పోస్టర్లు, వాల్ రైటింగ్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 : పార్లమెంట్‌తో పాటు పలురాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో ఈ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాలతో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రాజకీయ నాయకులకు చెందిన వాల్ రైటింగ్స్, ఫెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగిస్తున్నారు. అలాగే ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోటీకి ఆసక్తి చూపిన పలువురు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు గాను ముందుగానే ఫ్లెక్సీలు, హోర్డింగులు, వాల్‌రైటింగ్స్‌తో హడావుడి చేయగా.. కోడ్ అమల్లోకి వచ్చిన 24గంటల్లోపు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ విశ్రాంతి గృహాలు, విద్యాలయాలు, షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్స్, సూపర్ మార్కెట్స్ ప్రాంతాల్లో, 48 గంటల్లో ప్రైవేటు స్థలాలు, పబ్లిక్ పార్కులు, జంక్షన్లు, సెంటర్లలో ఏర్పాటు చేసినవి, 72గంటల్లో కార్పొరేషన్ పరిధిలోని వాల్‌రైటింగ్స్‌ను తొలగిస్తున్నారు. 25 కిలో మీటర్ల మేర విస్తరించిన గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో చీఫ్ మెడికల్ అధికారి మల్లం రాజేశ్ పర్యవేక్షణలో శానిటరీ సూపర్‌వైజర్లు, జవాన్లు, సిబ్బంది తొలగింపు ప్రక్రియలో భాగస్వాములయ్యారు. సోమవారం వరకు వివిధ పార్టీలకు సంబంధించిన 10 వేల బ్యానర్లు, ఫెక్సీలు, వాల్ పోస్టర్లు తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా చాలా చోట్ల తొలగించేవి ఉన్నాయని 72 గంటల్లో వాటి ఆనవాళ్లు కనిపించకుండా చేస్తామని సిబ్బంది తెలిపారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, మార్చి 18 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ 53వ డివిజన్ లష్కర్‌సింగారంలో సామాజికవేత్త రేణుకుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా మహిళల అభ్యున్నతికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆయన తెలిపారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసిందని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి శాలువా కప్పి గజమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బంక సరళ-సంపత్‌యాదవ్, అజీజ్ మీర్జా, ఎర్ర మహేందర్, పుల్ల చిన్నా, భరతపురం కిరణ్, రేణుకుంట్ల కిరణ్, ఎర్ర సురేశ్, సిలువేరు నరేశ్, నద్దునూరి రవి, బొక్క రవిలతో పాటు దాదాపు రెండు వందల మంది యువకులు, మహిళలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించాలి..

» ఎన్ఆర్ఐ, కాంగ్రెస్ నేత చింత ప్రవీణ్‌కుమార్

వడ్డెపల్లి, మార్చి 18: వరంగల్ లోక్‌సభ టికెట్ తనకు కేటాయించాలని ఎన్ఆర్ఐ(యూఎస్ఏ), కాంగ్రెస్ రాష్ట్ర నేత చింత ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు యూఎస్ఏలో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వరంగల్ చౌరస్తా, మార్చి 18: మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన సంతోషిమాత కాలనీకి చెందిన పోలీసు గన్‌మెన్ విలాసాగరం రాజు కుటుంబాన్ని, రామన్నపేటలోని శెట్టి రవి కుటుంబాన్ని సోమవారం మాజీ చీఫ్ విప్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శించారు. గుండెపోటుతో మరణించడం విషాదకరమని వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. వినయ్ భాస్కర్ వెంట రాచర్ల జగన్, గట్టు చందు, మేడకట్ల సుకుమార్ పాల్గొన్నారు.



మృతి చెందిన గన్‌మెన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వినయ్‌భాస్కర్

నీటిఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించండి

» ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్

» మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 : రాష్ట్రంలో నీటి ఎద్దడి నివారణకు సమగ్ర ప్రణాళికతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఎంఎయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరి దాన కిశోర్ సూచించారు. సోమవారం వేసవి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హైదరాబాద్ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ బల్దియా కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. దానా కిశోర్ మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. నీటి ఎద్దడి ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని, ఎండా కాలం ముగిసే వరకు ప్రతీ గడపకు నీరు అందించే విధంగా చూడాలని అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నూతనంగా నిర్మించే ఇళ్ల పరిసరాలలో ఇందుకు గుంతలు తీసి నీటిని నిల్వచేసి భూగర్భ జలాల పెంపు కోసం అధికారులు చొరవ చూపాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 66 డివిజన్‌ల పరిధిలో నీటి వినియోగంపై అనుసరిస్తున్న విధానంపై వరంగల్ కమిషనర్ అశ్విని వెల్లడించారు. ప్రతీ రోజు ప్రజల అవసరాల కోసం 180 ఎంఎల్‌డీల నీరు అవసరం ఉందని, ధర్మసాగర్ రిజర్వాయర్ ప్రధాన వనరుగా ఉందని చెప్పారు. బల్దయా పరిధిలో 20 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందని వేసవిలో 47 వాటర్ ట్యాంకుల ద్వారా నీరు అందించడం జరుగుతుందని అన్నారు. వార్షిక ప్రణాళికలో భాగంగా రూ. 86 లక్షలతో లీకేజీలను అరికట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, ఈఈలు రాజయ్య, శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సారంగం, రవికిరణ్, రంగారావులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అధికారులు

నీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

» బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 : గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రజలకు నీరు అందుబాటులో ఉండాలని, నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌లను సందర్శించి నీటి సరఫరాపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఇంటెక్‌వెల్ నుంచి మూడు ఫిల్టర్ బెడ్‌లకు వెళ్తే నీటిని పరిశీలించారు. ల్యాబ్‌లో నీటి నాణ్యత నిర్ధారణ విధానం, క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి గత ఐదు సంవత్సరాలుగా నీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సహకారం అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు హామీ ఇచ్చారు. అనంతరం వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీటి శుద్ధీకరణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఫ్లో మీటరు పని తీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, డీఈలు సంతోష్, శ్రీకాంత్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఏఈ మహేశ్‌లు ఉన్నారు.

లావణ్యకు ఉత్తమ మహిళా పురస్కారం



ఉత్తమ మహిళా పురస్కారం అందుకుంటున్న లావణ్య

జూలైవాడ, మార్చి 18: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు హనుమకొండ విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా పురస్కారాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా హనుమకొండలోని తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న నెల్లుట్ల లావణ్య సేవలను గుర్తించిన విస్డం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు టీవీ.అశోక్ కుమార్, అనుమాండ్ల నాగరాజు, పద్మావతి చేతుల మీదుగా ఉత్తమ మహిళా పురస్కారాన్ని అందజేశారు. లావణ్య ఉపాధ్యాయురాలిగానే కాకుండా కవయిత్రిగా కూడా రాణిస్తున్నారు.

ఎవరికో అభయ'హస్తం'?

5వ పేజీ తరువాయి

ఇన్‌చార్జ్ శనిగపురం ఇందిరా, రాగమళ్ల పరమేశ్వర్, జన్ను పరంజ్యోతి, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌తో పాటు మరో నలుగురైదుగురు సీనియర్ కాంగ్రెస్ నేతలు సీరియస్‌గా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధానంగా దళితుల్లో మాల, మాదిగ సామాజిక వర్గాల్లో ఎవరికి సీటు ఇవ్వాలనే దానిపైనే ప్రధానంగా చర్చ జరుగుతుండగా.. పెద్దపల్లి, నాగూర్‌కర్నూలు సీట్లలో మాల సామాజిక వర్గం నేతలకే టికెట్ దక్కే అవకాశం ఉండటంతో మాదిగ సామాజిక వర్గం వ్యక్తికి వరంగల్ సీటును కేటాయిస్తారనే చర్చ జరుగుతుంది. ఇక్కడ మాదిగ కులస్థుల ఓట్లే అధికంగా ఉండటంతో ప్రధాన పార్టీలు ఈ సామాజిక వర్గం నేతలకే టికెట్ ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నాయి. కాంగ్రెస్ తొలుత అద్దంకి దయాకర్‌ను పోటీ చేయించాలని భావించినప్పటికి ఈ సామాజిక లెక్కల కారణంగానే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో నాగూర్‌కర్నూలు, పెద్దపల్లి, వరంగల్ సీట్లపై ఒకేసారి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

తేల్చుతారా? నాన్చుతారా?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర పూర్తి కావటంతో మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ సమావేశం నిర్వహిస్తుండగా.. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితర నేతలు ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళుతున్నారు. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ మూడో జాబితాపై కసరత్తు చేయనున్నారు. రాష్ట్రంలో అత్యధిక పోటీ ఉన్న వరంగల్ సీటుపై ఈ సమావేశంలో తేల్చుతారా? ఇంకా నాన్చుతారా? అన్న చర్చ జరుగుతోంది. మరోవైపు బుధవారం ఢిల్లీలోనే కాంగ్రెస్ మిత్రపక్షాలతో సమావేశం కానుండగా.. ఇండియా కూటమిలోని పార్టీలకు టికెట్ల కేటాయింపులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ ఆశిస్తుండటంతో ఈ సమావేశంలో వరంగల్ సీటుపై ఏదో ఒకటి తేలుతుందనే ఆశతో సీపీఐ ఉంది. అయితే ఎన్నికలకు కూడా 55రోజుల సమయం ఉండటంతో ఇప్పుడే వరంగల్ సీటుపై తేల్చుతారా లేక నామినేషన్ల వరకు నాన్చుతారా అనే చర్చ కూడా పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య ఎన్నికల ప్రచారంలోకి దిగారు. అలాగే బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగడం దాదాపు ఖరారనే చర్చ జరుగుతోంది. కానీ దీంతో కాంగ్రెస్‌లో మాత్రం అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దీనికి ఈ రెండ్రోజుల్లో తెరపడుతుందని భావిస్తున్నారు.

కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు



కాజీపేటలోని చైతన్యపురి వేంకటేశ్వరాలయంలో ధ్వజారోహణ పూజల దృశ్యం

కాజీపేట టౌన్, మార్చి 18 : కాజీపేట 61వ డివిజన్‌లోని చైతన్యపురి శ్రీ వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఉదయం 7 గంటలను నిర్వహించిన బాలభోగంతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ రోజు అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, ఉపనిషత్ శ్రీమద్రామాయణ వెంకటాచల మహత్యపారాయణములు, భేరి పూజ, దేవతాహ్వానం, హోమం, సామూహిక లక్ష్మి అర్చనలు, బలిహరణం, శేషవాహనసేవ వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19వ తేదీ మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటు సాయంత్రం 6.30 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవ మహోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులైన పంజాల అశోక్‌కుమార్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన రెడ్డిసంఘం నాయకులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 : రాష్ట్రంలోని ఉన్నటువంటి రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందు కు సీఎం రేవంత్‌రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంఘం నాయకులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందించారు. సీఎంను కలిసిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంఘం నాయకులు నగలకం సత్యనారాయణ రెడ్డి, దాసరి కేశవరెడ్డి, గోపు జయపాల్‌రెడ్డి, రాదారపు సంజీవరెడ్డి, రాగిడి రాజేందర్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, అర్షుల కిషన్‌రెడ్డి, దాసరి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వరంగల్ రెడ్డి సంఘం నాయకులు

తెలంగాణ ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కాళోజీ జంక్షన్, మార్చి 18: తెలంగాణ ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు నాగారం మణితేజ కోరారు. 2018లో తెలంగాణ ప్రైవేటు యూనివర్సిటీ చట్టం తీసుకొచ్చిందని కానీ అందులో నిరుపేదలకు రిజర్వేషన్లు కల్పించడానికి నిరాకరించిందని ఆయన అన్నారు. సోమవారం నక్కలగుట్టలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి తెలంగాణలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి చట్ట సవరణ చేస్తామని ప్రకటించారని సీఎం నిర్ణయాన్ని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ స్వాగతిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చట్టం రాగానే ఐదు కొత్త యూనివర్సిటీలను బీఆర్ఎస్ నాయకులకే కేటాయించారని అన్నారు. ఆ యూనివర్సిటీల్లో చదువాలని ఆశపడే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల అన్యాయం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చట్ట సవరణ చేసి రిజర్వేషన్లు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివరాత్రి శ్రీకాంత్, అంబాల హరికుమార్, రామంచ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మణితేజ

కేయూ పరీక్షల కేంద్రాల సందర్శన

కేయూ క్యాంపస్, మార్చి 18 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ సందర్శించారు. మానవీయ శాస్త్ర భవనంలోని పరీక్షల కేంద్రాలను సందర్శించగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహాచారి తదితరులున్నారు.



పరీక్షల కేంద్రాలను సందర్శిస్తున్న వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, కంట్రోలర్ నరసింహాచారి

ఎస్సారెస్పీ కాలువలో పడి ఇదరి మృతి

మృతులు బీహార్ వాసులు.. చేపలు పట్టడానికి వెళ్లిన క్రమంలో ఘటన

ఎల్కతుర్తి, మార్చి 18 : చేపలు పట్టడానికి వెళ్లిన ఇద్దరు యువకులు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన గురించి ఎల్కతుర్తి ఎస్ఐ గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం గయా జిల్లా రాచకోట గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (25), దీపక్‌కుమార్ (20)లు ఎల్కతుర్తి మండల కేంద్రానికి సమీపంలోని లక్ష్మి గణపతి గ్రానైట్ కంపెనీలో వారం రోజుల క్రితం కూలీలుగా చేరారు. శనివారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి ఎల్కతుర్తి సమీపంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో చేపలు పడుతున్న క్రమంలో అనిల్ కుమార్ ప్రమాదవశాత్తు కాల్వలో పడి కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు దీపక్ కుమార్ కాల్వలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఇద్దరూ కాలువలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న కంపెనీ టేకేదార్ ప్రింటు భారతి స్థానికుల సాయంతో వారి కోసం గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం హసన్‌పర్తి మండలం చింతగట్టు సమీపంలో అనిల్‌కుమార్ మృతదేహం, గీసుకొండ సమీపంలో దీపక్‌కుమార్ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. గ్రానైట్ కంపెనీ టేకేదారు భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాలకు వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు.






అనిల్‌కుమార్, దీపక్‌కుమార్ మృతదేహాలు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

వరంగల్ క్రైం, మార్చి 18 : కొద్ది మాసాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పసునూరి దేవేందర్(25) అనే యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలి వేల్పుల గ్రామానికి చెందిన దేవేందర్ కిడ్నీ సంబంధిత వ్యాధి తట్టుకోలేక గ్రామ సమీపంలోని చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. నగరంలోని మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వైద్యుడు తనకు వైద్యం సరిగా చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి చనిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో దూకి యువకుడి బలవన్మరణం

వ్యక్తిగత కారణాలతో వేల్పుల సాయికుమార్(27) అనే యువకుడు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సాయికుమార్ సోమవారం రాత్రి కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో సాయికుమార్ ఆచూకీ తెలియలేదు. ఈ విషయాన్ని ఎస్ఐ రాజ్‌కుమార్ ధృవీకరించారు. సాయికుమార్ కెనాల్‌లో దూకింది వాస్తవమేనని ఆచూకీ తెలియాల్సి ఉందని వెతుకుతున్నట్లు తెలిపారు.



ఫాస్టింగ్

ఎలాంటి యంత్రానికైనా విశ్రాంతి అవసరం. అలాగే మన పొట్టకు కూడా! అందుకోసం ఉపవాసం ఉండడం మంచి లక్షణం. అయితే ఏ కారణంతో ఉపవాసం చేసినా, దాంతో ఆరోగ్య ఫలాలు దక్కాలంటే, కొన్ని నియమాలు తప్పక పాటించాలి అంటున్నారు వైద్యులు!

పొట్టకు రెస్ట్

ఉపవాసం కచ్చితంగా పరమౌషధమే! తెరిపి లేకుండా పని చేసే జీర్ణ వ్యవస్థకు విరామం ఇవ్వడం అవసరం. కాబట్టే అన్ని మతాలు, సంస్కృతుల్లో ఉపవాసం ఒక తప్పనిసరి సంప్రదాయంగా మారింది. ఉపవాసంతో జీర్ణశక్తి మెరుగవుతుంది. శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం పెరుగుతుంది. పోషక శోషణ కూడా పెరుగుతుంది. అలాగే ఉపవాసంతో అధిక బరువు తగ్గే అదనపు ప్రయోజనం కూడా పొందవచ్చు. అయితే ఉపవాసం ప్రయోజనం దక్కాలంటే, అనుసరించే ఉపవాసం క్రమం తప్పకుండా, ఒక పద్ధతి ప్రకారం కొనసాగాలి. రాత్రి హెవీగా బిరియానీ తినేసి, మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేసే వాళ్లుంటారు. లేదంటే కొన్ని రోజులు రెండు పూటలు లేదా ఒక్క పూట భోజనానికే పరిమితమైపోయేవాళ్లూ ఉంటారు. కానీ ఇలా నచ్చినట్టు, నచ్చినప్పుడు ఉపవాసాలు ఉండడం వల్ల శరీరం అల్లకల్లోలానికి గురవుతుంది. ఎప్పుడు ఆహారం అందుతుందో, ఎప్పుడు ఆహార కొరతను ఎదుర్కోవాలో ఊహించలేక శరీరం అయోమయానికి లోనవుతుంది. అస్తవ్యస్త ఉపవాసాల ఫలితంగా కొన్ని దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది.

అస్తవ్యస్థ ఉపవాసంతో...

సమయానికి తినకపోవడం మూలంగా గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తవచ్చు. కడుపు ఉబ్బరం, అసిడిటీ వేధించవచ్చు. అలాగే బలహీనత, మానసిక సంతులనం కోల్పోవడం లాంటి లక్షణాలు కూడా వేధిస్తాయి. బరువు తగ్గడం కోసం ఉపవాసాన్ని ఆశ్రయించేవాళ్లు, అవగాహన లేమితో కొనసాగించే అస్తవ్యస్థ ఉపవాసాల వల్ల బరువు తగ్గకపోగా, పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలాంటి ఉపవాసాలతో మెటబాలిజం దెబ్బతిని బరువు అదుపు తప్పుతుంది. అలాగే ఉపవాసంతో కడుపు నకనకలాడుతూ గంటల తరబడి ఆకలితో అల్లాడిపోయిన తర్వాత, ఒకేసారి ఎక్కువ పరిమాణంలో ఆహారం తినేస్తూ ఉంటారు. బరువు పెరగడానికి ఇదీ ఒక కారణమే! మరీ ముఖ్యంగా ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ చేసే వాళ్లు ఆహారం తీసుకునే విండో టైమ్‌లో నచ్చినవన్నీ తినేస్తూ ఉంటారు. రోజంతా తినడం లేదు కాబట్టి విండో టైమ్‌లో ఏం తిన్నా ఫర్వాలేదు అని సర్దిచెప్పుకుంటూ ఉంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు.

వారానికో రోజు

వారంలో ఒక రోజు లేదా పక్షంలో ఒక రోజు ఉపవాసం ఉండడం ఆరోగ్యకరం. ఇలాంటి ఉపవాసంతో శరీరానికి పూర్తి విశ్రాంతి దక్కి, మెటబాలిజం పెరుగుతుంది. శరీరం డిటాక్సిఫై అవడంతో పాటు, కొత్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. అయితే ఉపవాసం చేయడం కంటే, అందుకోసం శరీరాన్ని సిద్ధం చేయడం అంతకంటే ముఖ్యం. మరుసటి రోజు ఉపవాసం చేయబోతున్నప్పుడు, ముందు రోజు శరీరానికి తేలికపాటి ఆహారాన్ని అందించాలి. మరీముఖ్యంగా శరీరంలో పిహెచ్ విలువలు తగ్గకుండా చూసుకోవాలి. సాధారణంగా మనం ఉడికించిన పదార్థాలనే తింటూ ఉంటాం. ఇలా వండడం వల్ల ఆ పదార్థాలన్నీ ఆమ్లత్వాన్ని సంతరించుకుంటాయి. మన పొట్టలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్ కూడా జీర్ణక్రియకు తోడ్పడుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఉపవాసంలో ఉన్నప్పుడు ఈ ఆమ్లం ఉత్పత్తి కాకుండా ఆపడం కోసం ముందు రోజు నుంచే క్షార గుణం కలిగిన ద్రవాలను, పదార్థాలనూ తీసుకోవడం అవసరం. అందుకోసం కొబ్బరినీళ్లు, పళ్లు, సలాడ్లు తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. ఈ నియమాలు పాటించడం వల్ల ఉపవాసానికి శరీరం చక్కగా సహకరించి, నీరసించిపోకుండా ఉంటుంది. ఇలా వారంలో లేదా పక్షంలో ఒక రోజు ఉపవాసం ఉండడం ఆరోగ్యకరం.

వీళ్లకు ఉపవాసం వద్దు

ఫ్యాటీ లివర్ డిసీజ్ ఉన్నవాళ్లు, కాలేయ సమస్యలున్న వాళ్లు, బరువు తగ్గాలనుకునేవాళ్లకు ఉపవాసం సత్ఫలితాన్నిస్తుంది. పెద్ద పేగు, చిన్న పేగు కేన్సర్ల నుంచి రక్షణ పొందడం కోసం కూడా ఉపవాసం ఉంటూ శరీరాన్ని శుద్ధి చేసుకుంటూ ఉండాలి. అయితే ఉపవాసం చేయకూడని వాళ్లు కూడా ఉంటారు.

- మధుమేహుల్లో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి. కాబట్టి వీళ్లు ఉపవాసానికి బదులుగా ఆహార పరిమాణాన్ని తగ్గించి తినాలి.
- సర్జరీ నుంచి కోలుకుంటున్న వాళ్లు ఉపవాసాలు చేయకూడదు
- మూత్రపిండాలు, ఇతరత్రా తీవ్ర ఆరోగ్య సమస్యలున్న వాళ్లు ఉపవాసం చేయకూడదు.

ఉపవాసం డైట్ ఫ్యాడ్ కాదు

ఉపవాసం రోజు శక్తి నిల్వలకు తగినట్టు మన దైనందిన జీవితాన్ని కొనసాగించాలి. ఉపవాసం చేసే సమయంలో కదలకుండా ఇంట్లో ఉంటే ఎనర్జీ లెవల్స్ సమంగా ఉండి, నీరసించిపోకుండా ఉంటాం. విశ్రాంత స్థితిలో ఎనర్జీ మెటబాలిజం నెమ్మదించి, శరీరం డిటాక్సిఫై అవుతుంది. అలా కాకుండా, ఉపవాసాన్ని ఒక డైట్ టెక్నిక్‌గా అనుసరిస్తూ, అన్ని పనులు చేసుకుంటూపోతే, ఆ ప్రభావం శరీరం మీద కచ్చితంగా పడుతుంది. మరీ ముఖ్యంగా ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరించేవాళ్లు ఇదే పొరపాటు చేస్తూ ఉంటారు. ఒకవేళ ఈ ఉపవాస ప్రక్రియతో ప్రతిఫలం పొందాలనుకుంటే, ఇదే ప్రక్రియను జీవితాంతం కొనసాగించగలిగేలా ఉండాలి. రెండు, మూడు నెలల పాటు ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ చేసేసి, బరువు తగ్గిన తర్వాత అన్నీ తినేద్దాం అనుకోవడం పొరపాటు. మన శరీరం ఒక లయతో పని చేస్తుంది. ఆ సర్కేడియం రిథమ్‌ను మనం జీవితాంతం మెయింటెయిన్ చేసుకోవాలి. నిద్ర లేవడం, తినడం, పడుకోవడం.. ఇలాంటి పనులన్నిటికీ మనం నియమిత వేళలను అనుసరించాలి. బదులుగా ఈ వేళలన్నీ మార్చేసి, నచ్చిన సమయానికి తింటానంటే శరీరం అందుకు సహకరించకపోవచ్చు. గ్యాస్ట్రిక్ సమస్యలే వేధించవచ్చు. కాబట్టి మన దైనందిన జీవితానికి తగిన దీర్ఘకాల ఉపవాస ప్రక్రియను అలవాటు చేసుకోవాలి. ఒకవేళ బరువు తగ్గడం లక్ష్యమైతే ఉపవాసానికి బదులుగా, తీసుకునే పదార్థ పరిమాణాలను, కొవ్వులు, పిండి పదార్థాలనూ తగ్గించుకోవాలి.

సరైన ఆహారాన్ని సరైన పద్ధతిలో తినకపోవడం మన దేశంలో పెద్ద పేగు కేన్సర్లు పెరగడానికి ఒక ప్రధాన కారణం. ఆహార వేళలు పాటించకపోవడం, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు, రసాయనాలు జోడించిన పదార్థాలు తినడం వల్ల కూడా కోలన్ కేన్సర్లు పెరుగుతున్నాయి. శరీరంలో పేరుకుపోయే టాక్సిన్లను తొలగించుకోకపోవడం వల్ల కాలేయం పనితీరు నెమ్మదించి కొలెస్ట్రాల్ కూడా పెరుగుతూ ఉంటుంది. ఇది చివరకు గుండె జబ్బులకు దారి తీయవచ్చు. కాబట్టి ఆహారశైలి క్రమం తప్పకుండా చూసుకోవాలి.

ఇవీ ఉపవాసాలే!

ఏమీ తినకుండా కడుపు ఖాళీగా ఉంచడం ఒక్కటే ఉపవాసం కాదు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండడం కూడా ఉపవాసమే! జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండడం, తీపి పదార్థాలను దరి చేరనివ్వకపోవడం.. ఇవి కూడా ఉపవాసాలే! వీటితో కూడా బరువు తగ్గవచ్చు. ఆరోగ్యాన్ని మెరుగు చేసుకోవచ్చు. వారంలో లేదా పక్షంలో ఒక రోజు వండిన పదార్థాలకు బదులుగా పండ్లు, పచ్చికూరగాయలను తినడం కూడా ఒక రకమైన ఉపవాసమే! ఇలా ఫ్రూట్ ఫాస్టింగ్ ఉండాలనుకున్నప్పుడు మూడు పూటలా సలాడ్ లేదా పళ్లు తీసుకోవచ్చు. మజ్జిగ, పళ్ల రసం, లేదా నిమ్మరసం తాగవచ్చు.



ఉపవాస విరమణ ఇలా

ఉపవాసాన్ని భారీ భోజనానికి బదులుగా ద్రవాలతో విరమించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ లేదా నిమ్మరసాలు తీసుకోవచ్చు. తీపి పదార్థాలు, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలతో ఉపవాసాన్ని విరమించకూడదు. విశ్రాంత స్థితిలో ఉన్న శరీరం సాధారణ స్థితికి రావడం కోసం శరీరానికి మొదట ద్రవ పదార్థాలు, తర్వాత పండ్లు తిని, ఆ తర్వాతే భోజనం తినాలి.

ఎనిమిది గంటల విరామం

తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమైన తర్వాతే రెండోసారి ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరం. ఇందుకు మీల్‌కూ మీల్‌కూ మధ్య 8 నుంచి 12 గంటల విరామం సరిపోతుంది. దీన్ని కూడా ఉపవాసంగా పరిగణించవచ్చు. ఇన్ని గంటల విరామం పాటించగలిగితే, మునుపు తిన్న ఆహారమంతా పూర్తిగా జీర్ణమై, మరుసటి భోజనానికి శరీరం సన్నద్ధమవుతుంది. ఇలాంటి పద్ధతిని పాటించగలిగితే, స్వతఃసిద్ధంగా కొవ్వును కరిగించుకునే శరీర స్వభావం మెరుగవుతుంది. అలాగే జీర్ణశక్తి కూడా పెరుగుతుంది. తగినంత పీచు తీసుకోకపోవడం మూలంగా పెద్ద పేగుల్లో ఇరుక్కుపోయిన విసర్జకాలు కూడా ఈ విరామ సమయంలో క్లియర్ అయిపోతాయి.

డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట, హైదరాబాద్.



హ్యాంగ్జయిటీ

మత్తుతో చిత్తే!

రాత్రి మద్యం మత్తులో తూగేటప్పుడు పర్యవసనాల గురించి ఎవరూ ఆలోచించరు. మరుసటి ఉదయం నిద్ర లేచిన తర్వాత, హ్యాంగోవర్‌తో పాటు, అర్థం లేని ఆందోళన, భయాలు వేధిస్తాయి. ఈ ఆందోళనే 'హ్యాంగ్జయిటీ'!



రాత్రి తాగిన మద్యం మత్తు తెల్లవారేసరికి పూర్తిగా దిగినా, దిగకపోయినా అపరాధభావన మాత్రం వేధించడం మొదలుపెడుతుంది. ఈ మానసిక స్థితికి కారణం వెనక భౌతిక వాస్తవాలున్నాయి. మద్యం తాగి, ఆ మత్తు నుంచి బయటపడే సమయంలో ప్రతి వ్యక్తి మెదడులో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. తక్కువ పరిమాణాల్లో మద్యం తీసుకున్న వాళ్లలో అయోమయం లాంటి లక్షణాలు కనిపిస్తే, ఎక్కువ మోతాదుల్లో తాగేసే వాళ్లలో మరుసటి ఉదయం ఆందోళన, భయం, మానసిక గందరగోళం లాంటి లక్షణాలు మొదలవుతాయి. బిడియాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసే మద్యం మరుసటి ఉదయానికి చిత్రమైన మానసిక అసంతులనానికి లోను చేస్తుంది. మెదడులోని న్యూరో ట్రాన్స్‌మీటర్లలో ఏర్పడే మార్పులే ఇందుకు ప్రధాన కారణం. ప్రధానంగా నిద్ర, ఒత్తిడులకు సంబంధించిన గామా అమీనోబ్యుటైరిక్ యాసిడ్ కేంద్ర నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచుతుంది. మద్యంతో ఈ ట్రాన్స్‌మీటర్ మోతాదు తగ్గుతుంది. దీనికి తోడు మెదడులోని మరొక ట్రాన్స్‌మీటర్ గ్లూటామేట్ మీద కూడా మద్యం ప్రభావం పడుతుంది. ఈ గ్లూటామేట్ తగ్గడంతో, మెదడు మీద మద్యం ప్రభావం మరింత పెరిగి, ఆందోళనను ప్రేరేపించే రసాయనం ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా మద్యం తాగిన మరుసటి ఉదయం ఆందోళన, భయం మొదలవుతాయి. అరుదుగా తాగేవాళ్లలో హ్యాంగ్జయిటీ సమస్య ఒక్క రోజులోనే అదుపులోకి వచ్చేస్తుంది. కానీ క్రమం తప్పకుండా మద్యం తాగేవాళ్లలో ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల మధ్య సంతులనం దెబ్బతిని, హ్యాంగ్జయిటీ నుంచి కోలుకునే వేగం తగ్గుతుంది. ఏ లక్షణాలను కప్పి పుచ్చడం కోసం మద్యం తాగారో, మరుసటి రోజు అవే లక్షణాలు రెట్టింపు తీవ్రతతో విరుచుకుపడతాయి. హ్యాంగోవర్ నుంచి ఉపశమనం పొందడం కోసం కొందరు మరుసటి ఉదయం స్వల్పంగా మద్యం తీసుకునే పాతకాలపు చిట్కాను అనుసరిస్తూ ఉంటారు. ఈ రిలీఫ్ డ్రింకింగ్ వల్ల మరింత వ్యసనానికి దారి తీసే ప్రమాదం ఉంది.

వెయిట్ లాస్

బరువు తగ్గించే సూత్రాలు

అధిక బరువును తగ్గించుకోవడం కోసం తెలిసిన దార్లన్నీ అనుసరిస్తూ ఉంటాం. కానీ కొన్ని తేలికపాటి చిట్కాలతో బరువును తగ్గించుకోవచ్చని ప్రముఖ సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అంటోంది. ఆ చిట్కాలేంటంటే...

ఆహారం: లోకల్, సీజనల్, ట్రెడిషనల్... తినే ఆహారం పరంగా ఈ మూడు నియమాలు పాటించాలి. తాజా ఫుడ్ ట్రెండ్‌ను గుడ్డిగా అనుసరించకుండా, స్థానికంగా పండిన ఉత్పత్తులు, కాలనుగుణమైన, సంప్రదాయ పదార్థాలనే తినాలి.

ప్రాసెస్డ్ ఫుడ్: ప్యాకేజ్డ్ ఫుడ్‌ను పూర్తిగా మానేయాలి. ఒకవేళ తినాలనిపిస్తే, వీలైనంత పరిమితంగా తీసుకోవాలి.

మైండ్‌ఫుల్‌గా: భోజనం చేసే సమయంలో మనసు, ఆలోచనలు భోజనం మీదే కేంద్రీకరించాలి. టివి, మొబైల్ ఫోన్ చూస్తూ తినకూడదు. ఇంద్రియాలన్నింటినీ నియంత్రణలో ఉంచుకుని, రోజూ భోజనానికి ఒకే చోట కూర్చుంటూ, ఆహారంలోని రుచులను, కమ్మదనాన్నీ ఆస్వాదించాలి.

వ్యాయామం: వారంలో వ్యాయామం 150 నిమిషాలకు తగ్గకూడదు. ఎముకలు, కండరాలు ఆరోగ్యంగా ఉండడం కోసం వ్యాయామం చేయడం అవసరం. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలపాటైనా వ్యాయామం చేయాలి. అలాగే ఎక్కువ గంటలు కూర్చుని పని చేసేవాళ్లు ప్రతి 30 నిమిషాలకూ లేచి కనీసం మూడు నిమిషాలపాటైనా లేచి నిలబడుతూ ఉండాలి.



యూరాలజీ

అటు రోగికీ, ఇటు వైద్యులకూ సౌలభ్యంగా ఉండే రొబొటిక్ చికిత్సలతో కచ్చితత్వంతో కూడిన సర్జరీలు సాధ్యపడుతున్నాయి. మూత్ర వ్యవస్థ సంబంధ సమస్యల పరంగా కూడా రొబొటిక్ చికిత్సలు సత్ఫలితాలను అందిస్తున్నాయి.

సమర్థమైన రొబొటిక్ సర్జరీలు

కొన్ని అంతర్గత అవయవాలు క్లిష్టమైన ప్రదేశాల్లో ఉంటాయి. వాటిలో మూత్రాశయం దిగువన ఉండే ప్రోస్టేట్ గ్రంథి ఒకటి. వీటిలో ఏర్పడే కేన్సర్ గడ్డలను తొలగించాలంటే, గురి తప్పకుండా నేరుగా ఆ ప్రదేశానికి చేరుకోగలిగిన సాంకేతికత అవసరమవుతుంది. కేన్సర్ సోకిన ప్రోస్టేట్‌ను తొలగించి, మూత్రాశయాన్నీ, యురెత్రాల్లోని సమస్యలను చక్కదిద్దడం కోసం కటి ప్రదేశంలో ఏర్పరిచిన ఒకటి నుంచి ఒకటిన్నర



అంగుళాల రంధ్రం గుండా సర్జరీ చేయవలసి ఉంటుంది. ల్యాప్రోస్కోపీ, లేదా ఓపెన్ సర్జరీల పరంగా ఇదెంతో క్లిష్టమైన చికిత్స. కానీ రొబొటిక్‌పరంగా ఈ చికిత్స చేయడం ఎంతో సులువు. రొబొటిక్స్‌లో వైద్యులు కన్సోల్‌ను సులువుగా ఆపరేట్ చేయగలగడంతో పాటు, సర్జరీ చేసే సమయంలో మణికట్టును వీలైనంత మేరకు కదిలించే వెసులుబాటు ఉంటుంది. ఫలితంగా అంతర్గతంగా కుట్లను కచ్చితత్వంతో వేయగలుగుతారు. దీనివల్ల మూత్రం లీక్ అయ్యే అవకాశాలు బాగా తగ్గుతాయి.

రోగులకు ప్రయోజనకరం

రొబొటిక్ సర్జరీ చేయించుకున్న రోగుల్లో మూత్రం లీక్స్ పెద్దగా ఉండకపు. పైగా సర్జరీ తర్వాత తేలికగా లేచి నడవగలుగుతారు. ల్యాప్రోస్కోపీలో ఇలాంటి ప్రయోజనాలు ఉండవు. ల్యాప్రోస్కోపీ సర్జరీ నాలుగు రెట్ల మాగ్నిఫికేషన్ కలిగి ఉంటే, రొబొటిక్స్‌లో అంతర్గత అవయవాలను పదింతలు పెద్దగా చూడగలిగే సౌలభ్యం ఉంటుంది. దాంతో సర్జరీలో పొరపాట్లకు ఆస్కారం ఉండదు. పైగా ఇది త్రీడి వ్యూయర్ కావడంతో, వైద్యులు సులువుగా సర్జరీ చేయగలుగుతారు. ప్రోస్టేట్ కేన్సర్‌తో పాటు, బ్లాడర్ కేన్సర్‌లకు కూడా ఈ సర్జరీ తోడ్పడుతుంది. కటి ప్రదేశంలో ఎంతో లోతులో ఉండే కేన్సర్ సోకిన మూత్రాశయాన్ని తొలగించడంలో రొబొటిక్స్ ఎంతో మెరుగ్గా సహాయపడతాయి. మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి దారి తీసే నాళాలు కొన్నిసార్లు పూడుకుపోతూ ఉంటాయి. కొందర్లో ఈ సమస్య పుట్టుకతోనే సంక్రమించవచ్చు. ఈ సమస్యలను సరిదిద్దడం కోసం చేసే పైలోప్లాస్టీ చికిత్సలో రొబొటిక్స్‌తో కుట్లను కచ్చితంగా వేయగలుగుతారు. ఈ చికిత్సలో సమస్య ఉన్న నాళాన్ని కత్తిరించి, తొలగించి, తిరిగి జోడించవలసి ఉంటుంది. జోడించే సమయంలో వేసే కుట్లు సక్రమంగా లేకపోతే మూత్రం లీక్ అయ్యే ప్రమాదం ఉంటుంది. సర్జరీ విఫలమై సమస్య తిరగబెట్టే అవకాశాలు ఉండవు. కాబట్టి ఇలాంటి సమస్యల్లో రొబొటిక్స్ ఎంతో సహాయపడతాయి.

మూత్రపిండాలు దెబ్బతినకుండా...

అల్ట్రాసౌండ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ట్యూమర్లు ప్రారంభ దశల్లోనే బయటపడుతున్నాయి. ఇంతకు పూర్వం 10 నుంచి 15 సెంటీమీటర్ల మేరకు గడ్డలు పెరిగేవరకూ తెలిసేది కాదు. కానీ ఇప్పుడు రెండు నుంచి మూడు సెంటీమీటర్ల ట్యూమర్లు కూడా స్కాన్‌లలో బయల్పడుతున్నాయి. ఇలాంటి చిన్న ట్యూమర్లను కనిపెట్టడం వల్ల కిడ్నీని తొలగించవలసిన అవసరం లేకుండా, కేవలం ట్యూమర్‌ను మాత్రమే తొలగించి కుట్లు వేయగలుగుతున్నారు. ఇలాంటి చిన్నపాటి ట్యూమర్లను తొలగించడంలో కూడా రొబొటిక్స్ ప్రయోజనకరంగా మారాయి. సాధారణంగా మూత్రపిండాల్లోని ట్యూమర్లను తొలగించే సమయంలో, కిడ్నీకి రక్త సరఫరా జరగకుండా క్లాంప్ వేస్తారు. ఈ సందర్భంలో సర్జరీని వీలైనంత త్వరగా ముగించవలసి ఉంటుంది. సర్జరీ ఎంత త్వరగా ముగిస్తే, మూత్రపిండాలు కూడా అంతే త్వరగా కోలుకుంటాయి. కాబట్టి ఇలాంటి పార్షియల్ నెఫ్రెక్టమీ సర్జరీల్లో రొబొటిక్స్ అక్కరకొస్తున్నాయి.

భవిష్యత్తు టెలి రొబొటిక్స్‌దే!

ప్రస్తుతం టెలి రొబొటిక్స్ ప్రయగాత్మక స్థాయిలో ఉన్నాయి. భవిష్యత్తులో ఇవి అందుబాటులోకొస్తే, వైద్యులు ఆన్‌లైన్‌లో ప్రపంచంలోని ఏ ప్రాంతంలో ఉన్న రోగికైనా సర్జరీ చేయగలుగుతారు. అలాగే భవిష్యత్తులో రొబొటిక్ యంత్రాల పరిమాణం కూడా తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వాటిని ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తీసుకువెళ్లగలిగే సౌలభ్యం లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఈ సౌలభ్యం కూడా అందుబాటులోకి రావచ్చు. అలాగే భవిష్యత్తులో సర్జరీ సమయంలో వైద్యులను గైడ్ చేసేలా కృత్రిమ మేథస్సును కూడా రొబొటిక్స్‌కు జోడించే అవకాశాలున్నాయి. ఇలాంటి సౌలభ్యం వల్ల సర్జరీల్లో పొరపాట్లకు ఆస్కారమే లేకుండా పోతుంది.

డాక్టర్ ఎ.వి. రవి కుమార్
యూరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్
హైటెక్ సిటీ, హైదరాబాద్.





అవును... మేం విడిపోయాం!

శీతల్

'పెళ్లి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటుడు పృథ్వీరాజ్ ఆ తర్వాత కొన్ని సినిమాల్లో, సీరియల్స్‌లో నటించారు. మంచి నటుడిగా గుర్తింపు పొందిన పృథ్వీ వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే ఆయన తన మొదటి భార్య బీనాకు 2022లో విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత వెంటనే శీతల్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. పృథ్వీ కంటే వయసులో శీతల్ చాలా చిన్నది కావడంతో సోషల్ మీడియాలో అది వైరల్ అయింది. ఆ ప్రచారాన్ని నిజం చేస్తూ ఈ జంట కలసి దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేసింది. . వయసు రీత్యా తామిద్దరి మధ్య ఎంతో తేడా ఉన్నా, దీనికి అతీతమైన ప్రేమబంధం ఇద్దరిదీ అని వివరణ ఇచ్చారు పృథ్వీ, శీతల్. అయితే ఇంతలో ఏమైందో తెలియదు కానీ వారిద్దరూ విడిపోతున్నట్లు రూమర్స్ జోరుగా వినిపిస్తున్నాయి. శీతల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పృథ్వీరాజ్ ప్రపోజ్ చేసిన వీడియోను తొలిగించడం కూడా ఈ వదంతులకు బలాన్ని ఇచ్చాయి. తాజాగా తమ ప్రేమ వ్యవహారం గురించి శీతల్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో క్లారిటీ ఇచ్చారు. "ఈ మధ్య చాలా మంది నా జీవితంలో ఏం జరుగుతోందని ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. నా పరిస్థితిని ఏ మాత్రం అర్థం చేసుకోకుండా ఏవేవో ఊహాగానాలు ప్రచారం చేస్తున్నారు. అందరికీ చెప్పేదేంటంటే.. నేను, పృథ్వీరాజ్ పెళ్లి చేసుకోలేదు. కొన్నాళ్లు సహజీవనం చేశామంతే! మేము కలలు కన్న విధంగా మా బంధం ముందుకు సాగలేకపోయింది. అయితే, ఈ చిన్నపాటి బాంధవ్యంలో మేము ఎన్నో మధుర స్మృతులు పంచుకున్నాం. ఎన్నో సంతోష క్షణాలు కలసి అనుభవించాం. కొన్నివిషయాల్లో మా ఇద్దరి మధ్య సఖ్యత కుదరకపోవడంతో కొద్ది నెలల క్రితమే విడిపోయాం. జరిగిందేదో జరిగిపోయింది. ఇక నుంచైనా మా నిర్ణయాన్ని గౌరవిస్తూ.. మా పరిస్థితిని అర్థం చేసుకుని, వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం కలిగించరని ఆశిస్తున్నాను" అని శీతల్ పేర్కొంది. అయితే, తన ఖాతాలో స్టోరీ పెట్టిన కొద్దిసేపటికే శీతల్ ఆ పోస్టును తొలగించడం గమనార్హం.

గోదావరి తీరంలో భీమునిపట్నం



కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న '1920 భీమునిపట్నం' చిత్రం షూటింగ్ ప్రస్తుతం గోదావరి తీరంలో జరుగుతోంది. అవార్డు చిత్రాల దర్శకుడు నరసింహ నంది దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాజమండ్రి, మునికొడవలి, పూడిపల్లి, దేవీ పట్నం, గండి పోచమ్మ గుడి ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'రామోజీ ఫిల్మ్ సిటీలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. ప్రస్తుతం గోదావరి తీరంలో షూటింగ్ జరుగుతోంది. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో సీతారామ్, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు అద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాగారు అందించే సంగీతం మా చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది.' అని చెప్పారు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమ సమయంలో జరిగిన కొన్ని సంఘటలను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు నరసింహ నంది చెప్పారు. ఇందులో హీరో ఉపేంద్ర బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ అధికారి పాత్రను, హీరోయిన్ అపర్ణాదేవి స్వాతంత్ర్య సమరయోధుడి పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, ఫొటోగ్రఫీ: ఎస్.మురళీమోహనరెడ్డి, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.

'ఓ మై లిల్లీ'



సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'ఓ మై లిల్లీ' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ "ఓ మై లిల్లీ పాట మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కావడంతో ఈ సినిమా మొదలైనప్పుడే ఎంతో బాధ్యత, ఒత్తిడి ఉందని అర్థమైంది. మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు చేసే సమయంలో ప్రేక్షకుల్లో సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. కానీ 'టిల్లు స్క్వేర్' పై ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు ఉన్నాయి. అందుకే చాలా జాగ్రత్తగా, మొదటి భాగాన్ని మించేలా సినిమాని రూపొందించాం. టిల్లు పాత్ర అలాగే ఉంటుంది. కానీ కథ మాత్రం వేరేలా ఉంటుంది" అని చెప్పారు. కథానాయిక అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ "ఈ చిత్ర విడుదల కోసం మేము ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం" అని అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "మొదటి భాగంలాగే, 'టిల్లు స్క్వేర్' కూడా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుంది" అని అన్నారు.

రామ్‌చరణ్ పుట్టిన రోజున మగధీర



దర్శక దిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన తొలి చిత్రం 'మగధీర'. గీతా ఆర్ట్స్ బేనరుపై అల్లు అరవింద్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించి, వసూళ్ల పరంగా కొత్త రికార్డులు సృష్టించింది. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 26న 'మగధీర' చిత్రం మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. యర్రంశెట్టి రామారావు. అరిగెల కిశోర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ 'తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. 'మగధీర' ను రీ రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత అల్లు అరవింద్‌గారికి కృతజ్ఞతలు. ఈ సినిమాను మరో సారి హిట్ చేసి హీరో రామ్‌చరణ్‌కు బర్త్ డే గిఫ్ట్ ప్రేక్షకులు ఇవ్వాలని కోరుకుంటున్నాం' అన్నారు.

కొండా విజయ్‌కుమార్ 'అహం'



నితిన్ హీరోగా 'గుండెజారి గల్లంతయ్యిందే', నాగచైతన్య హీరోగా 'ఒక లైలా కోసం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు రూపొందించిన దర్శకుడు కొండా విజయ్ కుమార్ ప్రస్తుతం మరో భారీ చిత్రాన్ని రూపొందించే సన్నాహాల్లో ఉన్నారు. ఈ సినిమాకు 'అహం' అనే టైటిల్ నిర్ణయించారు. ఓ ప్రముఖ నిర్మాత తనయుడిని ఈ సినిమాతో హీరోగా పరిచయం చేయనున్నారని సమాచారం. అలాగే నటుడు శివాజీ ఇందులో విలన్‌గా నటిస్తారనీ, ఆయన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉండేట్లు దర్శకుడు విజయ్‌కుమార్ కేర్ తీసుకుంటున్నారనీ చెబుతున్నారు. ఈ సినిమా కోసం అనూప్ రూబెన్స్‌ను సంగీత దర్శకుడిగా ఎన్నుకున్నారనీ, ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంతో జరుగుతున్నాయనీ సమాచారం. త్వరలోనే 'అహం' చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నదని అంటున్నారు.

చరణ్‌తో మాట్లాడా.. ఇప్పుడంతా క్లియర్



తరుణ్‌భాస్కర్



'కీడా కోలా' చిత్రంలో అనుమతి లేకుండా దివంగత గాయకుడు ఎస్పీ బాలు పాటను ఏఐ (కృత్రిమ మేధ)తో రీక్రియేట్ చేసినందుకు దర్శకుడు తరుణ్ భాస్కర్, చిత్ర యూనిట్‌పై బాలు తనయుడు, గాయకుడు ఎస్పీ చరణ్ లీగల్ నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ సినిమా ఈవెంట్‌లో ఈ వివాదంపై తరుణ్ భాస్కర్ స్పందించారు. "ఈ సమస్యంతా గాయకుడు ఎస్పీ చరణ్, నాకూ మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల వచ్చిందే. ఒక ఫిల్మ్‌మేకర్‌గా ఎప్పుడూ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించటానికే తాపత్రయపడుతుంటా. అందులో భాగంగానే లెజెండరీ కళాకారులను గౌరవించాలనే ఉద్దేశంతో 'కీడాకోలా'లో దివంగత గాయకుడు. ఎస్పీ బాలు పాటను ఏఐ సాయంతో రీ క్రియేట్ చేశాం. ఈ ప్రయత్నం ఎవరినో కించపరచటానికో, అగౌరవపరచటానికో చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త నటులతో చిన్న సినిమాలే చేస్తుంటాను. పేరుమోసిన బడా స్టార్స్‌తో సినిమాలు చేయాలని ప్రయత్నించట్లేదు, కోరుకోవట్లేదు. కొత్తగా ప్రయత్నించాం. ఏఐకు ఉన్న పరిమితులు తెలుసు. ప్రస్తుతం మన అందరి ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి. ఏ క్షణం ఏమవుతుందో ఎవ్వరికీ తెలియని పరిస్థితి. ఇలాంటి తరుణంలో మనం చేయగలిగిందల్లా.. అన్నిటినీ గౌరవించటం.. ప్రయోగాలు చేయడం మాత్రమే. అలాంటి ప్రయత్నమే 'కీడాకోలా'లో చేశాం. ఇది కమర్షియల్ అడ్వాంటేజ్ కోసం కాదు. ఒక్కోసారి కొత్తగా ప్రయత్నించేటప్పుడు పొరపాట్లు జరగటం సహజం. దాదాపు ఇలాంటి పరిస్థితుల్లోనే ఎస్పీ చరణ్‌తో కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. కానీ ఇప్పుడంతా క్లియర్. ఈ విషయంపై నేను ఆయనతో మాట్లాడా" అని వివరించారు.

మాట వినే హీరోలు దొరికారు

'పంపిణీదారుడిగా కంటే నిర్మాతగా జర్నీ బాగుంది. నచ్చిన కథతో ప్రయాణం చేసే వెసులుబాటు నిర్మాతకు ఉంటుంది' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. హాస్య మూవీస్ బేనర్‌పై పలు సినిమాలు నిర్మిస్తున్న ఆయన పుట్టినరోజు (మంగళవారం) సందర్భంగా సోమవారం మీడియాతో ముచ్చటించారు. కొత్త ప్రాజెక్టుల గురించి వివరించారు.



- 'స్వామిరారా' చిత్రంతో పంపిణీదారుడిగా ప్రయాణం ప్రారంభించి ఇప్పటికి దాదాపు 82 సినిమాలు విడుదల చేశా. 'ఒక్క క్షణం', 'నాంది' చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించా. అనిల్ సుంకరతో జర్నీ మొదలుపెట్టి 'ఊరిపేరు భైరవకోన', "సామజవర గమన' సినిమాలు తీశా. ప్రస్తుతం. సుబ్బు దర్శకత్వంలో 'బచ్చలమల్లి' సినిమా తీస్తున్నా. 90వ దశకంలో జరిగిన కథతో 'బచ్చల మల్లి' చిత్రం తీస్తున్నాం. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అన్నవరం, తుని పరిసర ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నాం. మే 10 నుంచి జరిగే సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తాం. 'అల్లరి' నరేశ్ చిత్రం యాభై శాతం పూర్తయింది. ఆ తర్వాత సందీప్ కిషన్, కిరణ్ అబ్బవరం చిత్రాలు ఉంటాయి. వీరు కాకుండా మరో హీరోతో సినిమా చేయబోతున్నా. వివరాలు త్వరలో చెబుతా.
- నేను చేసే హీరోలు నాకు పర్సనల్ ఫ్రెండ్స్. అన్నీ స్టడీ చేసి సినిమా ప్లాన్ చేస్తుంటా. నా అదృష్టం కొద్దీ నా మాట వినే హీరోలు దొరికారు. కథ, ప్రీ ప్రొడక్షన్, మేకింగ్.. అన్నింటిలో నా ప్రమేయం ఉంటుంది. పంపిణీదారుడిగా ఉన్న అనుభవం నాకు ఉపయోగపడుతోంది.
- హాస్య మూవీస్ బేనర్‌లో తీసే చిత్రాలకు కొత్త కథలు, మంచి కథాంశాలు ఎన్నుకుంటున్నాం. ఇప్పటివరకూ అలాంటివే తీశాం. దర్శకుడు త్రినాథ్‌తో తీసే సినిమా కూడా భిన్నమైన కథాంశంతో ఉంటుంది. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. అందుకే నా సినిమాలో యాక్షన్ పార్ట్ కథానుగుణంగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటా.అలాగే పాన్ ఇండియా హీరో, కథ లభిస్తే వచ్చే ఏడాది పాన్ ఇండియా సినిమా తీస్తా. అలాగే ఓ పెద్ద హీరోతో వచ్చే ఏడాది పెద్ద సినిమా తీస్తున్నా. అది ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

పొలిటికల్ బ్యాక్ డ్రాప్‌లో..



కన్నడ ఇండస్ట్రీలోని ప్రముఖ నటుల్లో ఒకరైన కోమల్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం యమధీర. మాజీ క్రికెటర్, కేరళ స్పీడ్‌స్టార్ శ్రీశాంత్ ఇందులో నెగెటివ్ రోల్ పోషించారు. శంకర్ ఆర్ దర్శకత్వం వహించారు. వేదాల శ్రీనివాస్ నిర్మించారు. నాగబాబు, ఆలీ, సత్యప్రకాశ్, మధుసూధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ " 'యమధీర' టైటిల్ చాలా క్యాచీగా ఉంది. కోమల్ కుమార్ పోలీస్ ఆఫీసర్‌పాత్రలో చాలా అద్భుతంగా నటించారు. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా అత్యున్నత టెక్నికల్ వాల్యూస్‌తో ఈ సినిమాని మన ముందుకు తీసుకొస్తున్నారు" అని అన్నారు. చిత్ర నిర్మాత వేదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఈ సినిమాని మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ : సి రవిచంద్రన్, కెమెరామెన్: రోష్ మోహన్ కార్తీక్, సంగీత దర్శకుడు:వరుణ్ ఉన్ని.

అందుకే లంబసింగి నిర్మించా

కల్యాణ్ కృష్ణ



భరత్‌రాజ్, దివి జంటగా నటించిన 'లంబసింగి' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. నవీన్‌గాంధీ దర్శకత్వంలో కల్యాణ్ కృష్ణ నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ నిర్వహించింది. కల్యాణ్ కృష్ణ మాట్లాడుతూ 'నాకు దర్శకుడిగా అవకాశం రావడానికి ఏడేళ్లు పట్టింది. ప్రతిభ ఉండీ అవకాశాలు రాని సహ దర్శకులు పడే వేదన నాకు తెలుసు. అందుకే అలాంటి వారిని ప్రోత్సహించాలని చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టాను. నవీన్‌గాంధీ కథను అద్భుతంగా తెరకెక్కించారు. చిత్రబృందం కష్టానికి ఈ రోజు తగిన ఫలితం లభించింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'లంబసింగి' సినిమా చూసిన ప్రేక్షకులు బరువైన హృదయంతో థియేటర్ బయటకు వస్తున్నారు. మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటాను' అని చెప్పారు. వీరబాబు పాత్ర ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది అని భరత్‌రాజ్ తెలిపారు.

మళ్లీ వస్తున్న ప్రభుదేవా 'ప్రేమికుడు'



ప్రభుదేవా నగ్మా హీరోహీరోయిన్లుగా 30 ఏళ్ల క్రితం వచ్చిన మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ 'ప్రేమికుడు' చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. . టాప్ డైరెక్టర్ శంకర్ రెండో ప్రాజెక్ట్‌గా ఇది 1994లో రిలీజై ఆ తరం యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని కే.టి కుంజుమోన్ నిర్మించారు. ఏ. ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించారు. గానగంధర్వుడు, స్వర్గీయ ఎస్. పీ. బాలసుబ్రమణ్యం, వడివేలు, రఘువరన్, గిరీష్ కర్నాడ్ కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఈ సినిమా రీ రిలీజ్ రైట్స్ కొన్న నిర్మాతలు రమణ, మురళీధర్ సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దర్శకుడు ముప్పలనేని శివ మాట్లాడుతూ "30 సంవత్సరాల క్రితం వచ్చిన ప్రేమికుడు సినిమా ఇప్పుడు రీ రిలీజ్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. అప్పట్లో ప్రభుదేవా డాన్సులు చూసి స్ప్రింగ్‌లు ఏమన్నా మింగారా అని అనుమానపడేవాళ్లం. అందరితోపాటు ఈ సినిమా కోసం నేనూ ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా రీ రిలీజ్‌లో కూడా సూపర్‌డూపర్ హిట్ అవుతుంది. ఇందులో గానగంధర్వుడు ఎస్. పి. బాలసుబ్రమణ్యం నటన అద్భుతంగా ఉంటుంది. ప్రభుదేవా నటన, డాన్సులు నగ్మా అందాలు ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ" అని చెప్పారు. రీ రిలీజ్ చేస్తున్న రమణ, మురళీధర్ మాట్లాడుతూ "30 ఏళ్ల క్రితం సెన్సేషన్ సృష్టించిన సినిమాను మేము రీ రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అతి త్వరలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి, ప్రభుదేవాను ముఖ్య అతిథిగా పిలవాలనుకుంటున్నాం" అని చెప్పారు.

వచ్చే ఏడాదీ ఐటీకి కష్టాలే



నియామకాలూ అంతంత మాత్రమే

లాభాలకు మాత్రం ఢోకా ఉండదు.. ఇక్రా రేటింగ్స్

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) కూడా దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి కలిసొచ్చేలా లేదు. ఈ కాలానికి భారత ఐటీ కంపెనీల ఆదాయ వృద్ధి రేటు 3 నుంచి 5 శాతం మించకపోవచ్చు. దేశీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఇక్రా రేటింగ్స్' సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఆదాయ వృద్ధి పెద్దగా లేకపోవడంతో ఐటీ కంపెనీలు పెద్దగా నియామకాల జోలికీ పోకపోవచ్చని ఆ నివేదిక పేర్కొంది.

తగ్గనున్న వలసలు

పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో ఒక కంపెనీ నుంచి మరొక కంపెనీకి మారే ఉద్యోగుల సంఖ్యా 12-13 శాతం మించకపోవచ్చని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి తొమ్మిది నెలల్లో ఐటీ కంపెనీల స్థూల ఆదాయాలు 9.2 శాతం పెరిగినా, నికర ఆదాయాల వృద్ధి రేటు 2 శాతం మించలేదు. పరిశ్రమ అంచనా వేసిన 3-5 శాతం కంటే ఇది తక్కువ.

లాభాలకు ఢోకా లేదు

ఆదాయాల వృద్ధి రేటు అంతంత మాత్రంగానే ఉన్నా 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఐటీ కంపెనీల లాభాలకు ఢోకా ఉండదని ఇక్రా రేటింగ్స్ తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం భారత ఐటీ కంపెనీల నిర్వహణ లాభాలు 21 నుంచి 22 శాతం ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇన్ని ఆటుపోట్లు ఉన్నా భారత ఐటీ కంపెనీల స్థిరత్వానికి ఢోకా లేదని పేర్కొంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కంపెనీల నుంచి ప్రాజెక్టుల ఆర్డర్లు తగ్గినా.. కీలకమైన టెక్నాలజీ నిర్వహణ ఆర్డర్లు ఇంకా వస్తూనే ఉన్నట్టు తెలిపింది.

అడ్డంకులున్నాయ్..

భారత ఐటీ కంపెనీలకు అమెరికా, కెనడా, యూరప్ దేశాలు ప్రధాన మార్కెట్లు. ప్రస్తుతం ఈ దేశాలన్నీ అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లతో సతమతమవుతున్నాయి. తప్పనిసరైతేనే వ్యాపార విస్తరణకు పోవడం లేదు. దీంతో ఆ కంపెనీలు ఐటీ ఖర్చులూ తగ్గించుకున్నాయి. ఆర్థిక పరిస్థితులు కుదుటపడితే తప్ప ఈ దేశాల నుంచి భారత ఐటీ కంపెనీలకు ఇదివరకటిలా ఆర్డర్లు పెద్దగా వచ్చే అవకాశం లేదు.

జీతాల పెంపు అంతంత మాత్రమే

పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో దేశీయ ఐటీ కంపెనీలు ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగా గత ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా జీతాల పెంపు 8.4 శాతం నుంచి 9 శాతం మించక పోవచ్చని భావిస్తున్నారు. మళ్లీ ఈ పెంపు ఉద్యోగులు అందరికీ ఉంటుందా? లేక కొందరికేనా? అనేది పెద్ద డౌట్. ఎందుకంటే గత ఏడాది ప్రముఖ ఐటీ కంపెనీలు జూనియర్లు, ఫ్రెషర్స్‌ను పక్కన పెట్టి సీనియర్లకు మాత్రమే జీతాలు పెంచాయి. ఈ సంవత్సరం కూడా ఐటీ కంపెనీలు అదే విధానం అనుసరిస్తాయని భావిస్తున్నారు.

మనవడికి నారాయణ మూర్తి నజరానా

రూ.240 కోట్ల విలువైన షేర్ల బహుమతి



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ నారాయణ మూర్తి తన నాలుగు నెలల మనవడికి పెద్ద బహుమతే ఇచ్చారు. రూ.240 కోట్ల విలువైన 15 లక్షల ఇన్ఫోసిస్ షేర్లను మనవడు ఏకగ్రాహ్ రోహన్ మూర్తికి బహుమతిగా ఇచ్చారు. ఇది ఇన్ఫోసిస్ ఈక్విటీలో 0.04 శాతానికి సమానం. ఆఫ్ మార్కెట్ లావాదేవీ ద్వారా నారాయణ మూర్తి ఈ షేర్లను తన మనవడికి బదిలీ చేశారు. ఈ బదిలీతో ఇన్ఫోసిస్ ఈక్విటీలో నారాయణ మూర్తి వాటా 0.36 శాతానికి పడిపోయింది. ఏకగ్రాహ్ రోహన్ మూర్తి.. నారాయణ మూర్తి కుమారుడు రోహన్ మూర్తి కుమారుడు.

స్వల్పంగా తగ్గిన చక్కెర ఉత్పత్తి: ఇస్మా

న్యూఢిల్లీ: గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి 15 నాటికి దేశంలో 280.79 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అయింది. గత ఏడాది ఇదే కాలంతో ఉత్పత్తి అయిన 282.60 లక్షల టన్నులతో పోలిస్తే ఇది 1.81 లక్షల టన్నులు మాత్రమే తక్కువని భారత చక్కెర మిల్లుల సంఘం (ఇస్మా) తెలిపింది. అయితే గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే చెరకు క్రషింగ్ ఆడుతున్న చక్కెర మిల్లుల సంఖ్య మాత్రం 325 నుంచి 371కి పెరిగింది. కర్ణాటక, మహారాష్ట్రల్లో చక్కెర ఉత్పత్తి స్వల్పంగా తగ్గినా.. ఆ లోటును ఉత్తరప్రదేశ్ భర్తీ చేస్తోంది.

టీసీఎస్‌లో టాటా సన్స్ వాటా విక్రయం!

రూ.9,200 కోట్ల విలువైన వాటా విక్రయించే చాన్స్!

ముంబై: టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్.. తన గ్రూప్ ప్రధాన కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో స్వల్ప వాటాను బ్లాక్ డీల్స్ ద్వారా బహిరంగ మార్కెట్లో విక్రయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టీసీఎస్‌లో 0.64 శాతం వాటాకు సమానమైన 2.3 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ రూ.4,001 చొప్పున విక్రయించవచ్చని సమాచారం. సోమవారం టీసీఎస్ షేరు బీఎస్ఈలో 1.72 శాతం నష్టపోయి రూ.4,144.75 వద్ద ముగిసింది. ఈ ముగింపు ధరతో పోలిస్తే, బ్లాక్ డీల్స్ ద్వారా షేర్లను 3.5 శాతం తక్కువకు విక్రయించనుంది. తద్వారా టాటా సన్స్‌కు రూ.9,202 కోట్లకు పైగా నిధులు సమకూరే అవకాశం ఉంది. గత ఏడాది డిసెంబరు చివరినాటికి టీసీఎస్‌లో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ కంపెనీలు 72.41 శాతం వాటా కలిగి ఉన్నాయి. అందులో 72.38 శాతం వాటా టాటా సన్స్ చేతుల్లో ఉంది. టాటా గ్రూప్‌లోని 29 లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్ అయిన టాటా సన్స్.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నిబంధనలకు లోబడేందుకు 2025 సెప్టెంబరు నాటికల్లా పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) రావచ్చన్న అంచనాలున్నాయి.

అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్లో షేర్లను నమోదు చేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దేశంలోని 15 అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల్లో టాటా సన్స్ ఒకటి.

ఒడుదుడుకుల్లోనూ లాభాలు

ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, చివరికి లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 104.99 పాయింట్లు పెరిగి 72,748.42 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో సూచీ 72,314 నుంచి 72,985 స్థాయిల మధ్య ఊగిసలాడింది. నిఫ్టీ 32.35 పాయింట్ల లాభంతో 22,055.70 వద్ద క్లోజైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మెటల్, ఆటో, కమోడిటీ రంగ షేర్లలో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించగా.. ఐటీ, టెక్ షేర్లలో అమ్మకాలు లాభాలను పరిమితం చేశాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఇంట్రాడే కనిష్ఠం నుంచి 1.5 శాతానికి పైగా రికవరీ అయింది. సెన్సెక్స్, నిఫ్టీ మొత్తం లాభాల్లో అధిక వాటా ఈ షేరుదే.

దేశీయ స్టార్టప్‌ల రంగంలోకి ఈ ఏడాది రూ.లక్ష కోట్ల నిధులు

పీక్స్ ఎక్స్‌వీ ఎండీ రాజన్ ఆనంద్

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశీయ స్టార్టప్‌లు 800-1,200 కోట్ల డాలర్ల (రూ.66,500-99,600 కోట్లు) వరకు నిధులు సమీకరించవచ్చని వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ పీక్ ఎక్స్‌వీ మేనేజింగ్ డైరెక్టర్ రాజన్ ఆనంద్ అన్నారు. ప్రపంచంలోకెల్లా భారత స్టార్టప్ రంగమే ప్రస్తుతం చురుకుగా ఉందని సోమవారం ప్రారంభమైన స్టార్టప్ మహాకుంభ్ సదస్సులో ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 2,000 కోట్ల డాలర్ల మేర ప్రైవేట్ మూలధనం పెట్టుబడికి అందుబాటులో ఉందని.. భారత ప్రైవేట్ రంగం, స్టార్టప్‌ల్లో పెట్టుబడి అవకాశాల కోసం చూస్తోందన్నారు. 2021కి ముందు భారత స్టార్టప్‌ల్లోకి వార్షిక పెట్టుబడులు 800-1,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండేవని.. 2021,2022 సంవత్సరాల్లో మొత్తం 6,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు ఈ రంగంలోకి వచ్చాయన్నారు. గత ఏడాదిలో ఫండింగ్ 700 కోట్ల డాలర్లకు పరిమితమైంది. దేశీయ స్టార్టప్ రంగ అభివృద్ధికి ఏటా 1,000 కోట్ల డాలర్ల ఫండింగ్ సరిపోతుందన్నారు. ప్రస్తుతం దేశంలో 20 స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్లో ట్రేడవుతున్నాయని, వచ్చే 7-8 ఏళ్లలో ఈ సంఖ్య 100కు చేరుకోవచ్చన్నారు.



స్వీయ నియంత్రణకు కట్టుబడి ఉండాలి: కాంత్

దేశీయ స్టార్టప్‌లు పారదర్శకత, నైతిక ప్రవర్తన కోసం స్వీయ నియంత్రణ వ్యవస్థకు కట్టుబడి ఉండాలని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ, జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. స్టార్టప్‌ల రంగంలో కంపెనీల విలువను పెంచుకునే ప్రయత్నాలు పాలన ప్రమాణాల అతిక్రమణకు దారితీస్తోందన్నారు. దేశంలో చురుకైన స్టార్టప్‌ల వ్యవస్థ ఏర్పాటుకు నియంత్రణ జోక్యం ఉండకూడదని, ప్రభుత్వ నియంత్రణ ఆవిష్కరణలను అణిచివేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థను ఏర్పాటు చేయగలిగిందని, వచ్చే ఐదేళ్లలో నం.1 స్థాయికి చేర్చడమే ప్రభుత్వం ముందున్న సవాలు అని కాంత్ పేర్కొన్నారు.

త్వరలో డీప్ టెక్ స్టార్టప్ పాలసీ

డీప్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాలసీపై అంతర మంత్రిత్వ శాఖ చర్చలు తుది దశకు చేరుకున్నాయని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య డిపార్ట్‌మెంట్ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. త్వరలోనే ఈ పాలసీని అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఏడాదిలో జొమాటోను మించిపోనున్న బ్లింకిట్

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ (గతంలో గ్రోఫర్స్) సైజు జొమాటో ఫుడ్ డెలివరీ బిజినెస్‌ను మించిపోనుందని ఈ రెండు కంపెనీల సీఈఓ దీపిందర్ గోయల్ అన్నారు. 2022లో బ్లింకిట్‌ను జొమాటో 57 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. ప్రస్తుతం కంపెనీ మొత్తం ఆదాయంలో జొమాటో ఫుడ్ డెలివరీ వ్యాపార వాటా 56 శాతంగా ఉంది. కంపెనీ తదుపరి వృద్ధికి బ్లింకిట్ చోదకం కానుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. బ్లింకిట్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించి పూర్తి స్థాయి ఈ-కామర్స్ కంపెనీగా మార్చే దిశగా జొమాటో ఆలోచిస్తోంది.

బీమాలోకి తొమ్మిదేళ్లలో రూ.54,000 కోట్ల ఎఫ్‌డీఐ

న్యూఢిల్లీ: బీమా రంగంలోకి గత తొమ్మిది సంవత్సరాల కాలంలో రూ.54,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. విదేశీ నిధుల నిబంధనలు ప్రభుత్వం సరళీకరించడం ఇందుకు దోహదపడిందని ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి వివేక్ జోషి అన్నారు. బీమా రంగంలోకి ఎఫ్‌డీఐ పరిమితి 2014 సంవత్సరంలో 26 శాతం ఉండగా 2015లో 49 శాతానికి, 2021లో 74 శాతానికి పెంచినట్టు ఆయన చెప్పారు. అలాగే బీమా రంగానికి చెందిన ఇంటర్మీడియేటరీల్లో ఎఫ్‌డీఐ పరిమితి 2019లో నూరు శాతానికి పెంచినట్టు ఆయన తెలిపారు. ఈ సంస్కరణల ఫలితంగా 2014 డిసెంబరు నుంచి 2024 జనవరి నెలల మధ్య కాలంలో బీమా రంగంలోకి రూ.53,900 కోట్ల విలువ గల ఎఫ్‌డీఐలు వచ్చాయన్నారు. ఇదే కాలంలో దేశంలో బీమా కంపెనీల సంఖ్య 53 నుంచి 70కి పెరిగిందని చెప్పారు. 2013-14 నుంచి 2022-23 మధ్య కాలంలో బీమా వ్యాప్తి 3.9 శాతం నుంచి 4 శాతానికి, బీమా సాంద్రత (తలసరి ప్రీమియం) 52 డాలర్ల నుంచి 92 డాలర్లకు పెరిగిందన్నారు. అంతే కాదు బీమా కంపెనీల నిర్వహణ లోని ఆస్తుల విలువ 2013-14 నుంచి మూడింతలు పెరిగి రూ.21.07 లక్షల కోట్ల నుంచి రూ.60.04 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,870 ▼	60,380 ▼	80,000 ▼
ముంబై	65,612 ▲	60,100 ▲	74,156 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ		విజయవాడ	423
హైదరాబాద్	410	విశాఖపట్నం	430
19వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	478	డజను గుడ్లు రూ.72	
గోదావరి	423		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	గోదావరి	101
వరంగల్	99	విజయవాడ	101
కరీంనగర్	99	గుంటూరు	105
మహబూబ్‌నగర్	99	ఒంగోలు	105
కర్నూలు	99	చిత్తూరు	105
విశాఖపట్నం	98		

3 ఐపీఎల్ రోజుల్లో

పంజాబ్.. అయ్యేనా కింగ్?



కోల్'కథ' మారుతుందా!

గౌతమ్ గంభీర్ నాయకత్వంలో రెండుసార్లు విజేతగా నిలిచిన ఘనత కోల్‌కతా నైట్‌రైడర్స్‌ది. ఆ తర్వాత ఒక్కసారి మాత్రమే ఫైనల్‌కు రాగలిగిన ఆ జట్టు..తరచూ కెప్టెన్లను మారుస్తూ వస్తున్నా 'కథ' మాత్రం మారడంలేదు. దాంతో గంభీర్‌నే ఈ సీజన్‌లో జట్టు మెంటార్‌గా నియమించుకుంది ఫ్రాంచైజీ. మరి.. అతడి మార్గదర్శనంలో యువ క్రికెటర్ శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో రైడర్స్ టైటిల్ కొడుతుందేమో చూడాలి. మూడోసారి ఐపీఎల్ ట్రోఫీని పట్టేయాలని పట్టుదలగా ఉన్న కేకేఆర్ ఈసారి వేలంలో కళ్లు చెదిరే రీతిలో రూ. 24.75 కోట్లు వెచ్చించి ఆస్ట్రేలియా స్టార్ పేసర్ స్టార్క్‌ను కొనుక్కుంది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు: శ్రేయాస్ (కెప్టెన్), భరత్, పాండే, గుర్బాజ్, రమణ్‌దీప్, నితీశ్, రూథర్‌ఫోర్డ్, రఘువంశీ, సాల్ట్, రింకూ, వెంకటేశ్, నరైన్, అనుకూల్, రస్సెల్, వైభవ్, చమీర, హర్షిత్, ముజీబుర్, సకారియా, సుయాష్, హసరంగ.

బలాలు: రస్సెల్, రింకూ సింగ్‌ల పవర్ హిట్టింగ్‌కు ఫిల్ సాల్ట్ తోడవడం జట్టుకు అదనపు బలం. సాల్ట్, గుర్బాజ్, వెంకటేశ్ డాషింగ్ బ్యాటింగ్‌తో అదిరే ఆరంభం ఇవ్వగలరు. ఆపై శ్రేయాస్, నితీశ్ రాణా సత్తా చాటితే రైడర్స్‌కు తిరుగుండదు. నరైన్, వరుణ్ చక్రవర్తి, ముజీబుర్, సుయాష్‌తో కూడిన స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు సవాలే. నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బ్యాటర్లను బెంబేలెత్తించేందుకు స్టార్క్ ఎలాగూ ఉన్నాడు.

బలహీనతలు: డెత్ ఓవర్లలో స్టార్క్‌కు అండగా నిలిచే పేసర్ లేకపోవడం కోల్‌కతాకు దెబ్బ. దీంతో యువ పేసర్లు చేతన్ సకారియా, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా రాణించడం కీలకం. మ్యాచ్ విన్నర్ ఆండ్రీ రస్సెల్ ఫామ్ కూడా రైడర్స్‌కు ఆందోళన కలిగిస్తోంది.



పంజాబ్ కింగ్స్ జట్టు

గత ఏడాది ఐపీఎల్ ప్రారంభంలో చక్కటి విజయాలు సాధించిన పంజాబ్ కింగ్స్ టైటిల్ రేసులో ఉన్నానని చాటిచెప్పింది. కానీ టోర్నీ సాగిన కొద్దీ ఆ జట్టు ఆట తీరు గాడి తప్పింది. కెప్టెన్ ధవన్ గాయంతో అందుబాటులో లేకపోవడమూ పంజాబ్‌ను దెబ్బ తీసింది. ఇక.. 2014లో రన్నరప్‌గా నిలిచిన ఈ జట్టు అప్పటినుంచి తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ట్రోఫీని మాత్రం ముద్దాడలేకపోయింది. ఈమారు వేలంలో స్టార్ బౌలర్ హర్షల్ పటేల్‌తో పాటు దేశీ క్రికెటర్లను కొనుగోలు చేసి జోరుమీదున్న ధవన్ బృందం.. ఇకనైనా లీగ్ కింగ్‌గా అవతరిస్తుందేమో చూడాలి.

ఐపీఎల్ ఆరంభం నుంచి ఉన్న జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్ ఈసారి ఎలాగైనా టైటిల్ పట్టేయాలన్న లక్ష్యంతో సిద్ధమైంది. ఈ క్రమంలో స్టార్లతో పాటు దేశీ క్రికెటర్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసింది. పైగా..కొత్తగా నిర్మించిన మహారాజా యదవీంద్ర సింగ్ స్టేడియం తమకు అచ్చివస్తుందన్న నమ్మకంతో ఉంది.

బలాలు: పొట్టి క్రికెట్‌కు సరిగ్గా సరిపోయే బౌలర్లతో పంజాబ్ జట్టు కళకళలాడుతోంది. కోట్లు కుమ్మరించి దక్కించుకున్న ఇంగ్లండ్ యువ పేసర్ సామ్ కర్రాన్, క్రిస్ వోక్స్, అర్ష్‌దీప్ సింగ్, రబాడ, నాథన్ ఎలిస్, రాహుల్ చాహర్, సికిందర్ రజాలతో పటిష్ఠంగా ఉంది జట్టు బౌలింగ్ యూనిట్. మ్యాచ్ ఏ సమయంలోనైనా ప్రత్యర్థులకు కళ్లెం వేయగల బౌలర్లు వారు. కెప్టెన్ ధవన్, బెయిర్ స్టో, హార్డ్ హిట్టర్ లివింగ్‌స్టోన్ సత్తా మేరకు బ్యాటింగ్ చేస్తే పంజాబ్ 'కింగ్' అయ్యే అవకాశాలు లేకపోలేదు.

బలహీనతలు: ఎక్కువగా విదేశీ స్టార్లే ఉండడం పంజాబ్‌కు ప్రతికూలం కానుంది. ప్రముఖులైన భారత క్రికెటర్లు లేకపోవడం జట్టు సమతూకాన్ని దెబ్బ తీయనుంది. తుది జట్టులో నలుగురే విదేశీ క్రికెటర్లకు చాన్సు ఉండడంతో బ్యాటింగ్ బలహీనం కానుంది.

పంజాబ్ కింగ్స్ జట్టు: ధవన్ (కెప్టెన్), జితేశ్ శర్మ, బెయిర్ స్టో, ప్రబ్‌సిమ్రన్, లివింగ్‌స్టోన్, హర్‌ప్రీత్ భాటియా, రీలీ రూసో, హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, వోక్స్, అర్ష్‌దీప్, సామ్ కర్రాన్, రబాడ, ఎలిస్, సికిందర్, శశాంక్, విశ్వనాథ్, అశుతోష్, తనయ్ త్యాగరాజన్, టైడే, రిషి ధవన్, శివమ్ సింగ్, ప్రిన్స్ చౌధురి, హర్‌ప్రీత్ బ్రార్, కావేరప్ప.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నిలకడ లోపం.. రాజస్థాన్‌కు శాపం!



షేన్ వార్న్ సారథ్యంలో ఆరంభ ఐపీఎల్‌లోనే చాంపియన్‌గా నిలిచి రాజస్థాన్ రాయల్స్ సంచలనం సృష్టించింది. ఇక, సంజూ శాంసన్ కెప్టెన్సీలో రెండు సంవత్సరాల కిందట టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా వహ్..వా..అనిపించింది. అయితే బట్లర్, శాంసన్, అశ్విన్, బౌల్ట్ వంటి అగ్రశ్రేణి క్రికెటర్లున్న ప్రస్తుత జట్టు.. నిరుడు ప్లేఆఫ్స్‌కు కూడా క్వాలిఫై కాకపోవడం జట్టు దిగజారిన ఫామ్‌కు అద్దంపట్టింది. దీంతో సుదీర్ఘ విరామం తర్వాత రెండోసారి విజేతగా నిలవాలని సంజూసేన ఉవ్విళ్లూరుతోంది.

బలాలు: బ్యాటింగ్ విభాగమే రాయల్స్ ప్రధాన ఆయుధం. జైస్వాల్, బట్లర్, శాంసన్, హెట్‌మయెర్, జురెల్, పొవెల్, పరాగ్‌లాంటి బ్యాటర్లు ఆ జట్టు సొంతం. వీరు చెలరేగితే ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యం నిర్దేశించడమైనా, టార్గెట్‌ను ఛేదించడమైనా రాజస్థాన్‌కు కష్టం కాబోదు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు అశ్విన్, చాహల్, జంపా, అత్యంత సీనియర్ బౌల్ట్, యువ పేసర్ అవేశ్ ఖాన్ విజృంభిస్తే ప్రత్యర్థులకు తిప్పలే.

బలహీనతలు: బ్యాటింగ్, బౌలింగ్‌లో బలీయంగా ఉన్నా..రెండు విభాగాల్లోనూ నిలకడలేమి జట్టును దెబ్బ తీస్తోంది. ఇది నిరుడు స్పష్టంగా కనిపించింది. పైగా..2022లో ఆ జట్టు అద్భుత విజయాల్లో ముఖ్యభూమిక పోషించిన పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయంతో వరుసగా రెండో ఏడాదీ టోర్నీకి దూరం కావడం రాయల్స్‌కు కోలుకోలేని దెబ్బ. ఏదేమైనా..నిలకడలేమిని అధిగమిస్తే 'రాయల్'గా నిలిచే చాన్సుంది.

రాజస్థాన్ రాయల్స్ జట్టు: సంజూ శాంసన్ (కెప్టెన్), బట్లర్, హెట్‌మయెర్, జైస్వాల్, జురెల్, పరాగ్, డొనొవాన్ ఫెరీరా, కునాల్, అశ్విన్, కుల్దీప్ సేన్, సైనీ, సందీప్ శర్మ, బౌల్ట్, చాహల్, జంపా, అవేశ్ ఖాన్, పొవెల్, శుభమ్ దూబే, కోహ్లర్, అబిద్, నండ్రే బర్గర్.

స్పోర్ట్స



రోహిత్ చేయి.. ఎల్లప్పుడూ నా భుజంపైనే!

ముంబై ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్

ముంబై: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన సారథుల్లో ఒకడిగా నిలిచిన రోహిత్‌ను పక్కనబెట్టి ఈసారి ముంబై ఇండియన్స్ జట్టు పగ్గాలను హార్దిక్ పాండ్యాకు అప్పగించిన విషయం తెలుసుగా! దీంతో మైదానంలో ఇరువురి సంబంధాలపై అభిమానుల్లో చర్చ సాగుతున్న నేపథ్యంలో.. జట్టు కెప్టెన్‌గా తొలిసారి ప్రెస్‌మీట్‌కు హాజరైన పాండ్యా ఇదే విషయమై స్పష్టతనిచ్చాడు. 'నా సారథ్యంలో ఆడేందుకు రోహిత్‌కు ఇబ్బంది ఉండదు. నేను కూడా చాలాకాలంగా అతని నాయకత్వంలో ఆడాను. ఇప్పటికీ రోహిత్ టీమిండియా కెప్టెనే. అతడి సహాయం, సూచనలతోనే జట్టును నడిపిస్తా. ఈ సీజన్ మొత్తం అతడి చేయి నా భుజంపై ఉంటుందని భావిస్తున్నా. కెప్టెన్సీ మార్పుపై అనేక మంది రకరకాలుగా స్పందించారు. వారి భావోద్వేగాలను గౌరవిస్తా. ఏదేమైనా రోహిత్ సాధించిన విజయాలను నేనూ కొనసాగిస్తా' అని హార్దిక్ అన్నాడు.

రెజ్లింగ్‌పై మళ్లీ బ్రిజ్‌భూషణ్ నీడ?

- అడ్‌హాక్ కమిటీని రద్దు చేసిన ఐఓఏ
- సంజయ్ సారథ్యంలోని సమాఖ్యకు పూర్తి అధికారం



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) పాలనాధికారం మళ్లీ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుయాయ వర్గం చేతుల్లోకి వెళ్లింది. భూపీందర్ సింగ్ బజ్వా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల రెజ్లింగ్ అడ్‌హాక్ కమిటీని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సోమవారం రద్దు చేసింది. డబ్ల్యూఎఫ్ఐపై విధించిన నిషేధాన్ని యునైటెడ్ రెజ్లింగ్ సమాఖ్య ఎత్తివేయడంతో.. తాత్కాలిక కమిటీ అవసరం ఇక లేదని ఐఓఏ తెలిపింది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ టోర్నీకి సంబంధించిన సెలెక్షన్ ట్రయల్స్‌ను అడ్‌హాక్ కమిటీ పూర్తి చేయడం కూడా ఈ నిర్ణయం తీసుకోవడానికి దోహదం చేసిందని పేర్కొంది. దీంతో డబ్ల్యూఎఫ్ఐపై ఇప్పటికే అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ అండ్ కోకు మళ్లీ పూర్తిస్థాయి అధికారం దక్కింది. స్పోర్ట్స్ కోడ్‌ను ఉల్లంఘించడంతో గత డిసెంబరులో రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడా శాఖ సస్పెన్షన్ విధించింది. ఆ స్థానంలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ఐఓఏకు సూచించింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ అప్పటి అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై స్టార్ రెజ్లర్లు వినేష్ ఫొగట్, సాక్షి మాలిక్, బజ్‌రంగ్ నేతృత్వంలో ఆందోళన చేయడం.. అనంతరం జరిగిన సమాఖ్య ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ అనుచరుడైన సంజయ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

బంగ్లాదే వన్డే సిరీస్

ఛట్టోగ్రామ్: శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో బంగ్లాదేశ్ దక్కించుకుంది. సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో బంగ్లా 4 వికెట్లతో నెగ్గింది. ముందుగా లంక 50 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. లియనగె (101 నాటౌట్) శతకం సాధించాడు. అనంతరం బంగ్లా 40.2 ఓవర్లలో 6 వికెట్లకు 237 పరుగులు చేసి నెగ్గింది.

ఆర్సీబీ శిబిరంలో కోహ్లీ



బెంగళూరు: విరాట్ కోహ్లీ రెండు నెలల విరామం తర్వాత ప్రాక్టీస్ ఆరంభించాడు. ఐపీఎల్ కోసం అతను సోమవారం బెంగళూరు (ఆర్సీబీ) జట్టు శిబిరంలో చేరాడు. 'ఐపీఎల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బెంగళూరులో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది' అని కోహ్లీ ఈ సందర్భంగా తెలిపాడు.

సింధు పుంజుకొనేనా?

నేటినుంచి స్విస్ ఓపెన్



బాసెల్ (స్విట్జర్లాండ్): గతవారం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లోనే వెనుదిరిగిన ఏస్ షట్లర్ పీవీ సింధు.. మళ్లీ పుంజుకోవాలనుకొంటోంది. మంగళవారం నుంచి జరిగే స్విస్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో యెవన్నీ లీ (జర్మనీ)తో సింధు తలపడనుంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాంశు, కిరణ్ జార్జ్.. డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా, ట్రీసా జాలీ-గాయత్రి, రితుపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలో ఉన్నాయి.

సర్ఫరాజ్, జురెల్‌లకు సెంట్రల్ కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో విశేషంగా రాణించిన సర్ఫరాజ్, కీపర్ ధ్రువ్ జురెల్‌లకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. సోమవారం జరిగిన బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో వీరికి వేతనం కింద ఏడాదికి రూ.కోటి దక్కనుంది. ఇక, డిసెంబరు, జనవరిలో ఉత్తరాదిన మంచు, వెలుతురు లేమి సమస్య ఉంటుంది కాబట్టి ఆ సమయాల్లో అక్కడ రంజీ మ్యాచ్‌లు నిర్వహించకూడదని బోర్డు యోచిస్తోంది.

జ్యోతికకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియా ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జ్యోతికశ్రీ కాంస్య పతకం సాధించింది. సోమవారం తిరువనంతపురంలో జరిగిన ఈ పోటీల్లో 400 మీటర్ల రేసును జ్యోతిక 52.73 సెకన్లలో పూర్తి చేసి, తృతీయ స్థానంలో నిలిచింది.

ఈ ఐపీఎల్‌లో కొత్త రాహుల్‌ను చూస్తాం



ఎమ్మెస్కే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఈ ఐపీఎల్‌లో కొత్త కేఎల్ రాహుల్‌ను చూస్తామని మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. సోమవారం స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ప్యానెల్ ఎక్స్‌పర్ట్స్ పరిచయ కార్యక్రమంలో ఎమ్మెస్కే మాట్లాడుతూ.. రాహుల్ పూర్తి సత్తాను బయటకు తీసేందుకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ ప్రయత్నిస్తున్నాడని, మూడు నెలలుగా వీరిద్దరు ఈ సీజన్ ఐపీఎల్ కోసం కసరత్తు చేస్తున్నారని చెప్పాడు. రాహుల్ గాయం నుంచి కోలుకున్నాక వన్డే వరల్డ్‌కప్‌లో బ్యాటింగ్, కీపింగ్‌లో అదరగొట్టాడని గుర్తు చేశాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా రాహుల్ పూర్తి సామర్థ్యం బయటపెడితే ఈ ఐపీఎల్‌లో లఖ్‌నవూ జట్టుకే కాకుండా భవిష్యత్‌లో టీమిండియాకు కూడా అది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.



దానం నాగేందర్‌పై అనర్హత వేటు విధించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

దానంపై అనర్హత విధించాలి..

» స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ బీ ఫాంతో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడం సరికాదని, ఆయనపై అనర్హత వేటు విధించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. ఈమేరకు సోమవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్పీకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం రాజ్యాంగాన్ని గౌరవిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోరాం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 3 నెలల్లో దానంపై అనర్హత వేటు పడటం ఖాయం. మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఎవరూ ఉండరని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు.. అదే మేం తెరిస్తే ఎలా ఉంటుందో కూడా చూపిస్తాం' అంటూ మండిపడ్డారు. అయితే ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలనే బీఆర్ఎస్ కోరుకుంటోందని, కాంగ్రెస్‌లో జరిగే అంతర్గత కలహాలకు తాము బాధ్యులం కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచే దానం శాసనసభా సభ్యత్వం రద్దయినట్లేనని వ్యాఖ్యానించారు. గతంలో లాగా అనర్హత పిటిషన్‌పై స్పీకర్ జాప్యం చేసే పరిస్థితి లేదని, సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు మేరకు తక్షణం స్పందించాల్సి ఉంటుందని చెప్పారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే రూపొందించారని.. రాజీవ్ మీద ఏమాత్రం గౌరవమున్నా కాంగ్రెస్ నేతలు ఈ ఫిరాయింపులు ప్రోత్సహించకూడదన్నారు. ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఎన్నికల అధికారులకు దొరికిన డబ్బులతో తనకు సంబంధం లేదని, అవి తమ బంధువులవని వెల్లడించారు.

తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

» సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు రాజీనామా లేఖ

» అధికార పార్టీ.. ప్రజాప్రతినిధుల వేధింపులే కారణమని వ్యాఖ్య



రాజీనామా చేసిన రజని

తిరుమలగిరి, మార్చి 18: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని తన పదవికి, వార్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. సోమవారం ఈ మేరకు ఐదు పేజీల లేఖను జిల్లా కలెక్టర్ వెంకటరావుకు పంపించారు. బుధవారం ఆమె అవిశ్వాసాన్ని ఎదుర్కోనున్న నేపథ్యంలో అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల బెదిరింపులు, ప్రతీకార చర్యల కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆమె కలెక్టర్‌కు సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. "మునిసిపాలిటీలో రోజువారీ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. కేవలం ఆ ప్రజాప్రతినిధిని(పరోక్షంగా ఎమ్మెల్యే సామేల్‌ను ఉద్దేశించి) కలవలేదనే కారణంతో కక్షసాధింపులకు పాల్పడుతూ.. అవిశ్వాసం పెట్టించారు. దళిత బిడ్డను హింసించడం సబబు కాదు. అవినీతిలో భాగస్వాములైన నేతలంతా మీ(అధికార పార్టీ నేతలు) పక్కనే తిరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారు" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి తిరుమలగిరి పురపాలకంలో మొత్తం 15 మంది కౌన్సిలర్లున్నారు. బీఆర్ఎస్ నుంచి చైర్మన్ పోతరాజు రజని, వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరూ అవినీతికి పాల్పడుతున్నారని, కౌన్సిల్ పరిపాలనలో తమకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ 10 మంది కౌన్సిలర్లు గత నెలలో సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఈ నెల 20న అవిశ్వాసానికి ఏర్పాట్లు జరిగాయి. కౌన్సిలర్లంతా క్యాంపులకు వెళ్లడంతో.. తన ఓటమి తప్పదని భావించిన రజని ముందుగానే రాజీనామా చేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ తీరు!

» ఫిరాయింపులు ప్రోత్సహించింది కేసీఆర్ కాదా?

» 39 మందిని చేర్చుకున్నారు: రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో పార్టీ ఫిరాయింపులను విచ్చలవిడిగా ప్రోత్సహించింది కేసీఆర్ కాదా..? అని నిలదీశారు. పదేళ్లలో ఇతర పార్టీల నుంచి మొత్తం 39 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుందన్నారు. 2014లో 23 మందిని, 2018లో 16 మంది విపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని వివరించారు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరిగి ప్రలోభపెట్టింది మరిచిపోయారా? ఆనాడు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న తలసానిని చేర్చుకొని రాజీనామా చేయించకుండా మంత్రివర్గంలోకి తీసుకోలేదా? కాంగ్రెస్‌లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మీ మంత్రివర్గంలోకి ఎందుకు తీసుకున్నారు. అప్పటి స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనర్హత పిటిషన్లపై ఏమైనా చర్యలు తీసుకున్నారా..?' అని ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు కీలక పదవుల్లోనూ మా జిల్లా వాడే ఉన్నాడని మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కావాల్సిన దానికంటే ఎక్కువ నీటిని వాడుకుంటోందని కృష్ణా బోర్డు పేర్కొనడాన్ని ఖండించారు.

షరతులతో.. సాగర్ మరమ్మతులకు కృష్ణాబోర్డు ఓకే

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ మరమ్మతులకు కృష్ణాబోర్డు ఓకే చెప్పింది. అయితే.. కొన్ని షరతులను విధించింది. దీంతో.. జలవిద్యుత్తు కేంద్రాలకు సంబంధించిన సాధారణ, అత్యవసర మరమ్మతులు, నిర్వహణ పనులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జెన్‌కోలకు అనుమతి లభించింది. కృష్ణాబోర్డు ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తూ.. ఇరు రాష్ట్రాల జెన్‌కోలకు ఈ నెల 13న లేఖలు రాసింది. కృష్ణాబోర్డు పేర్కొన్న షరతుల్లో పనుల కాలవ్యవధి కీలకమైనది. తాము ఇచ్చిన అనుమతులు జూన్ 15 వరకు కొనసాగుతాయని, ఆలోగా (మూణ్నెల్లలో) మరమ్మతులను పూర్తిచేయాలని కృష్ణాబోర్డు సూచించింది. నెలరోజుల్లో పెండింగ్ పనుల(సాధారణ, నిర్వహణ)ను పూర్తిచేసుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఈ కోవలో కుడిగట్టు కాల్వ పీజీటీ-1 పెండింగ్ పనులు ఉండగా.. వాటిని పూర్తి చేసేందుకు ఏప్రిల్ 15 వరకు నెల రోజుల గడువు ఇచ్చింది. పెన్‌స్టాక్ ఇన్‌టేక్ గేట్లు(పీఐజీ), అనుబంధ యంత్రాల నిర్వహణ పనులకు గాను ప్రతి బుధవారం అనుమతిస్తామని స్పష్టం చేసింది. అందుకోసం గరిష్ఠంగా నలుగురు ఇంజనీర్లు, ఆరుగురు సిబ్బంది, రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని వివరించింది. ఏ పనులకు ఎంతమంది వెళ్తారనేది ముందుగానే చెప్పాలని తెలిపింది. ఒకవేళ బుధవారం సెలవురోజు వస్తే.. ఆ తర్వాతి రోజు పనులు చేసుకోవచ్చని పేర్కొంది.

రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా ఇద్దరు జడ్జిలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. తెలంగాణ హైకోర్టుకు వీరిని బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఫిబ్రవరి 14న కేంద్రానికి సిఫార్సు చేసింది. వ్యక్తిగత కారణాలతో తనను బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ మౌషమి భట్టాచార్య సుప్రీంకోర్టు కొలీజియంకు లేఖ రాశారు. తన కుమారుడు మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నందున తనను వేరే హైకోర్టుకు బదిలీ చేయాలని అక్కడి హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ కూడా లేఖ రాశారు. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు కొలీజియం వారిని తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. ఒకటి రెండు రోజుల్లో ఈ ఇద్దరు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టులో మొత్తం జడ్జిల సాంక్షన్డ్ స్ట్రెంత్ 42 కాగా ప్రస్తుతం 26 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిద్దరి రాకతో ఈ సంఖ్య 28కి చేరనుంది.

'సంతోషం'గా ఎత్తేశారు!

కేసీఆర్ బంధువుల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగింపు

» ఎంపీ సంతోష్ భార్య రోహిణి, కవిత బంధువు శిరీష, ఎమ్మెల్సీ పోచంపల్లి భార్యకు చెందిన 16 ఎకరాలు క్లియర్

» రైతుల అంశంలో కోర్టు ఆదేశాలూ బేఖాతర్

» బొమ్మరాశిపేటలో అధికారుల స్వామి భక్తి

» ధరణి పేరిట అడ్డగోలు వ్యవహారాలు

» న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



కోదండరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బొమ్మరాశిపేట రైతులు (ఫైల్)

మేడ్చల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలోని పెద్దల బంధువులకు 'జీ హుజూర్' అన్నారు. సామాన్య రైతులు హైకోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నా బేఖాతర్ చేశారు! అధికారం అండతో గత సర్కారులోని పెద్దలు చేసిన నిర్వాకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటలో అప్పటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు కలిసి ఆడిన నాటకంలో సామాన్య రైతులు సమిధలయ్యారు. ఔటర్ రింగురోడ్డుకు సమీపంలోని బొమ్మరాశిపేటలో సర్వే నంబర్లు 320 నుంచి 409 వరకు దాదాపు వెయ్యి ఎకరాల భూములు ఉన్నాయి. 300 మంది రైతులు 40-50 ఏళ్ల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. వీరంతా ధరణి ద్వారా పాసుపుస్తకాలు కూడా పొందారు. రైతుబంధు, రైతుబీమా, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ తీసుకుంటున్నారు. అయితే ధరణిలోని లొసుగులను ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు రైతుల భూములపై కన్నేశారు. ఈ భూమికి హక్కుదారులమంటూ కోర్టులో కేసులు వేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అనంతరం రైతులు హైకోర్టు నుంచి అనుకూల తీర్పులు తెచ్చుకున్నా కూడా భూములను నిషేధిత జాబితా నుంచి అధికారులు తొలగించలేదు. ప్రతి రైతు వ్యక్తిగతంగా హైకోర్టుకు వెళ్లి నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. కానీ, కోర్టు ఆదేశాలు లేకపోయినా ప్రభుత్వంలోని పెద్దల భూములను మాత్రం నిషేధిత జాబితా నుంచి ఆగమేఘాలపై తొలగించేశారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత, కలెక్టర్ల బదిలీ జరిగిన మరుసటి రోజే ఇదంతా చేసినట్లు రికార్డుల్లో నమోదైంది. దీనికంటే ముందు ఇక్కడ మరో ఆరెకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబీకులు కొనుగోలు చేయడం విశేషం. అప్పుడు కూడా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా పని కానిచ్చేశారు!! పెద్దల పట్ల ఉదారంగా వ్యవహరించిన అధికారులు, సామాన్య రైతులు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నా ఖాతరు చేయకుండా.. ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?? అంటే.. దాని వెనక పెద్ద కుట్రే దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల భూములన్నింటినీ ఇలా నిషేధిత జాబితాలోనే పెట్టి వారిని అష్టదిగ్బంధం చేసి, తక్కువ ధరలకే కొల్లగొట్టే యత్నాలు చేశారు. ఇందులో అప్పటి ప్రభుత్వ పెద్దలతో పాటు పొరుగు జిల్లాకు చెందిన మంత్రి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే రైతులు ఆందోళనలు చేపట్టడంతో వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి కూడా దీనిపై స్పందించి రైతులకు న్యాయం చేయాలని అప్పటి ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఇదీ ఆ భూమి కథ..

1965లో డి.అమరేందర్‌బాబు మరో 20 మంది కలిసి 795 ఎకరాల భూమిని పట్టాదారుల నుంచి కొనుగోలు చేశారు. 1966లో ఈ భూమిని మాజీ ఎంపీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యకు జీపీఏ చేశారు. ఆయన నుంచి స్థానిక రైతులంతా 1970-80 మధ్యలో ఈ భూములను సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. అలాగే పక్కనే ఉన్న మరో 255 ఎకరాల ఇనాం భూమిని కూడా ఓఆర్సీల ద్వారా కొనుగోలు చేశారు. ఈ ప్రక్రియ అంతా 1980కి ముందే జరిగిపోయింది. అప్పటి నుంచి రైతులే ఈ భూములు సాగు చేసుకుంటున్నారు. 1982లో దుగ్గిరాల బలరామకృష్ణయ్య మృతి చెందారు. ఇక్కడ భూముల క్రయవిక్రయాలు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ఓఆర్ఆర్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించింది. తర్వాత ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన ధరణి ద్వారా పాస్‌బుక్‌లు కూడా జారీ చేశారు. రైతుబంధు కూడా ఇచ్చారు. అయితే నాలుగు దశాబ్దాల తర్వాత దుగ్గిరాల బలరామకృష్ణయ్య కుటుంబీకుల పేరుతో కొందరు తెరపైకి వచ్చారు. ఈ భూములు బాలరామకృష్ణయ్య ఎవరికీ విక్రయించలేదని, వారసులైన తమకు సాదాబైనామా ద్వారా హక్కులు కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చింది. తర్వాత 14.06.2022న ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. బాధిత రైతులు సంఘంగా ఏర్పడి న్యాయ పోరాటానికి దిగారు. హైకోర్టును ఆశ్రయించగా రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది. అయినా భూములను నిషేధిత జాబితాలోనే ఉంచారు. రైతులు పలుమార్లు దీనిపై ఆందోళనలు నిర్వహించారు. కానీ, అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఎ.కోదండరెడ్డి, సునీల్‌కుమార్ ఎదుట రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

తక్కువ ధరకే కొట్టేసే ప్లాన్!

వందల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో పెట్టడం వెనక అప్పటి ప్రభుత్వ పెద్దల హస్తం కూడా ఉన్నట్లు ప్రచారం సాగింది. 2022 నుంచి ఈ భూములు నిషేధిత జాబితాలో ఉండడంతో గ్రామంలో ఏ ఒక్క రైతు కూడా అవసరాల కోసం భూమిని అమ్ముకోలేకపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని తక్కువ ధరకే భూముల్ని కొట్టేసే యత్నం చేశారు. ఈ భూములపై కన్నేసిన పెద్దలు వాటిని నిషేధిత జాబితాలోనే కొనసాగించేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇలా భూములపై ఆంక్షలు కొనసాగుతున్న సమయంలో కొందరు పెద్దలు రంగ ప్రవేశం చేశారు. పొరుగు జిల్లాకు చెందిన అప్పటి మంత్రితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు బేరసారాలు సాగించారు. కానీ, రైతులంతా ఐక్యంగా ఉండడంతో వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

పెద్దలకు దాసోహం

ప్రభుత్వ పెద్దలకు అధికారులు దాసోహం అన్నారు. వారి భూములకు ఎలాంటి కోర్టు ఆదేశాలు లేకున్నా నిషేధిత జాబితా నుంచి తొలగించారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ భార్య జె.రోహిణి పేరు మీద ఉన్న సర్వే నంబరు 360/వీయాలో 5 ఎకరాలు (డాక్యుమెంటు నంబరు 6410/2018)తో పాటు ఎమ్మెల్సీ కవిత బంధువు వి.శిరీష సర్వే నంబరు 360/ఈఈ, 359/ఏఏ/ఏలో 3.35 ఎకరాలు (డాక్యుమెంట్ నంబరు 4561/2018) కొనుగోలు చేశారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి భార్య పి.మమత సర్వే నంబరు 339/ఏఏ2, 360/ఈలో 4.33 ఎకరాలు (డాక్యుమెంటు నంబరు 2157/2018), సర్వే నంబరు 361ఈ, 359/ఏఏ/ఏఏలో 3 ఎకరాలు డాక్యుమెంట్ నంబరు 5628/2018 ద్వారా కొనుగోలు చేసినట్లు ధరణిలో నమోదైంది. వీరంతా కలిసి ఎఫ్4ఎల్ ఫామ్ పేరుతో భూములు కొనుగోలు చేశారు. ఈ మొత్తం 16.28 ఎకరాల భూములను ఆగమేఘాలపై గత ఏడాది అక్టోబరు 12న నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఇది తెలుసుకున్న రైతులు అవాక్కయ్యారు. బడా బాబులకు ఓ న్యాయం.. తమకో న్యాయమా? అంటూ వాపోతున్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఎ.కోదండరెడ్డి, సునీల్ కుమార్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ప్రియాంకతో రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. ఈ భేటీకి తెలంగాణ నుంచి రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ కూడా హాజరు కానున్నారు. లోక్‌సభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల మూడో జాబితాను ప్రకటించేందుకుగాను సీఈసీ మంగళ, బుధవారాల్లో సమావేశం కానుంది. ఇప్పటికే రెండు విడతల్లో 82 పార్లమెంటు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, మిగతా స్థానాల్లో దేశవ్యాప్తంగా పొత్తుల్లో భాగంగా భాగస్వామ్య పక్షాలకు పోను మిగిలిన సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. మంగళవారం సాయంత్రం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పార్టీ చీఫ్ ఖర్గే ఆధ్వర్యంలో జరిగే సీఈసీ భేటీలో అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, అధిర్ రంజన్ చౌదరి, కేసీ వేణుగోపాల్, అంబికా సోనీ తదితరులు పాల్గొననున్నారు. ఈ భేటీలోనే తెలంగాణలోని స్థానాలకు అభ్యర్థులను కమిటీ ఖరారు చేయనుంది. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకుగాను ఇప్పటికే నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 13 స్థానాల్లో అత్యధిక సీట్లకు మంగళవారమే అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకటి రెండు రోజుల్లో మూడో జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. మంగళవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) భేటీ కానుంది. ఎన్నికల ముసాయిదా మేనిఫెస్టోపై ఈ భేటీలో చర్చించి ఆమోదించనున్నారు.

కడప బరిలో షర్మిల!

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయనున్నట్లు తెలిసింది. అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఆదివారం ముంబైలో ముగిసిన సందర్భంగా షర్మిల సహా వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఆ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానంలో బరిలోకి దిగాలని రాహుల్ సూచించగా.. ఇందుకు షర్మిల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. కడప లోక్‌సభ బరిలో వైసీపీ తరఫున సిటింగ్ ఎంపీ, వరుసకు తమ్ముడైన వైఎస్ అవినాశ్‌రెడ్డిని అభ్యర్థిగా సీఎం జగన్ ప్రకటించారు. ఆయన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాశ్ నిందితుడన్న సంగతి తెలిసిందే. అవినాశ్‌పై పోటీచేస్తే రాష్ట్రం యావత్తూ కడప వైపు చూస్తుందని షర్మిలతో రాహుల్ అన్నట్లు తెలిసింది. దీంతో ఆమె సమ్మతించారని పీసీసీ వర్గాలు అంటున్నారు. కుటుంబ సభ్యులతో చర్చించాక ఒకట్రెండు రోజుల్లో ఆమె నిర్ణయం ప్రకటిస్తారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. షర్మిల పోటీ చేయాలన్న అంశంపై సంప్రదింపులు జరుగుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

జెన్‌కోలో మరో వికెట్ డౌన్

» డైరెక్టర్ అజయ్ వీఆర్ఎస్‌కు ఆమోదం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జెన్‌కో నుంచి మరో అధికారి వైదొలిగారు. జెన్‌కో డైరెక్టర్(సివిల్) అజయ్ స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా.. ఆయన రాజీనామాను ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. రెండు నెలల కిందటే అజయ్ స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే ఇటీవలే సమీక్ష సందర్భంగా తన రాజీనామాను ఆమోదించాలని ఆయన కోరగా.. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ రిజ్వీ అంగీకరించినట్లు సమాచారం. ఇప్పటికే ఒక డైరెక్టర్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. కాగా, యాదాద్రితో పాటు భద్రాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణంలో అజయ్‌దే కీలక పాత్ర. ప్రస్తుతం వీటి నిర్మాణంపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిన విషయం విదితమే.

మంత్రుల మధ్య 'నామినేటెడ్' చిచ్చు!

» కార్పొరేషన్ చైర్మన్ల నియామకంపై పొన్నం అసంతృప్తి!

» శ్రీధర్‌బాబు మాటే చెల్లుబాటైందని కినుక

» తన వర్గం నేతలకు పదవులు దక్కలేదని ఆగ్రహం



కరీంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన నామినేటెడ్ పదవుల పంపిణీ.. మంత్రుల మధ్య చిచ్చు రాజేసింది. వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ సర్కారు తీసుకున్న నిర్ణయం ఆధిపత్య పోరుకు తెరలేపింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నేతలకు పదవులు కట్టబెట్టే విషయంలో తనను సంప్రదించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన మరో మంత్రి శ్రీధర్‌బాబు సన్నిహితులకే పదవులు దక్కాయని, ఆయన మాటే చెల్లుబాటు అయిందని పొన్నం కినుక వహించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నియామకంపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. తన సొంత జిల్లా కావడంతోపాటు.. తాను కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా తనను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వద్ద, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వద్ద ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతేకాదు.. తనకు నామినేటెడ్ పదవి దక్కిన విషయం తెలుసుకున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి.. మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయన ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించేందుకు ప్రయత్నించగా స్వీకరించేందుకు ప్రభాకర్ నిరాకరించినట్లు సమాచారం. పొన్నం అనుచరులు పలువురు ఆయనను కలిసి అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన ఇలా స్పందించినట్లు తెలిసింది. వీరిలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి పరాజయం పాలైన పురమల్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి రేగులపాటి రమ్యారావు ఉన్నట్లు సమాచారం.

శ్రీధర్‌బాబుకు సన్నిహితులైనందునే పదవులు!

పొన్నంతో చర్చించిన అనంతరం పురమల్ల శ్రీనివాస్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయానికి, ఆయన సలహాదారు ఇంటికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్దకు వెళ్లి కలిసినట్లు తెలిసింది. సుడా చైర్మన్ పదవి పొందిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రయత్నించారని, అలాంటి వ్యక్తికి నామినేటెడ్ పదవి ఎలా ఇస్తారని శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. నరేందర్‌రెడ్డి, నేరెళ్ల శారదతోపాటు నామినేటెడ్ పదవులు దక్కిన మంథని నియోజకవర్గానికి చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డి, కార్మిక నాయకుడు జనక్‌ప్రసాద్‌కు కూడా నామినేటెడ్ పదవులు దక్కాయి. అయితే వీరందరూ మంత్రి శ్రీధర్‌బాబుకు సన్నిహితులు కావడంతోనే పదవులు కట్టబెట్టారని, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంప్రదించలేదని పార్టీ వర్గాలు చర్చించుకోవడం వల్లే ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. పైగా, పదవులు విషయంలో శ్రీధర్‌బాబు పైచేయి సాధించడం పొన్నం ప్రభాకర్‌కు రాజకీయంగా మింగుడు పడడం లేదని, దీంతో ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరుకు తెరలేపినట్లయిందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

బీఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జగదేవ్‌పూర్/మర్కుక్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రవీణ్‌కుమార్ సోమవారం పలువురు బీఎస్పీ నేతలతో కలిసి తెలంగాణ భవన్ నుంచి వాహనాలతో ర్యాలీగా బయలుదేరి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి సమీపంలోని కేసీఆర్ ఫాంహౌజ్‌కు వెళ్లారు. అక్కడ గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలమైన తెలంగాణవాదానికి బహుజనవాదం తోడైతే పేదలకు మేలు జరుగుతుందని బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. ఈ రెండు వాదాలు కలిస్తే బాగుంటుందని ఆలోచించి బీఎస్పీలో ఉండగా బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామని చెప్పారు. దానిని రద్దు చేసుకోమని బీఎస్పీ చీఫ్ మాయావతి ఒత్తిడి తేవడంతో, ఇష్టం లేక ఆ పార్టీని వీడినట్లు వివరించారు. కేసీఆర్ తరహాలోనే తాను కూడా మాట ఇస్తే మడమ తిప్పనన్నారు. నీది.. నాది పాలమూరే అంటూనే సీఎం రేవంత్‌రెడ్డి తనను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటివాటికి లొంగనన్నారు. బహుజన బలగానికి నిరంతరం అండగా ఉంటూ, పోరాటం చేస్తానని తెలిపారు. "నేను గొర్రెల మందలో గొర్రెను కాలేను. మా కార్యకర్తలు స్థానికంగా పేదలు కావచ్చు. సైద్ధాంతికంగా పేదలు కాదు. పేదలకు న్యాయం చేయడమే నా లక్ష్యం. బీఆర్ఎస్‌లో ఉంటూ వారి సంక్షేమం కోసం నిరంతర సైనికుడిగా ఉద్యమిస్తా" అని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దేశంలో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగాన్ని కాపాడడం బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

గాడిద వెంట వెళ్తేనే.. గుర్రం విలువ తెలుస్తుంది: కేసీఆర్

పార్టీ సమీక్ష సమావేశాల్లో దళిత బంధుతోనే దెబ్బపడిందని కార్యకర్తలు చెప్పడం తనకు ఆశ్చర్యం కలిగించిందని ప్రవీణ్‌కుమార్ చేరిక సందర్భంగా కేసీఆర్ అన్నారు. మంచి పథకాన్ని దళిత సమాజం పాజిటివ్‌గా ఎందుకు తీసుకోలేదో బహుజన యువ మేధావులు విశ్లేషించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్‌ను త్వరలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తానని వెల్లడించారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సమస్యలెన్నో చూసిందని.. పార్టీ నుంచి పోయే వాళ్లు చిల్లరతో సమానమని కేసీఆర్ వ్యాఖ్యానించారు. మీలాంటి యువ నాయకత్వం ఎదిగితే.. వచ్చిపోయే చిల్లరవాళ్లు.. స్వార్థపరుల అవసరం ఉండదని పేర్కొన్నారు. ఉద్యమ కాలంలో అనివార్యంగా కొన్ని మాటలు అనాల్సి వచ్చిందే.. తప్ప, ప్రస్తుత నాయకుల్లా పరుష పదాలతో, దురుసు మాటలతో దుర్భాషలకు దిగలేదన్నారు. ప్రజా జీవితంలో ఓడినా, గెలిచినా ఒక్కతీరుగా ఉండాలన్నారు. కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమవుతున్నాయని అన్నారు. గాడిద వెంట వెళ్తేనే గుర్రాల విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. దళిత శక్తితో బహుజన శక్తి కలవాలని కాన్షీరాం చేసిన పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. 20 శాతం ఉన్న దళితులు ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఉండదని అన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా మళ్లీ మంద ప్రభాకర్

భూపాలపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 18: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మళ్లీ మంద ప్రభాకర్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లికి చెందిన ప్రభాకర్.. తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ కొనసాగారు.

పార్టీ మారడం ఖాయం!

» బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో భేటీలో స్పష్టం చేసిన మల్లారెడ్డి



హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. బీఆర్ఎస్‌ను వీడటం ఖాయమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాను పార్టీ మారక తప్పదని సహచర ఎమ్మెల్యేలతో ఆయన స్వయంగా చెప్పినట్లు సమాచారం. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు ఎన్నికల్లో సహకరించాలన్న ఎజెండాతో ఆదివారం మల్లారెడ్డి నివాసంలో ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చినట్లు, ముఖ్యంగా మల్లారెడ్డి పార్టీ మార్పుపై సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేను పార్ట్ టైం పొలిటీషియన్.. ఫుల్ టైం బిజినెస్‌మేన్‌ను. వ్యాపారపరంగా కొన్ని సమస్యలున్నాయి. వాటి పరిష్కారం కోసం రాజకీయంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది" అని మల్లారెడ్డి అన్నట్లు తెలిసింది. తాను పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నానని, ఏ పార్టీలో చేరుతానన్న దానిపై త్వరలోనే స్పష్టత వస్తుందని ఆయన కుండబద్దలు కొట్టినట్టు సమాచారం. వ్యాపార అవసరాలతోపాటు రాష్ట్రంలోని కొందరు నాయకులు అడ్డుపడుతున్నందునే.. బెంగళూరులో డీకే శివకుమార్‌ను కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సానుకూలత వ్యక్తం చేసిన విషయాన్నీ ఈ సమావేశంలో మల్లారెడ్డి వెల్లడించినట్లు తెలిసిం ది. ముగ్గురు ఎమ్మెల్యేలు ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. బీఆర్ఎస్‌లో కొనసాగేందుకు ఆయన నిరాసక్తత చూపారని ఓ ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్‌లో చేరేందుకే మల్లారెడ్డి మొగ్గు చూపుతున్నారని, అది సాధ్యం కాకపోతే బీజేపీలోకి వెళ్లేందుకూ సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. అదే సమయంలో ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాత్రం తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని భేటీలో స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో అల్లుడి నిర్ణయంతో తనకు సంబంధం లేదని, పార్టీ మారేందుకు తన ప్రయత్నాలు తాను చేసుకుంటానని మల్లారెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాగా, పార్టీ అగ్రనేతల సూచన మేరకే ఎమ్మెల్యేలు మల్లారెడ్డి నివాసంలో సమావేశమైనట్లు సమాచారం.

కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది

- అది సరిపోలేదని ఢిల్లీ వెళ్లి కవిత లిక్కర్ స్కాం
- మోదీ పాలనలో సుస్థిర అభివృద్ధి: కిషన్‌రెడ్డి
- మాజీ సీఎం కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి.. రజాకార్ సినిమా చూపించాలి: బండి సంజయ్




జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇక్కడ చేసిన దోపిడీ సరిపోలేదని, కేసీఆర్ కూతురు కవిత ఢిల్లీకి వెళ్లి లిక్కర్ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. జగిత్యాలలో సోమవారం నిర్వహించిన విజయ సంకల్ప సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. గొర్రెల పథకం, దళిత బంధు స్కాంలు.. ఇసుక దందా, రియల్ ఎస్టేట్, గ్రానైట్ వ్యాపారాలతో గత ప్రభుత్వం తెలంగాణ సమాజాన్ని దోపిడీ చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో నీతిమంతమైన, సుస్థిర పాలన అందిస్తున్నామని చెప్పారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు, జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వే లైన్ నిర్మాణాలు, గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం అంకిత భావంతో పనిచేసిందన్నారు. సమ్మక్క సారక్క పేరుతో రాష్ట్రంలో జాతీయ గిరిజన యూనివర్సిటీని యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. దక్షిణ భారత దేశంలో బీజేపీ రోజురోజుకూ బలపడుతోందన్నారు. జగిత్యాల అడ్డా.. ఉద్యమాల గడ్డ అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. వీరులను కన్న జగిత్యాల గడ్డలో పీఎఫ్ఐ పేరిట దేశ ద్రోహులు అడుగుపెట్టడం ఆందోళనకరమన్నారు. బీజేపీ బరాబర్ రాముడి పేరుతో ఎన్నికలకు వెళుతుందని.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లు అడగాలని సవాల్ చేశారు. నిజాం సమాధి వద్ద మోకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి రజాకార్ సినిమా చూపించాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలికి, మోదీ నాయకత్వాన్ని బలపరచాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 400 సీట్లకు పైగా గెలుచుకొని మోదీని హ్యాట్రిక్ ప్రధాని చేయడం ఖాయమన్నారు.

జితేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిపై ఈడీకి ఫిర్యాదు చేస్తాం: రఘునందన్

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిల అక్రమ వ్యాపారాలపై ఈడీకి ఫిర్యాదు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. షేక్‌పేటలోని సర్వే నంబరు 343, 403లో జరుగుతున్న నిర్మాణ కంపెనీల భూ బాగోతం, అడ్డగోలు దందాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఈడీ, ఐటీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. జితేందర్, రంజిత్‌రెడ్డిలు పార్టీ మారడం వెనుక కొన్ని నిర్మాణ కంపెనీల ప్రయోజనాలు ఉన్నాయని.. త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు. మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మెదక్ పార్లమెంటు సెగ్మెంట్లలో రూ.500 కోట్లు ఖర్చు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.




మహిళా కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్న మోదీ; జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో పాల్గొన్న జనం

బీఆర్ఎస్ స్కామ్‌లు ఢిల్లీ దాకా

(మొదటిపేజీ తరువాయి)

దేశానికి, సమాజానికి ఎలాంటి లాభం చేకూరలేదని ధ్వజమెత్తారు. ఈ పార్టీలన్నీ దేశాన్ని దోచుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చాయని, ప్రజలందరూ కుటుంబ పార్టీలను గమనించాలని కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను మట్టికరిపిస్తాం..

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను మట్టికరిపిస్తామని మోదీ అన్నారు. ఈ అంశం దేశమంతా చెబుతోందని, తెలంగాణను లూటీ చేసిన పార్టీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఇందుకు అవసరమైన శక్తిని ఎన్నికల ఫలితాల ద్వారా బీజేపీకి అందించాలని కోరారు. మే 13వ తేదీన తెలంగాణలో జరిగే ఎన్నికలతో కొత్త చరిత్ర సృష్టించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందితే తెలంగాణ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. రోజురోజుకూ బీజేపీకి మద్దతు పెరుగుతోందని, తెలంగాణలో మూలమూలకూ బీజేపీ బలపడుతోందని మోదీ అన్నారు. మొన్న ఆదిలాబాద్, మల్కాజిగిరిలో తనకు ఘనస్వాగతం తెలపడం ద్వారా ఇది ప్రకటితమైందన్నారు. జగిత్యాలలో నిర్వహించిన విజయసంకల్ప సభ రాష్ట్రంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని తెలిపారు. ఇక్కడికి రావడం పట్ల తాను అదృష్టవంతుడిగా భావిస్తున్నానన్నారు. తెలంగాణ ప్రజలందరూ ఈసారి సైతం మోదీ సర్కారును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. భారత దేశ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి, పేద ప్రజల అభివృద్ధికి, రైతులు, యువకులు, మహిళా సంక్షేమానికి బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు దాటాలన్నారు.

నారీ శక్తితో ఇండియా కూటమిని ఓడిస్తాం..

సమాజంలో ఉన్న మహిళలు శక్తి స్వరూపిణులుగా బీజేపీ భావిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. నారీ శక్తి తమకు శక్తినిస్తుందని, ఈ శక్తి ద్వారా బీజేపీ శక్తివంతమై ఇండియా కూటమిని ఓడిస్తుందని ప్రకటించారు. ఇటీవల ఇండియా కూటమి పవిత్రమైన ముంబైలోని శివాజీ పార్కులో ఎన్నికల సభ నిర్వహించిందని, ఆ సభలో బీజేపీ శక్తిని సర్వనాశనం చేస్తామన్నారని చెప్పారు. అయితే.. ప్రతి బాలికను, మహిళలను శక్తి స్వరూపిణులుగా, మాతలుగా బీజేపీ భావిస్తుందని, ఈ శక్తిని నాశనం చేస్తామని ఇండియా కూటమి ప్రకటించడం అవివేకమని విమర్శించారు. తాను భరతమాత పూజారినని, శక్తి స్వరూపులైన



మహిళలందరినీ పూజిస్తానని, ఇదే వేదికపై నుంచి బాలికలు, మహిళల సంరక్షణకు శపథం తీసుకుంటున్నానని మోదీ ప్రకటించారు. సాక్షాత్తూ చంద్రయాన్ అడుగిడిన చోటును శివశక్తి కేంద్రంగా నామకరణం చేశామని గుర్తు చేశారు. ఎవరు శక్తిని వినాశనం చేస్తారో, ఎవరు శక్తిని రక్షించి అధికారంలోకి వస్తారో జూన్ 4వ తేదీన తేలుతుందని వ్యాఖ్యానించారు.

వికసిత్ తెలంగాణతో వికసిత్ భారత్...

వికసిత్ తెలంగాణతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని మోదీ అన్నారు. దేశంలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కలిగించానని, 4 కోట్ల మందికి పైగా ఇళ్లు కట్టించామని, 12 కోట్ల కుటుంబాలకు తాగునీరు అందించామని, 50 కోట్ల కుటుంబాలను బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకున్నామని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 50 కోట్ల మందికి ఆరోగ్య సేవలు అందిస్తున్నామని, నిరుపేదలకు ఆదుకోవడానికి ఆత్మనిర్భర్ పథకం ద్వారా వేల కోట్లు వ్యయం చేశామని వివరించారు. తెలంగాణలో 11 లక్షలకు పైగా మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఉజ్వల యోజన కింద పంపిణీ చేశామని, 30 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.6 వేల చొప్పున అందించామని తెలిపారు. ఎరువుల ధరలు పెరగకుండా చూశామని, పంటలకు మద్దతు ధర అందించామని పేర్కొన్నారు. వరికి గతంలో రూ.1,300 ఉన్న కనీస మద్దతు ధరను రూ.2,100కు పెంచామని వివరించారు. ఈ ప్రాంతంలో పసుపు పండించే రైతుల కోసం పసుపు బోర్డును ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. దీంతో 2014లో రూ.6 వేలకు క్వింటాలున్న పసుపు ధర ప్రస్తుతం సుమారు రూ.20 వేలకు పెరిగిందన్నారు. నిజాం దక్కన్ షుగర్ కర్మాగారాన్ని ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తెరిపించలేకపోయాయని, కానీ.. బీజేపీ రూ.6,400 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించి 75 వేల టన్నుల యూరియా ఉత్పత్తి చేస్తోందని చెప్పారు. గడిచిన పదేళ్లలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని అన్నారు. 25 వేల కోట్ల నిధులతో 2వేల కిలో మీటర్ల జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణలో హైవేలను, రైల్వేలను అభివృద్ధి చేస్తామని, గ్రామాలను డిజిటల్ మయం చేస్తామని, ప్రతీ ఇంటికి సౌర విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. సభ సక్సెస్‌తో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి...

ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన గడ్డ తెలంగాణ అని మోదీ అన్నారు. రాష్ట్రంలో ఓవైపు ఎలాంటి అభివృద్ధి చేయని కాంగ్రెస్ పార్టీ, మరోవైపు తెలంగాణ వాదాన్ని వినియోగించుకొని అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ ఉన్నాయని, ఈ రెండు పార్టీలు ప్రజలను వంచించాయని ఆరోపించారు. తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి రాష్ట్రాన్ని లూటీ చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తెలంగాణను తన ఏటీఎంగా మార్చుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో ఈ రెండు కుమ్మక్కై పనిచేస్తున్నాయని, బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ మాట్లాడకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. కాళేశ్వరం స్కాం విషయంలో కోట్లాది రూపాయలు ఎక్కడికి పోయాయని ప్రధాని ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ ఇప్పటికీ ప్రశ్నించడం లేదన్నారు. బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత వల్లనే రాష్ట్రంలో ఆ పార్టీని అధికారం నుంచి దించారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ లెక్కలేనన్ని హామీలు ఇచ్చిందని, ప్రస్తుతం వాటిని నెరవేర్చలేని స్థితిలో ఉందని విమర్శించారు. కాంగ్రెస్ హామీల అమలును బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదని, ఒకరినొకరు రక్షించుకునే పనిలో ఉన్నారని, మోదీని తిట్టడమే వారు పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఈ రెండు పార్టీలు చేసిన అన్ని రకాల అవినీతిని లెక్కగట్టి బయటకు తీస్తానని, తెలంగాణను లూటీ చేసిన వాళ్లను వదిలేది లేదని అన్నారు.

కేజ్రీ, సిసోడియాతో కవిత కుమ్మక్కు



(మొదటిపేజీ తరువాయి)

విధానం రూపొందించారని పేర్కొంది. హైదరాబాద్‌లో తాము సోదాలు నిర్వహిస్తున్నప్పుడు కవిత బంధువులు, సహచరులు తమను అడ్డుకున్నారని ఈడీ తెలిపింది. కాగా, మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో ఈ నెల 15న కవిత అరెస్టు తర్వాత మొదటిసారి ఈడీ అధికారికంగా స్పందించింది. ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబై తదితర 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని, రూ.128.79 కోట్ల ఆస్తులను జప్తు చేశామని తెలిపింది. సిసోడియాతో పాటు సంజయ్‌సింగ్, విజయ్‌నాయర్ వంటి ఆప్ నేతలను అరెస్టు చేశామని పేర్కొంది. కుంభకోణంపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. ఢిల్లీలోని మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు ఈ నెల 23 వరకు కవితకు రిమాండ్ విధించడంతో పాటు విచారణ నిమిత్తం ఈడీ కస్టడీకి అప్పగించినట్లు పేర్కొంది.

సుప్రీంలో కవిత పిటిషన్‌పై నేడు విచారణ

ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కవిత సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరగుతుండగానే అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు ఈడీ తరఫు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, ఈడీపై తగిన చర్యలు తీసుకోవాలని కవిత తరఫున న్యాయవాది ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ఢిల్లీ మద్యం కేసులో ఈడీ తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలని, మహిళలను దర్యాప్తు కార్యాలయాలకు పిలిచి విచారించకుండా ఇంటివద్దనే విచారించాలని నిరుడు మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ చేసింది. ఈ నెల 15న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. ఆ కేసును ఈ నెల 19 (మంగళవారాని)కి వాయిదా వేశారు. సోమవారం కవిత పిటిషన్ దాఖలు చేయగా, గత పిటిషన్‌తో కలిపి రెండింటినీ మంగళవారమే సుప్రీం ధర్మాసనం విచారించనుంది.

పోటీకి తమిళిసై



(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ పదవులకు ఆమె రాజీనామా చేసినట్లు తెలిసింది. సౌత్ చెన్నై లేదా తూత్తుకుడి నుంచి ఆమె పోటీ చేస్తారని లేదంటే పుదుచ్చేరి నుంచైనా బరిలోకి దిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. డీఎంకే ఎంపీ కనిమొళి ప్రాతినిథ్యం వహిస్తున్న తూత్తుకుడి నుంచే తమిళిసై పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలోనే తమిళిసై విద్యార్థి సంఘం నాయకురాలిగా పని చేశారు. బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై పార్టీలో చేరారు. 1999 నుంచి 2013 వరకు పార్టీలో అనేక పదవీ బాధ్యతలు నిర్వర్తించారు, 2014 నుంచి బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా కొనసాగారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమిళిసై.. రెండుసార్లు లోక్‌సభ సభ్యురాలిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత తెలంగాణ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి.. ఇప్పుడు మరోసారి లోక్‌సభ బరిలో తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం హైదరాబాద్‌లో బస చేసిన ప్రధాని మోదీ.. లోక్‌సభ టికెట్‌పై స్పష్టత ఇవ్వడంతో గవర్నర్ పదవికి ఆమె రాజీనామా చేసినట్లు సమాచారం. తమిళిసై రాజీనామాకు ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదం లభించనుంది. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రస్తుతానికి కొత్త గవర్నర్‌ను నియమించే అవకాశం లేదు. ఎన్నికలు ముగిసే దాకా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కే తెలంగాణతోపాటు పుదుచ్చేరి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

అక్కలా ఆదరించినందుకు ధన్యవాదాలు

తనను సొంత అక్కలా ఆదరించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తమిళిసై పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. "గవర్నర్ పదవి నుంచి వైదొలుగుతున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యా. అన్నింటికీ మించి తెలంగాణ సోదర, సోదరీమణుల ఆప్యాయత నన్ను బాగా ఆకట్టుకుంది. ఈ రాష్ట్రానికి సేవ చేయడం చాలా ఆనందం కలిగించింది. పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మీరందరూ నన్ను అక్కలా ఆదరించారు. మీ అచంచలమైన మద్దతు, ప్రేమ, ఆప్యాయత ఎంతగా నా హృదయాన్ని తాకాయో మాటల్లో పూర్తిగా వ్యక్తపర్చలేకపోతున్నా. మీతో పంచుకున్న ప్రతి క్షణం నాపై చెరగని ముద్ర వేసింది. అందరం కలిసి తెలంగాణ ప్రగతికి పాటు పడ్డాం. బోనాలు, బతుకమ్మ పండగలు కలిసి జరుపుకొన్నాం. గవర్నర్ పదవికి వీడ్కోలు పలుకుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. చిరస్మరణీయ జ్ఞాపకాలతో తెలంగాణను వీడుతున్నా" అని పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించాలన్న ఉద్దేశంతోనే గవర్నర్ పదవులకు రాజీనామా చేసినట్లు చెన్నైలో ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సంప్రదింపులు జరిపానని, వారి సూచన మేరకు రాజీనామా చేశానని చెప్పారు. కాగా, శంషాబాద్‌లో వీడ్కోలు పలకడానికి అధికారులెవరూ రాకపోవడంతో ఆమె ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గత ప్రభుత్వ తీరును ఎండగట్టి..

గవర్నర్ హోదాలో రాజ్యాంగపరమైన హక్కుల్ని వినియోగించుకోవడం ద్వారా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై తమిళిసై విరుచుకుపడ్డారు. సమయం వచ్చిన ప్రతి సారీ చట్టానికి లోబడి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కొన్ని సార్లు ప్రత్యక్షంగా, మరి కొన్ని సార్లు పరోక్షంగా తాను చెప్పాలనుకున్నది సూటిగా, స్పష్టంగా చెప్పారు. ప్రొటోకాల్ పాటించని సందర్భాల్లోనూ.. తనకు ప్రత్యేక కిరీటాలు అవసరం లేదని బాహాటంగానే చెప్పారు. రాజ్‌భవన్ ముందు ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయడంతోపాటు మహిళా దర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేశారు. వరదలు, ముంపు సమయాల్లో తానున్నానంటూ ప్రజల చెంతకు వెళ్లి భరోసా కల్పించారు.

'3 గంటల్లోగా సాగనంపండి..'

- రాజ్‌భవన్ కార్యదర్శి సురేంద్ర మోహన్ బదిలీపై ప్రభుత్వానికి తమిళిసై అల్టిమేటం!

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఈలోపు కార్యదర్శి సురేంద్రమోహన్‌ను బదిలీ చేయండి' అంటూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారా? ఆమె ఆదేశాలను పాటిస్తూనే ప్రభుత్వం సురేంద్ర మోహన్‌ను సాగనంపిందా? అంటే అవుననే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇంతకు ముందు నరసింహన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అర్హత, సీనియారిటీ లేకున్నా సూర్యాపేట కలెక్టర్‌గా పనిచేస్తున్న సురేంద్రమోహన్‌ను గత ప్రభుత్వం రాజ్‌భవన్ కార్యదర్శిగా నియమించింది. అయితే నరసింహన్ స్థానంలో తమిళిసై గవర్నర్‌గా వచ్చారు. కాగా సురేంద్రమోహన్ పనితీరుపై ఆది నుంచి ఆగ్రహంతో ఉన్న తమిళిసై... తమిళం, తెలుగు భాషలపై పట్టున్న అధికారికి పోస్టింగ్ ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఓ దశలో ప్రస్తుతం సీఎంవో కార్యదర్శిగా ఉన్న మాణిక్యరాజ్ కన్నన్‌కు పోస్టింగ్ ఇవ్వాలని కూడా ప్రభుత్వానికి నిర్దేశించారు. అయితే గత ప్రభుత్వం ఆయన్ను ప్రాధాన్యంలేని పోస్టుల్లో నియమిస్తూ రాగా...ఆయన ఓ దశలో కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. తాజాగా తాను రాజీనామా చేయడానికి రెండు రోజుల ముందే సురేంద్రమోహన్‌ను సాగనంపాలని తమిళిసై నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపే సురేంద్రమోహన్‌ను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

5.73 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

- వాహన తనిఖీల్లో గుర్తించిన పోలీసులు
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన
- తిప్పర్తిలో 1.80 లక్షల నగదు స్వాధీనం

నల్లగొండటౌన్, తిప్పర్తి, మార్చి 18: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.5.73 కోట్ల విలువైన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సోమవారం మిర్యాలగూడలోని ఈదులగూడ చౌరస్తాలో డీఎస్పీ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్తున్న టీఎస్ 09 యూఈ 2479 నెంబర్ గల బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో సుమారు రూ.5.73 కోట్ల విలువైన బంగారం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. బొలెరో(గోల్డ్ అల్మమెట్ కొరియర్ సర్వీసు) వాహనం హైదరాబాద్ నుంచి బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడలో ఆర్డర్ డెలివరీ ఇచ్చి కోదాడ, ఖమ్మం వైపు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బంగారం జీరో దందాకి చెందినదా లేదా వ్యాపారులకు సంబంధించిదా అని తేలాల్సి ఉంది. వాహన డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.1.80లక్షల నగదును నల్లగొండ జిల్లా తిప్పర్తిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో భారీ వర్షానికి ఒరిగిపోయిన మొక్కజొన్న పంట

38 వేల ఎకరాల్లో పంట నష్టం!

ఏడు జిల్లాల్లో అకాల వర్షాల ప్రభావం

- కామారెడ్డిలోనే 21 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రాథమికంగా అంచనా వేసిన వ్యవసాయశాఖ
- నేడు, రేపు పలుచోట్ల వర్షాలు!

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

యాసంగి పంటలు చేతికొచ్చే దశలో పలుచోట్ల రైతులను అకాల వర్షం తీవ్రంగా దెబ్బకొట్టింది. రెండ్రోజులుగా ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షాలకు నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, నిర్మల్ జిల్లాల్లో 38 వేల ఎకరాల్లో వరి, జొన్న, మొక్కజొన్న మిర్చి, పొగాకు, శనగ తదితర పంటలు దెబ్బతిన్నాయి. తోటల్లో మామిడి కాయలు, చింతకాయలు నేలరాలాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టంపై ప్రాథమిక అంచనాలు వేశారు. కామారెడ్డిలో పంట నష్టం ఎక్కువగా జరిగింది. జిల్లాలో 15 మండలాల పరిధిలోని 150 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం, వీణవంక, ఎలుబాక, కిష్టంపేట, మానకొండూరు తదితర ప్రాంతాల్లో మామిడి తోటలకు తీవ్ర నష్టం సంభవించింది. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట, వెల్దుర్తి ప్రాంతాల్లో 500 ఎకరాల్లో.. నిర్మల్ జిల్లాలోని కడెం, ఖానాపూర్‌లో వెయ్యి ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ జిల్లాలోని బోధన్, సాలూరా, ఎడపల్లి, నవీపేట్, డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, బాల్కొండ, మెండోరాల్లోని 44 గ్రామాల్లో 6 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని బాబానగర్, రంజోల్, బుర్దిపాడ్, న్యాలకల్, కల్హేర్, మాసన్‌పల్లి, కంగ్టి, మనూరు, దోసపల్లి, బాదల్‌గావ్, పులుకుర్తి, ఝరాసంగంలో 8 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అయితే ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల బీమా పథకం అమల్లో లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో జరిగిన పంటనష్టం పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కామారెడ్డిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ.. పంటనష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి పంట నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. కాగా మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురవొచ్చునని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

విద్యుత్తు స్తంభం మీద పడి..

సిరిసిల్ల జిల్లాలో విద్యుత్తు స్తంభం మీద పడటంతో ఓ రైతు ప్రాణం పోయింది. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎలుసాని ఎల్లయ్య (55) అనే రైతు హోటల్ ముందు నిల్చుని ఉండగా వర్షం, ఈదురుగాలలకు విద్యుత్తు స్తంభం మీద పడింది. ఈ ఘటనలో ఆయన మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో వడగాళ్ల వాన పడింది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల వడగళ్ల వాన కారణంగా వరిపంటకు నష్టం జరిగింది. సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్, ముంపు గ్రామమైన ఎర్రవల్లి, గ్రామం జలమయమైంది.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికకూ.. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ చర్యలు

- పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల విస్తృత తనిఖీలు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత 8.54 లక్షల ఓట్లు తొలగించాం
- రాష్ట్రంలో ప్రస్తుతం 3.30 కోట్ల మంది ఓటర్లు
- సీఈవో వికాస్‌రాజ్ వెల్లడి



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్ చెప్పారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో సీఈవో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర వస్తు రవాణాపై నిఘా పెట్టామని, పోలీసులతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగాలు విస్తృత తనిఖీలు చేపడుతున్నాయని తెలిపారు. 24 గంటలు పనిచేసేలా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సంబంధిత పత్రాలను చూపాలని, లేదంటే సీజ్ చేస్తారని చెప్పారు. 35,385 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. 54,353 ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత 8,54,491 ఓట్లు తొలగించామన్నారు. ఈ సారి ఓటర్ల జాబితాలో 18-19 ఏళ్ల యువ ఓటర్లు 8,87,717 మంది ఉన్నారని, 85 ఏళ్లు పైబడిన వారు 1,94,082, దివ్యాంగులు 5,26,340 మంది ఉన్నట్లు సీఈవో వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో చిన్న నియోజకవర్గం మహబూబాబాద్ అని, అతిపెద్ద నియోజకవర్గం మల్కాజిగిరి అని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడకూడదన్నారు. అభ్యర్థులు, పార్టీల నేతలు చేపట్టే రోడ్ షోలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో చిన్నపిల్లలకు, స్కూల్ డ్రెస్‌లతో వచ్చేవారికి అనుమతి లేదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోసం డీఈవో, ఆర్‌వో, పోలీసు అధికారులకు ఢిల్లీలో శిక్షణ ఇచ్చామని, మరికొంత మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉందని చెప్పారు.



మొత్తం ఓటర్లు	3,30,00,088
మహిళలు	1,65,87,134
పురుషులు	1,64,10,227
థర్డ్‌జెండర్	2,727

పోస్టల్ ఓటింగ్ సమస్యకు పరిష్కారం

అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ ఓటింగ్‌కు సంబంధించిన సమస్య తలెత్తిందని.. ఈ సారి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, పోలీసులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దృష్టి సారించామని వికాస్‌రాజ్ తెలిపారు. ఈసారి పోస్టల్ ఓటింగ్‌ను కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే 85 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులు ఏప్రిల్ 22లోపు 'ఇంటి వద్దే ఓటు' కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘన, ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు విజిల్ యాప్‌ను, టోల్ ఫ్రీ నంబర్ 1950ను వాడుకోవాలని చెప్పారు. అదేవిధంగా పార్టీల ర్యాలీలు, సభలకు అనుమతులను సువిధ యాప్ ద్వారా తీసుకోవాలని సూచించారు. పత్రికలు, వార్తా చానళ్లు, సినిమా హాళ్లలో ప్రచార ప్రకటనలు, బల్క్ వాయిస్ మెసేజ్‌లు, బల్క్ వీడియో మెసేజ్‌లు చేయదలచిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి పొందాలని సూచించారు.

అక్కరకు రాని సంక్షేమ పథకాలు.. తిండికి లేక వృద్ధ దంపతుల ఆత్మహత్య

» ఆర్థిక ఇబ్బందులతో కొన్నాళ్లుగా భిక్షాటన

» చెట్టంత కొడుకున్నా పట్టించుకోని వైనం

» పొట్టగడవడమే కష్టంగా మారడంతో.. నిజాంసాగర్ కెనాల్‌లో దూకి బలవన్మరణం

నిజామాబాద్ అర్బన్, మార్చి 18: ప్రభుత్వాలు రూ.వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా.. ఆకలి చావులు ఆగట్లేదు! జీవితపు మలిసంధ్యలో.. పిల్లలున్నా పట్టించుకోని స్థితిలో.. ఇంత ముద్ద పెట్టే దిక్కు లేక బలవన్మరణాలకు పాల్పడుతున్న పండుటాకులెందరో!! అలాంటిదే ఒక ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం జరిగింది. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు.. మరోవైపు చెట్టంత ఎదిగిన కొడుకున్నా పట్టించుకోకపోవడంతో.. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో పొట్టపోసుకోవడానికి ఊరుగాని ఊరుకు వెళ్లి భిక్షాటనకు దిగిందో వృద్ధ జంట. కానీ.. రోజురోజుకూ పరిస్థితి మరింత దిగజారుతుండడంతో ఇద్దరూ కలిసి నీళ్లల్లో దూకి ప్రాణాలు తీసుకున్నారు! బోధన్ మండలం అమ్దాపూర్‌కు చెందిన ఆ వృద్ధ దంపతుల పేర్లు.. బాబయ్య (65), పోచమ్మ (60). ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారు నాలుగు నెలల క్రితం నిజామాబాద్‌కు చేరుకుని భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కొద్ది రోజులుగా పూటగడవడమే కష్టంగా మారడంతో సోమవారం జిల్లాకేంద్రంలోని ఖిలా ప్రాంతంలో ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'మేఘా'పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం..
సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మేఘా సంస్థపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ సంస్థ ప్రతినిధులు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంస్థకు అప్పగించే పనుల్లో మాజీ సీఎం కేసీఆర్‌కు 7 శాతం వాటా ఆఫర్ చేయడం వల్ల మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తెలంగాణలో 90 శాతం ప్రాజెక్టులు పొందారని కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారు. ఐఆర్ఎస్ బాలాజీ మజుందార్ ముందస్తు పదవీ విరమణను ప్రభావితం చేశారంటూ అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో ఆయా రాష్ట్రాల సీఎంలకు మేఘా కృష్ణారెడ్డి భారీ మొత్తాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చారని తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేఘా సంస్థపై ఇలాంటి అభ్యంతరకర పోస్టులను సోషల్ మీడియా నుంచి తొలగించడంతోపాటు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంస్థ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

20న మళ్లీ రాష్ట్రానికి ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలకు గల కారణాలను అన్వేషిస్తున్న జె.చంద్రశేఖర్‌అయ్యర్ నేతృత్వంలోని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ మరోమారు తెలంగాణలో పర్యటించనుంది. నిర్మాణంలో పాల్గొన్న అధికారులతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మూడ్రోజుల పాటు భేటీ కానుంది. ప్లానింగ్ నుంచి డీపీఆర్‌ల తయారీ, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్, డిజైన్లను ఆమోదించిన సీడీవో అధికారులు, క్వాలిటీ కంట్రోల్, ఇన్‌స్పెక్షన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ అధికారులందరినీ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కమిటీ ఆదేశించింది. 20వ తేదీన హైదరాబాద్ రానున్న కమిటీ.. ఆరోజు సీడీవో అధికారులతో సమావేశం కానుంది. మరుసటి రోజు ఇతర అధికారులతో భేటీ అవనుంది. 22న రాజేంద్రనగర్‌లోని ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీలో బ్యారేజీల నమూనాలు పరిశీలించి.. అదే రోజు రాత్రి ఢిల్లీకి వెళ్లనుంది.



2020 ఏప్రిల్ నాటి గుగూల్ ఫొటో



2020 నవంబరు నాటి గుగూల్ ఫొటో

ఖాజాగూడలో జాగా మాయ

(మొదటి పేజీ తరువాయి)

విడుదలయ్యాక జరగడం గమనార్హం!! ఈ వ్యవహారం వెనుక ఓ న్యాయవాది ఉన్నారని, ఆయన గత ప్రభుత్వంలోని ఓ శాఖలో జీపీ (ప్రభుత్వ ప్లీడరు)గా ఉండి ఈ కథంతా నడిపించారనే ఆరోపణలున్నాయి. పైగా ఈ భూమిని క్రమబద్ధీకరించుకున్న 8 మంది కూడా సదరు న్యాయవాది కుటుంబసభ్యులు, బంధువులేనని తెలుస్తోంది. తన పలుకుబడిని ఉపయోగించి ఈ 8మంది పేర్లపై 10 డాక్యుమెంట్లతో ప్రభుత్వ స్థలాన్ని ఆయన కారు చౌకకే కొట్టేసినట్లు.. ఈ 'అక్రమబద్ధీకరణ'లో నాటి ప్రభుత్వంలోని బీఆర్ఎస్ పెద్దలు, రెవెన్యూ అధికారులు పూర్తిగా సహకరించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అసలు ఏమిటీ 59 జీవో?

సర్కారు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెడుతూ 59 జీవోను విడుదల చేసింది. తదనంతర కాలంలో ఈ పథకాన్ని పలుమార్లు పొడిగించింది. ఈ ప్రక్రియకు ప్రత్యేక నిబంధనలు పొందుపరిచింది. పథకాన్ని చివరిసారి పొడిగించినప్పుడు ఆక్రమించిన స్థలంలో 2020 జూన్ 2వ తేదీ నాటికి ఇల్లు నిర్మించుకొని, అక్కడే నివాసం ఉండాలనే నిబంధన విధించింది. వారికి ఆ ఇంటి అడ్రస్‌పైనే ఆధార్, కరెంట్ బిల్లులు తదితర పత్రాలు ఉండాలని స్పష్టం చేసింది.

ఖాజాగూడలో ఏం జరిగింది?

ఖాజాగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 28లో మొత్తంగా 31.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబరు పరిధిలో ఖాజాగూడ లేక్, దాని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కూడా ఉంది. లేక్‌కు అనుకొని ఇదే సర్వే నంబరులోని 2,742 చదరపు గజాల స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. ఆ భూమిని సొంతం చేసుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన 59 జీవోను ఆధారంగా చేసుకున్నారు. అయితే 2,742 చదరపు గజాల ఆ స్థలంలో ఒక చిన్న గది తప్ప ఎలాంటి ఇళ్లూ లేవు! కానీ అక్కడ 10 ఇళ్లు ఉన్నట్టుగా.. ఆ లేని ఇళ్లు కూడా 2020 జూన్ 2వ తేదీలోగా నిర్మాణం పూర్తి చేసుకున్నట్టుగా.. ఆ ఇళ్లలో 10 కుటుంబాలు నివసిస్తున్నట్టుగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. ఆ మేరకు అడ్రస్ ప్రూఫ్‌గా ఆధార్ కార్డులు, కరెంటు బిల్లులను పుట్టించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కూడిన ఈ దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపలేదు. పత్రాలు, రసీదులు సరైనవేనా? అని పరిశీలించనూ లేదు. 59 జీవో కింద ఉన్న నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఎనిమిది మంది పేర్ల మీద భూమిని క్రమబద్ధీకరించేశారు. అయితే 2020 జూన్ 2 నాటికే అక్కడ ఓ ఒక చిన్నపాటి గది నిర్మించి, దానికి కరెంట్ బిల్లు, ప్రాపర్టీ ట్యాక్స్ పొందారు. ఈ బిల్లులతోనే రెగ్యులరైజ్ చేయించుకున్నారు.

ప్రక్రియంతా ఎన్నికల కోడ్ వచ్చాకే

జీవో 59 కింద చేపట్టిన ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ అంతా అసెంబ్లీ ఎన్నికల కోడ్ సమయంలోనే చేపట్టారు. ఎనిమిది మంది పేర్లపైన 10 డాక్యుమెంట్ల రూపంలో 2,742 చదరపు గజాల విస్తీర్ణాన్ని 2023లో నవంబరు, డిసెంబరు నెలల్లో రెగ్యులరైజ్ చేశారు. 2023 నవంబరు 10న అలోటి వాలా జక్రియోద్దిన్ పేరున 220 గజాలు (డాక్యుమెంట్ నంబరు 17914/2023), కంచ వాలా అబ్బాస్ హుస్సేన్ బాటా పేరు మీద 240 గజాలు (డాక్యుమెంట్ నంబరు 17915/2023) రెగ్యులరైజ్ చేశారు. నవంబరు 14న జోహర్ హుస్సేన్ బాటా పేరు మీద 240 గజాలు (డాక్యుమెంట్ నంబరు 18032/2023), అస్గర్ అలీ పేరు మీద 240 గజాలు (డాక్యుమెంట్ నంబరు 18033/2023), నవంబరు 25న జోహిర్ కంచ వాలా పేరు మీద 240 గజాల (డాక్యుమెంట్ నంబరు 18901/2023)ను, ఈయన పేరు మీదే 240 గజాల (డాక్యుమెంట్ నంబరు 18902/2023) రెగ్యులరైజ్ చేశారు. ఎన్నికల కౌంటింగ్‌కు ఒక్క రోజు ముందు అంటే డిసెంబరు 2న గజాలా అబ్దుల్ సత్తార్ పేరు మీద 363 గజాలు (డాక్యుమెంట్ నంబరు 19158/2023), 490 గజాల(డాక్యుమెంటు నంబరు 19159/2023)ను రెగ్యులరైజ్ చేశారు. డిసెంబరు 8న నుజహత్ ఫాతిమా పేరుమీద 230 గజాల (డాక్యుమెంటు నంబరు 19582/2023), హతీమ్ అలీ పేరు మీద 250 గజాల (డాక్యుమెంట్ నంబరు 19583/2023)ను రెగ్యులరైజ్ చేశారు. అప్పటి శేరిలింగంపల్లి తహసీల్దారు (డిప్యూటీ కలెక్టర్) శ్రీనివాస్ రావు, దరఖాస్తును ధ్రువీకరించిన విచారణ అధికారి తహసీల్దారు చంద్రశేఖర్ తదితర అధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దలు సహకరించడంతో క్రమబద్ధీకరణ వ్యవహారం సాఫీగా జరిగిపోయిందనే ఆరోపణలున్నాయి. ఆ వెంటనే సదరు 8 మంది ఈ స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించారు.

ఇదిగో.. ఆ ఖాళీ స్థలం

ఈ ఫొటోల్లో మొదటి ఫొటో 2020 మే నెలలో గూగుల్ ద్వారా తీసింది. ఇందులో ఖాజాగూడ లేక్ సమీపంలోని సర్వే నంబరు 28లో చిన్న గది తప్ప ఏమీ కనిపించడం లేదు. రెండో ఫొటో అదే ఏడాది నవంబరులో గూగుల్ ద్వారా తీసిందే. ఇందులో కూడా ఒక గది మినహాయించి అక్కడ ఏ నిర్మాణాలు లేవు. కానీ అక్కడ పది ఇళ్లు ఉన్నట్లు.. ఆ ఇళ్లలో జనం ఉంటున్నట్లు.. పత్రాలు సృష్టించి సర్కారు భూమిని ఆక్రమించుకున్నారు.

అక్రమ రెగ్యులరైజేషన్‌కు తెరలేపిన అప్పటి డిప్యూటీ కలెక్టర్

శేరిలింగంపల్లి తహసీల్దారుగా (డిప్యూటీ కలెక్టర్) విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావు శేరిలింగంపల్లి మండల పరిధిలో జీవో నంబరు 59 కింద పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాలను రెగ్యులరైజ్ చేశారు. ఆయన సిరిసిల్ల ఆర్డీవోగా పనిచేసి నేరుగా శేరిలింగంపల్లి తహసీల్దారుగా డిప్యూటీ కలెక్టర్ హోదాలో వచ్చారు. పెద్ద ఎత్తున ముడుపులు తీసుకొని వందల కోట్లు విలువ చేసే భూములను జీవో నంబరు 59 కింద రెగ్యులరైజ్ చేశారని ఆయనపై ఆరోపణలున్నాయి. అయితే మండలంలో ఈ జీవో కింద వచ్చిన దరఖాస్తులు విచారించేందుకు ముగ్గురు తహసీల్దారును నియమించినా వారు కూడా నిబంధనలను పట్టించుకోకుండా గుడ్డిగా అనుమతులిచ్చారన్న విమర్శలున్నాయి. కాగా శేరిలింగంపల్లి మండల పరిధిలో భారీ సంఖ్యలో జరిగిన అక్రమాల తాలూకు వివరాలన్నీ కొన్ని రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లాయి. ఫలితంగా రంగారెడ్డి జిల్లాలో 59 జీవో కింద రెగ్యులరైజ్ చేసిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులివ్వొద్దని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇతర శాఖల అధికారులను ఆదేశిస్తూ సర్క్యులర్ జారీ అయింది. జీవో కింద క్రమబద్ధీకరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

రూ.300 కోట్ల ఘరానా మోసం!

» రియల్‌ఎస్టేట్ ముసుగులో పెట్టుబడుల సేకరణ

» అధిక లాభాల పేరుతో గొలుసుకట్టు ఉచ్చు

» జేవీ బిల్డర్స్ టోకరా.. ఠాణాకు బాధితులు

ఉప్పల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): "రండి బాబూ రండి..! రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టండి..! అసలుకు అసలు.. వడ్డీకి వడ్డీ..! పెట్టుబడి సులభంగా రెట్టింపవుతుంది..! మీరు మరికొందరిని ఈ స్కీమ్‌లో చేరిస్తే.. కమీషన్ మీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది..!" అంటూ మల్టీ లెవెల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) తరహాలో ఊదరగొట్టిన జేవీ బిల్డర్స్ అనే సంస్థ అమాయకుల పుట్టి ముంచింది. ఈ సంస్థ మోసం రూ.300 కోట్లకు పైగానే ఉంటుందని ప్రాథమిక అంచనా. సోమవారం రాత్రి భారీ సంఖ్యలో బాధితులు ఉప్పల్ పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు చెందిన వేలూరి జ్యోతి, వేలూరి లక్ష్మీనారాయణ.. ఉప్పల్‌లో మూడేళ్ల క్రితం జేవీ బిల్డర్స్ పేరుతో రియల్‌ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. జనగామ, వడ్లకొండ ప్రాంతాల్లో వెంచర్లు వేశామని, పెట్టుబడులు పెడితే.. నెలనెలా వడ్డీ ఇస్తామని, అసలు మొత్తం కూడా వెనక్కి వచ్చేస్తుందని నమ్మబలికారు. ఉప్పల్ గణేశ్ నగర్‌కు చెందిన గంధె రాజు అప్పట్లో రూ.4లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆయన పేరుతో ఒక గుంట భూమిని రిజిస్ట్రేషన్ చేయించి, నెలకు రూ.7వేల చొప్పున లాభాల పేరిట అతని బ్యాంకు ఖాతాలో జమచేశారు. అలా 50నెలలు వడ్డీ పడడంతో.. గణేశ్ మరో రూ.18 లక్షలు పెట్టుబడి పెట్టారు. మరికొందరిని చేరిస్తే.. కమీషన్లు ఇస్తామని జ్యోతి, లక్ష్మీనారాయణ నమ్మబలకడంతో.. తన బంధుమిత్రుల నుంచి రూ.2.5కోట్ల మేర పెట్టుబడులు పెట్టించారు. ఈ తతంగం గొలుసుకట్టు స్కీమ్ మాదిరిగా మారిపోయింది. 7వేల మందికి పైగా పెట్టుబడులు పెట్టినట్లు ప్రాథమిక అంచనా. అయితే, పెట్టుబడి పెట్టిన వారి ఖాతాల్లోకి ఈ నెల నగదు జమ కాకపోవడంతో బాధితులు జేవీ డెవలపర్స్ సంస్థకు వెళ్లారు. వారం రోజులుగా ఆ కార్యాలయానికి తాళం ఉండడం.. నిర్వాహకులు ఫోన్లను స్విచాఫ్ చేయడంతో.. తాము మోసపోయినట్లు గుర్తించారు. వంద మంది దాకా బాధితులు సోమవారం రాత్రి ఉప్పల్ ఠాణాకు చేరుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముందు టారిఫ్ సబ్సిడీ
చెల్లించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తావులేదని పేర్కొంది. "ముందు రాయితీ మొత్తం ఇవ్వండి.. ఆ తర్వాత జీరో బిల్లులు జారీ చేయండి" అంటూ గృహ జ్యోతి పథకం విషయంలో ఈఆర్సీ ఇచ్చిన ఆదేశాలపై చైర్మన్ పేరెత్తకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తీవ్ర స్థాయిలో మండిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషన్ తరఫున కార్యదర్శి వివరణ ఇచ్చారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు లేనందువల్లే బిల్లులు జారీ చేయడం లేదని, బిల్లులు జారీ చేసే వినియోగదారులకు చట్టప్రకారం ప్రభుత్వం ముందస్తుగా సబ్సిడీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చట్టప్రకారం డిస్కమ్‌లు విధులు నిర్వర్తించేలా చూడటం కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాలకు లోబడే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని డిస్కమ్‌లను ఆదేశించినట్లు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

తిరుపతి ఐఐటీలో / పీజీ, పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీలో ఎంటెక్, ఎంపీపీ, ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు గేట్ వ్యాలిడ్ స్కోర్/రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్‌పూర్తిచేసినవారిని గేట్ స్కోర్ నుంచి మినహాయించారు. వీరికి అన్ని ప్రోగ్రామ్‌లలో నేరుగా అడ్మిషన్ ఇస్తారు. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంది. దీనికి గేట్ స్కోర్ అవసరం లేదు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ సౌకర్యం ఉంది. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటల సేపు టీచింగ్ అసిస్టెంట్‌షిప్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సంబంధిత విభాగాల్లో ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్, ట్యుటోరియల్స్, అసైన్‌మెంట్స్, టెస్ట్ పేపర్స్, సెమినార్స్, రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు తదితర యాక్టివిటీస్‌లో అసిస్టెంట్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందినవారికి హెచ్‌టీటీఏ కింద నెలకు రూ.12,400 చెల్లిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎన్ని స్పెషలైజేషన్‌లకైనా విడివిడిగా అప్లయ్ చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కనీసం రెండు సెమిస్టర్లు పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. వీటిలో 8 సీజీపీఏ తప్పనిసరి.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- కెమికల్ ఇంజనీరింగ్
- **సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్:** ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్, మైక్రోఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్‌ఎస్‌ఐ, ఆర్‌ఎఫ్ అండ్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, థర్మల్ ఇంజనీరింగ్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఎమ్మెస్సీ/ఎంఎస్/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతూ జూలై నాటికి ఫలితాలు విడుదలయ్యేవారు కూడా అర్హులే. గేట్ (2024/ 2023/ 2022)లో అర్హత పొంది ఉండాలి.

ఎంపీపీ

మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. కోర్ కోర్సులు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఎలక్టివ్ కోర్సులు, డిజర్టేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ సస్టయినబిలిటీ, డేటా సైన్స్, సస్టయినబిలిటీ అండ్ ఇంజనీరింగ్

అర్హత: సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ సస్టయినబిలిటీ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. డేటా సైన్స్‌కు బీటెక్(కంప్యూటర్ సైన్స్), సస్టయినబిలిటీ అండ్ ఇంజనీరింగ్‌కు బీటెక్(సివిల్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఎంపిక: గేట్ వ్యాలిడ్ స్కోర్/రాత పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ రీసెర్చ్

రీసెర్చ్ విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఎమ్మెస్సీ/ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్

అర్హత: ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలకు సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్/ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్/ ఎమ్మెస్సీ(జామ్ స్కోర్‌తో ఎంట్రీ)/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. ఎమ్మెస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/ జెస్ట్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగానికి సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పయిర్ అర్హత ఉండాలి.

ఎంపిక: ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అడ్మిషన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 10; ఎంటెక్, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 19
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 24 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు జూలై 22; ఎంటెక్, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు జూలై 26
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** iittp.ac.in

తెలంగాణ ఆర్‌డీసీ సెట్ నోటిఫికేషన్



హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఆర్‌డీసీ సెట్) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు, తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకులాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏ, బీఎఫ్‌టీ, బీఎస్సీ ఆనర్స్ తదితర కోర్సులు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బోధన, వసతి ఉచితం.

డిగ్రీ గురుకులాల వివరాలు

- మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాల్లో పురుషులకు 15 కళాశాలలు, మహిళలకు 15 కళాశాలలు ఉన్నాయి.
- తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకులాల్లో మహిళలకు 26 కళాశాలలు ఉన్నాయి.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో పురుషులకు ఆరు కళాశాలలు, మహిళలకు 15 కళాశాలలు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం ఇంటర్ రెండో సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు, ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు రావాలి. ఇన్‌స్టంట్ ఎగ్జామ్ అభ్యర్థులు అనర్హులు. కుటుంబ వార్షికాదాయం నగరాల్లో రూ.2,00,000లు; గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000లు మించకూడదు.

టీఎస్ ఆర్‌డీసీ సెట్ వివరాలు: పరీక్ష సమయం రెండున్నర గంటలు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం మార్కులు 150. అభ్యర్థి ఎంచుకొన్న కోర్సుకు నిర్దేశించిన మూడు సబ్జెక్టులలో ఒక్కోదానిలో 40 మార్కులకు, ఇంగ్లీష్‌లో 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. బీబీఏ, బీకాం(జనరల్ కంప్యూటర్స్ అండ్ బిజినెస్ అనలిటిక్స్) కోర్సులకు మాత్రం ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఇంటర్ సిలబస్ ప్రకారమే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.200
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- ★ **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 21 నుంచి
- ★ **టీఎస్ఆర్‌డీసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- ★ **వెబ్‌సైట్:** tsrdccet.cgg.gov.in

జాబ్ కార్నర్

ఎడ్‌సిల్‌లో టీచర్ ట్రెయినీలు

నోయిడాలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన శ్రీలంకలోని పాఠశాలల్లో పనిచేయడానికి టీచర్ ట్రెయినీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

మొత్తం ఖాళీలు: 50

పోస్టులు: టీజీటీ టీచర్స్ ట్రెయినీ, పీజీటీ టీచర్స్ ట్రెయినీ

సబ్జెక్టులు: ఇంగ్లీష్, మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, బీఈడీ, పని అనుభవంతో పాటు తమిళం/ఆంగ్ల భాష బోధనలో ప్రావీణ్యం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించకూడదు

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 20

వెబ్‌సైట్: hcicolombo.gov.in/edu_consult

టీఎస్‌పీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

కోడింగ్ - డీకోడింగ్

(నిన్నటి తరువాయి)

2. **సవ్యదిశ అక్షరాలకు అపసవ్యదిశ(వ్యతిరేకదిశ) అక్షరాలు రాయడం:**

ఉదా: ఒక సంకేత బాషలో FAMEను UZNVగా రాస్తే అదే సంకేతభాషలో HELPను ఏ విధంగా రాస్తారు?

ఎ) VSKO బి) SVOK
సి) OVSK డి) SOKV

సమాధానం: (బి)

వివరణ: FAMEను UZNVగా రాయడం అంటే
F అనేది 6వ అక్షరం.
U అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 6వ అక్షరం.
A అనేది 1వ అక్షరం.
Z అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 1వ అక్షరం.
M అనేది 13వ అక్షరం.
N అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 13వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
ఈవిధంగా FAME ని UZNVగా రాశారు. ఇదే విధంగా HELP అనే పదములో
H అనేది 8వ అక్షరం.
S అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 8వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
L అనేది 12వ అక్షరం.
O అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 12వ అక్షరం.
P అనేది 16వ అక్షరం.
K అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 16వ అక్షరం.

3. **పదంలోని అక్షరాలకు తదుపరి అక్షరాలుగా లేదా వెనక అక్షరాలుగా రాసి ప్రతి రెండు అక్షరాలను రివర్స్ చేయడం (క్రాస్ మెథడ్).**

ఉదా 3: ఒక సంకేతభాషలో MEDIUMను FNJENVగా రాస్తే అదే సంకేతభాషలో INCOMEను ఏవిధంగా రాస్తారు?

ఎ) OPDFJN బి) JODPNF
సి) OJPDFN డి) JPOFDN



సమాధానము: (సి)

వివరణ: MEDIUMను FNJENVగా రాయడం అంటే MEDIUMలోని ప్రతి అక్షరానికి +1 అక్షరాన్ని రాసిన అంటే.. తదుపరి అక్షరాలుగా రాసిన NFEJVN. దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన FNJENV అవుతుంది. ఇదే విధంగా INCOMEలోని ప్రతి అక్షరానికి తదుపరి అక్షరం రాసిన JODPNF దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన సమాధానం OJPDFN అవుతుంది.

4. **పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పు చేసి రాయడం:**

ఉదా: ఒక సంకేతభాషలో PRIVATEను ARPTIEVగా రాస్తే అదే సంకేతభాషలో MISTAKEను ఏవిధంగా రాస్తారు?

ఎ) IASKMTE బి) AIMKSET
సి) MSKTIAE డి) ఏదికాదు.

సమాధానము: (బి)

వివరణ: PRIVATEను ARPTIEVగా రాయడం అనగా ఆ పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పుచేసి రాశారు.

PRIVATEఅనే పదంలోని అక్షరాలకు 1 2 3 4 5 6 7 అనే సంఖ్యలను ఇచ్చిన ARPTIEV అనేది 5 2 1 6 3 7 4.

1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
P R I V A T E - A R P T I E V
ఇదేవిధంగా
1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
M I S T A K E - A I M K S E T
సమాధానం అవుతుంది.


5. **పదంలోని అక్షరాలను +గా లేదా -గా (తదుపరి లేదా వెనక అక్షరాలుగా) మార్చిన తరవాత మొదటి అర్ధభాగం, రెండో అర్ధభాగం అదే స్థానంలో రివర్స్ చేయడం:**

ఉదా: ఒక సంకేతభాషలో JUNIORను OVKSPJగా రాస్తే అదే సంకేత భాషలో RADIUMను ఏవిధంగా రాస్తారు?

ఎ) EBSNVJ బి) ESBVJN
సి) SBENJV డి) ఏదీకాదు.

సమాధానము:- (ఎ)

వివరణ: ముందుగా JUNIOR అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా KVOJPS. వీటిలో మొదటి అర్ధభాగాన్ని రివర్స్ చేయగా OVK రెండో అర్ధభాగాన్ని రివర్స్ చేయగా SPJ. ఈవిధంగా JUNIOR అనే పదం OVKSPJగా కోడ్ చేశారు. అదేవిధంగా RADIUMఅనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాసిన SBEJVN. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రివర్స్ చేయగా EBS. రెండో అర్ధభాగాన్ని రివర్స్ చేయగా VNJ. కాబట్టి సమాధానం EBSNVJ అవుతుంది. దీనినే మరొక విధంగా కూడా చూపవచ్చు.



ఆరో పద్ధతికి సంబంధించిన ప్రశ్నలు

1. **ఒక సంకేత భాషలో ORANGEను OHFPSBగా రాస్తే అదే సంకేత భాషలో ANCHOR ను ఏ విధంగా రాస్తారు?**

ఎ) IPRBPD బి) IPSBOD
సి) ISPBDO డి) PSIODB

సమాధానం: (బి)

వివరణ: ముందుగా ORANGE అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా PSBOHF. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రెండో అర్ధభాగం స్థానంలో, రెండో అర్ధభాగాన్ని మొదటి అర్ధభాగం స్థానంలోకి మార్పిడి చేస్తే OHFPSB అయింది. అదే విధంగా ANCHORలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా BODIPS. ఈ అక్షరాలలో మొదటి అర్ధభాగాన్ని రెండో అర్ధభాగం స్థానంలో, రెండో అర్ధభాగాన్ని మొదటి అర్ధభాగంలోకి మార్పిడి చేసిన IPSBOD సమాధానం అవుతుంది.

2. **ఒక కోడ్ భాషలో HOSTELను SDKGNRగా రాస్తే అదే కోడ్ భాషలో SELDOMను ఏవిధంగా రాస్తారు?**

ఎ) CNLRDK బి) NCLDRK
సి) CNRLKD డి) CNLRKD

సమాధానము: (ఎ)

వివరణ: HOSTEL అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా GNRSDK. దీనిలోని ఎడమవైపు అర్ధభాగంలో గల అక్షరాలను (GNR) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలో గల అక్షరాలు (SDK) ఎడమవైపు అర్ధభాగంలో రాయగా SDKGNR అవుతుంది. ఇదేవిధంగా SELDOM అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా RDKCNL. ఇప్పుడు దీనిలోని ఎడమవైపు అర్ధభాగంలో గల అక్షరాలను RDK కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలో గల అక్షరాలను CNL ఎడమవైపు అర్ధభాగంలో రాయగా CNLRDK సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ


లిటిల్స్



గుండె మర్చిపోయింది

అనగనగా ఒక ద్వీపం. అక్కడ ఆపిల్, జామ, సపోటా లాంటి పండ్ల చెట్లు ఉండేవి. కొన్ని కిందపడిపోయిన పండ్లను ఓ మొసలి తినేది. తన భార్యకూ తీసుకెళ్లేది. ఒక రోజు కింద పండ్లు ఏమీ లేవు. ఆపిల్ చెట్టుమీద ఓ కోతి కనపడింది. ఓ పండును ఇవ్వమని అడిగింది. వెంటనే కోతి ఒక ఆపిల్‌ను విసిరేసింది. అది ఎంతో రుచిగా ఉందని.. తన భార్యకోసం కూడా ఓ పండును ఇవ్వాలని కోరింది. ఆ కోతి అలానే చేసింది. మొసలి ఆ పండును తనభార్యకు ఇచ్చింది. 'ఎంత మధురమైన పండో' అనుకున్నవి.

అలా పండ్లకోసం వచ్చిన మొసలికి ఆపిల్ పండ్లమీద మక్కువ పెరిగింది. ఇద్దరూ స్నేహితులయ్యారు. ప్రతిరోజూ ఆపిల్ పండ్లను ఇస్తుంటే ఇంటికి తీసుకెళ్లేది మొసలి. ఒక రోజు కోతి కనపడలేదు. ఆ తర్వాత రెండు రోజులకు కనపడింది. 'అయ్యో.. ఎక్కడికెళ్లావ'ని మొసలి బాధను నటించింది. 'మా ఇంటికి రమ్మని .. నా భార్య పిలిచింది. నీకు మంచి ఆహారం పెట్టాలి. ఎందుకంటే నువ్వు మాకు ఆపిల్ పండ్లు ఇచ్చావు కదా' అన్నది. కోతి తెగ సంబరపడింది.




మరుసటి రోజు మొసలి గట్టు దగ్గరకు వచ్చింది. కోతి రెండు ఆపిల్ పండ్లతో చెట్టుమీద నుంచి ఎగిరి మొసలి మీద కూర్చుంది. అలా నీళ్లలో సగం ప్రయాణం చేశాక.. మొసలి తన బుద్ధిని బయటపెట్టింది. 'ఇన్ని ఆపిల్ పండ్లు తిన్న నువ్వు ఎంత రుచిగా ఉంటావో. ముఖ్యంగా మా ఆవిడకు నీ గుండె కావాలి' అన్నది మొసలి. క్షణాల్లో కోతికి విషయం అర్థమైంది. మాయదారి మొసలి మాయ చేసిందే అనుకుంది. 'అయ్యో.. మొసలి బావా. ఎంత తప్పు చేశావు? ముందే చెప్పి ఉంటే ఆ ఆపిల్ చెట్టుకు వేలాడ తీసిన గుండెను తెచ్చేదాన్ని కదా.. ఎంత అన్యాయం. ఒక మాట చెప్పాలి కదా' అన్నది. 'అయ్యో.. వెనక్కి వెళ్దాం. ఆ గుండె కోసం' అన్నది మొసలి. 'నీ భార్యతో మాట్లాడాక చూద్దాం' అన్నది కోతి. 'నీ గుండెతో రాకుంటే అంతే నా సంగతి. ఆలస్యం అయినా వెనక్కి వెళ్దాం' అంటూ వెనక్కి తిరిగింది మొసలి.

కబుర్లు చెప్పుకుంటూ మొసలిని కోతి వెనక్కి తీసుకెళ్లింది. తీరం వచ్చిందో లేదో కోతి చెంగుమని మొసలి మీద నుంచి ఎగిరి చెట్టుమీద కూర్చుంది. 'హాహాహా..' అంటూ గట్టిగా నవ్వింది. 'ఎవరైనా గుండెను చెట్టుకు వేలాడదీస్తారా? నీదో మట్టి బుర్ర. నీ అమాయకత్వానికి జోహార్లు.. నీ మోసానికి నమస్కారాలు' అంటూ మొసలిని దుయ్యబట్టింది కోతి. మొసలి తన తప్పిదానికి చింతిస్తూ వెనక్కి వెళ్లిపోయింది. అలా కోతి లౌక్యంతో బతికి బయటపడింది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



డైలీ సుడోకు - 258

	2				4		1	8
			8					
7			2	6		3		
5		2						9
	7		9		3		5	
8						4		7
		7		9	2			1
					7			
2	3		5				4	

సుడోకు - 257 సమాధానం

2	4	5	8	1	3	6	7	9
7	3	6	4	2	9	1	5	8
8	1	9	5	7	6	2	3	4
9	6	2	7	3	4	8	1	5
4	5	8	1	6	2	3	9	7
1	7	3	9	8	5	4	2	6
3	9	4	2	5	8	7	6	1
6	8	1	3	9	7	5	4	2
5	2	7	6	4	1	9	8	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.